30-10Pg1exHMNWJQE 1 VJA_30-10Pg1exHMNWJQE.qxd 30/Oct/25 12:42 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
30-10-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 268 పేజీలు: 12 వెల: 6.50

## ఓట్ల కోసం డాన్స్‌కైనా మోడీ రెడీ: రాహుల్

## ట్రంప్‌కు దక్షిణ కొరియా అత్యున్నత పురస్కారం



బుధవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే చేస్తున్న సిఎం చంద్రబాబు

విద్యుత్ సరఫరా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ 3లో

# ముంచేసిన మొంథా



భారీవర్షాలకు నీట మునిగిన ఒంగోలు పట్టణం

## నరసాపురం వద్ద తీరందాటిన తుఫాన్

పెనుముప్పు నుంచి బయటపడిన కోనసీమ

ధ్వంసమైన ఉప్పాడ బీచ్‌రోడ్డు

క్షేత్ర స్థాయి పరిశీలన జరిపిన సిఎం చంద్రబాబు

# ఇది పెను విపత్తు

- ముందస్తు చర్యలతో వేలకోట్ల నష్టాన్ని నివారించగలిగాం
- ముంపు ప్రాంతాలను ఏరియల్ సర్వేద్వారా పరిశీలించిన సిఎం చంద్రబాబు
- నష్టం అంచనాలు త్వరగా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- బాధితులకు తక్షణ సాయం అందించాలని సూచన
- మొత్తం 249 మండలాలు, 1434 గ్రామాలు, 48 మునిసిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం



భారీ వర్షాలకు నెల్లూరులో ఇంటిపై కూలిన చెట్టు

**విజయవాడ,అక్టోబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** మొంథా తుపాను పెనువిపత్తు అని, రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తుఫాన్‌ల సమయంలో పనిచేసిన అనుభవం నాకుందని తెలిపారు. ఈ మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని అందువల్ల ముందు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి ప్రాణనష్టం లేకుండా చూశామని అన్నారు. ఆస్తి నష్టం కూడా చాలావరకు తగ్గేలా చర్యలు తీసుకున్నామన్నారు. పలుజిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీవర్షం నమోదైందని అన్నారు. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని అలానే కౌలురైతులకు పరిహారం అందిస్తామని వెల్లడించారు. తుపాను సమయంలో అధికారులు బాగా పనిచేశారని సిఎం చంద్రబాబు కొనియాడారు. జిల్లా కలెక్టర్లు,అధికారులు,మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశంలో మాట్లాడుతూ ముందస్తు చర్యలతో తుఫాను ప్రభావం నుంచి రూ.వేల కోట్ల నష్టాన్ని నివారించగలిగామని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి >>2

## భారీగా పంటనష్టం

కోనసీమలో నేలకొరిగిన వరి, అరటి పంటలు

పలు గ్రామాల్లో తెగిన రోడ్లు, కూలిన వంతెనలు, పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

**విజయవాడ, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని వణికించిన మొంథా తీవ్ర తుపాను ఎట్టకేలకు తీరం దాటింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత నరసాపురం వద్ద తీరం దాటినట్లు భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ మధ్యాహ్నానికి ఇది భూభాగంపైనే బలహీనపడనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధవారం కూడా కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని గంటకు వంద కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులుహెచ్చరించారు. ఇది ఉత్తర వాయ >>2



నీటమునిగిన వరిచేలు



బుధవారం కోనసీమలో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, అక్టోబరు 29 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మొంథా తుపాన్ గత మూడు రోజులు నుండి గడగడలాడించింది. ఎట్టకేలకు మంగళవారం రాత్రి కోనసీమ జిల్లాలోని అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకి, నర్సాపురం వద్ద తీరాన్ని దాటింది. ఈ సమయంలో గంటకు 12 కిలోమీటర్ల వేగంతో కదిలి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య నరసాపురం సమీపంలో తీవ్ర తుపాన్‌గా కొనసాగుతుంది. తుపాన్ కారణంగా కాకినాడ, కోనసీమ జిల్లాలో రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదయింది. గాలులతీవ్రత ఇంకాకొనసాగుతుంది. గంటకు 85 నుంచి 95 కిలోమీటర్ల >>2

# రహదార్లకు తీరని నష్టం



బుధవారం తుఫాను ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

## విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నాం

నేటినుంచి మళ్లీ 100% ఆర్టీసి సర్వీసులు

బియ్యం, నిత్యావసరాలకు ఎలాంటి లోటు లేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి. అక్టోబరు 29. ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాన్ ముందుగా ఊహించినంత తీవ్రత కనబరచకపోయినా, విద్యుత్ సరఫరా మరియు రహదారి రవాణా వ్యవస్థలకు ఇబ్బందులు కలిగించిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డైరి, రీడెవలప్‌మెంట్ మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.తుఫాన్ ఈదురుగాలుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగాసుమారు 300 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని, వాటి పునరుద్ధరణ పనుల్లో 80 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన 20 శాతం పనులు రాబోయే రెండు గంటల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎంఐడి పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్ల కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేయాలి అని సూచించారని, ఆ దిశగా వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం వంటి ప్రాంతాల నుండి మానవ వనరులను తరలించి విద్యుత్‌పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 134 కిలోమీటర్లమేర రహదారులపై కూలిన వృక్షాలను తొలగించి రాకపోకలను పూర్తిగా పునరుద్ధరించామని, నేటి నుండి ఆర్టీసీ బస్సులు నూటికి నూరు శాతం రాకపోకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం పునరావాస కేంద్రాలలో భోజన వసతి పొందిన వారందరికీ బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పించి, రాత్రి భోజనం అనంతరం స్వగృహాలకు పంపించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3,000 ఆర్థిక సహాయాన్ని వెంటనే అందజేయాలని అధికారులు ఆదేశించారని వెల్లడిం >>2



## యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

-డి.సిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** మొంథా తుఫాను ప్రభావంతో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్‌లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మొంథా ప్రభావంపై క్షేత్రస్థాయి నుంచిసమాచారం తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను బలహీనపడినా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలను సురక్షిత ప్రదేశాల్లోనే ఉంచాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, వసతి కల్పించాలని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పారిశుద్ధ కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈదురు గాలులు,భారీ వర్షాల మూలంగా కలిగిన నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ, నెల్లూరు జిల్లాలో పెన్నానది, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు.పునారావాస కేంద్రాల్లో ఉన్న ఆశ్రితులందరికి సహాయక చర్యలు అందాలన్నారు. పరిస్థితులు చక్కబడిన తరువాతనే వారిని ఇంటికి పంపించాలన్నారు.తుఫాన్ ప్రభావంతో నెలకొరిగిన చెట్లు తొలిగించాలన్నారు. నేలకు ఒరిగిన విద్యుత్తు స్తంభాలను,తెగిన తీగలను సరిదిద్దాలన్నారు. ఈ కారణాలతో ఆగిన విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలన్నారు. గ్రామాల్లో వరద నీటిని తొలిగించి,దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రతిపదికన మరమ్మత్తులు చేయాలన్నారు. గ్రామాల్లో తుఫాన్ బాధితులకు నిత్యావసర వస్తువులు,ఇతర సహాయక చర్యలు అందించాలన్నారు.

# విహెచ్‌ఎల అర్హత ప్రక్రియ మార్చడం సబబు కాదు..





## స్పష్టం చేసిన హైకోర్టు

**విజయవాడ.అక్టోబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ఉద్యాన సహాయకుల (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్) నియామక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అర్హతలను మార్చడం సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆట మొదలయ్యాక క్రీడా నిబంధనలను మార్చేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేసింది. గ్రామ సచివాలయాల పరిధిలో వీహెచ్ఎ ఉద్యోగాల 'అర్హత' విషయంలో కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. దీన్ని పూర్వ తేదీ నుంచి (రెట్రాస్పెక్టివ్) అమలు చేసేందుకు చట్ట విరుద్ధమంది. రాత పరీక్షలో అర్హత సాధించిన పిటిషనర్లను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే, తాజా మెరిట్ లిస్ట్ ప్రచురించి, ఫలితాల ప్రకటనకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.వ్పటికే ఎంపికైన వారి కంటే కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఎక్కువ మెరిట్ సాధించి ఉంటే గనక భవిష్యత్తు పదోన్నతుల్లో వారికి ఎటువంటి నష్టం జరగకుండా నోషనల్ సీనియారిటీ కల్పించాలి. ఈ ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ మేరకు కీలక తీర్పును వెలువరించారు.

**పోస్టుల నియామకానికి ప్రకటన జారీ:** 2019లో గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఆ సంవత్సరం జులైలో కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా 4 వేల వీహెచ్ఎ పోస్టుల నియామకానికి ప్రకటన జారీ చేసింది. బీఎస్సీ (హార్టికల్చర్)/(హానర్స్), హార్టికల్చర్/బీటెక్, హార్టికల్చర్ డిప్లొమా చేసిన వారు, తదితర అభ్యర్థులు అర్హులుగా పేర్కొంది. 4,000 పోస్టుల్లో 2,217మాత్రమే భర్తీఅయ్యాయి. హార్టికల్చర్‌శాఖలో పని చేస్తున్న మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ అధికారి (ఎంపిఇఒ), మైక్రో ఇరిగేషన్ >>2



బుధవారం నియోజకవర్గాల పునర్విభజనపై మంత్రి మండలి ఉప సంఘం సమావేశ దృశ్యం

జిల్లాల పునర్విభజనపై వారంలో

## మళ్లీ చర్చలు

ప్రజా అభ్యంతరాలకు అనుగుణంగానే నిర్ణయం: మంత్రులు

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లాల పునర్విభజనపై రెండోరోజు సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం వారం రోజుల్లో మరోసారి చర్చించి సిఎం చేసిన ప్రతిపాదనలపై తుది నిర్ణయానికి రావాలని నిర్ణయించారు. మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు అనగాని సత్యప్రసాదు, పి.నారాయణ, ఎన్.మనోహర్, సత్యకుమార్‌యాదవ్, నిమ్మల రామానాయుడు బుధవారం సమావేశమయ్యారు. మంగళవారం నాటి సమావేశంలో సిఎం చేసిన పలు సూచనలపై సుదీర్ఘంగా చర్చించారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని, ప్రస్తుతం పోలవరం నియోజకవర్గం పరిధిలోకి వెళ్లిన పునరావాసులతోపాటు ప్రజల నుండి అభిప్రాయ సేకరణ అనంతరం వారిని ఏ జిల్లాలో ఉంచాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నివేదికను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించింది, వాటిల్లో మార్కాపురం, మదనపల్లె కొత్త నియోజకవర్గాలతోపాటు పలు డివిజన్లకు సంబంధించి వారి భౌగోళిక స్వరూపం నేపథ్యంలో కొన్నిటిని జిల్లాలు మార్చాలని ప్రతిపాదించారు. అయితే అల్లూరి సీతారామరాజు గిరిజన జిల్లాలో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నిర్ణయించారు. దీనిపై సిఎం పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు పోలవరం నియోజకవర్గం పరిధిలో పునరావాసం కల్పించామని, వారి అభిప్రాయం తీసుకుని అవసరమైతే వారిని కూడా తూర్పుగోదావరిలో కలిపే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు రెండు జిల్లాల పరిధిలో ఉన్న నేపథ్యంలో ఈ >>2

## పిపిపి విధానంపై ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు 2లో



బుధవారం అమరావతిలో జస్టిస్ సుభేందు చేత ప్రమాణం చేయిస్తున్న సిజె ధీరజ్‌సింగ్ ఠాకూర్

## హైకోర్టు జడ్జిగా జస్టిస్ సుభేందు ప్రమాణం

**విజయవాడ,అక్టోబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. ఆ మేరకు బుధవారం నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ సుభేందుతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. కలకత్తా హైకోర్టు నుండి జస్టిస్ సుభేందు ఎపి హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్‌జనరల్ దమ్మాలపాటి >>2



భారీ వర్షాలకు ఒంగోలులో నీట మునిగిన కార్లు


బుధవారం రోడ్లపై పడిన చెట్లను తొలగిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు


భారీ వర్షాలకు దెబ్బతిన్న ఉప్పాడ రోడ్డు

# ఇది పెను విపత్తు

>> మొంథా తుఫాన్ విషయంలో సమర్థవంతంగా వ్యవహరించి నష్టనివారణ చర్యలు చేపట్టామన్నారు.సీఎం నుంచి సచివాలయ సిబ్బంది వరకు జిల్లా అడ్మినిస్ట్రేషన్‌తో సహా అంతా కలిసి టీంగా పనిచేశామన్నారు.కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు.మరో రెండు రోజులు ఇదే విధంగా పనిచేస్తే...బాధిత ప్రజలకు మరింత ఊరట ఇవ్వగలం.తుఫాను వెళ్లింది.కాబట్టి వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు పని చేయాలి. మంత్రులు,అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి. వారికేమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలి. మొంథా తుఫాను వల్ల వివిధ విభాగాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలి. కేంద్రానికి నివేదిక అందివ్వాలి. తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలి. నిర్వాసితులను ఆదుకోవాలి అన్నారు. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగాం. సచివాలయాలపై మైక్రో అసెస్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేసి కింది స్థాయి వరకు ప్రభుత్వం ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం. ఇదొక నూతన విధానం తీసుకొచ్చాం. తుఫాన్‌ను ఎవరూ నివారించలేరు. కానీ ముందు జాగ్రత్తలతో నష్టాన్ని నివారించగలుగుతాం. కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూంల్లో కూర్చుని రియల్ టైం సమాచారం తెప్పించుకుని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా, విద్యుత్ వైర్లు తెగిపడినా యుద్ధప్రాతిపదికన తొలగించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రెయిన్లు క్లీన్ చేయడం వల్ల కాలనీలు ముంపు బారిన పడకుండా చేశామన్నారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను కూడా పునరుద్ధరించేందుకు 10 వేల మందిని అందుబాటులో పెట్టుకున్నామన్నారు. నేడు మధ్యాహ్నానికి సాధారణ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరుగుతుందన్నారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకులు అందించాలని చంద్రబాబు ఆదేశించారు. కలెక్టర్లు,అధికారులు,మంత్రులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. తుఫాను నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సినచర్యలపై అధికారులు, మంత్రులకు సూచనలు చేశారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది బాగా పనిచేశారు. చెట్లు కూలినా,విద్యుత్ తీగలు తెగి పడినా యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. మున్సిపాలిటీల్లో డ్రెయిన్‌ల శుభ్రం వల్ల ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు 10 వేల మందిని అందుబాటులో ఉంచాం. ఇవాళ మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుఫాను కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కల్గుతుంది. మన చర్యలతో ప్రభుత్వంపై ప్రజలకు భరోసా పెరిగింది'అని చంద్రబాబు తెలిపారు.ఈ నేపథ్యంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగించుకుని రాష్ట్ర సచివాలయానికి సిఎం చంద్రబాబు నాయుడు చేరుకున్నారు. తిరిగి తుఫాన్ వల్ల వచ్చిన నష్టంపైనా, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపైనా ఆర్టీజీఎస్ నుంచి అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షనిర్వహించారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ తక్షణం జరగాలని స్పష్టం చేసారు.ఎక్కడా వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను పటిష్ట పరచాలని, పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సిఎం ఆదేశించారు.

తుఫాన్ తీరం దాటడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 1,209 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.1.16 లక్షల మందికి ఆశ్రయం కల్పించామన్నారు.రాష్ట్రంలో మొత్తం 249మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాన్ ప్రభావం ఉన్నట్లు గుర్తించారు. తుఫాన్ నష్టంపై తాజా వివరాలను సీఎంకు అధికారులు వివరించారు.రాష్ట్రంలోని 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో 87 వేలహెక్టార్లలో పంటకు నష్టం జరిగిందన్నారు. 59 వేలకుపైగా హెక్టార్లలో నీటమునిగిన వరిపంట, పత్తి, మొక్కజొన్న, మినుము పంటలకు నష్టం కలిగిందన్నారు. భారీవర్షాలతో నష్టపోయిన 78,796 మంది రైతులు.రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన 42 పశువులు...రాష్ట్రంలో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు, 14 బ్రిడ్జిలు, కల్వర్టులుదెబ్బతిన్న 2,294 కి.మీ. పొడవున ఆర్ అండ్ బీ రహదారులు.. రూ.1,424 కోట్ల నష్టం రూరల్ వాటర్ సప్లయ్‌కు సంబంధించి రూ.36 కోట్లు వరకు, ఇరిగేషన్ పనుల్లో రూ.16.45 కోట్ల మేర నష్టం కలిగిందన్నారు. సురక్షిత ప్రాంతాలకు 3,175 మంది గర్భిణీల తరలింపు.. 2,130 మెడికల్ క్యాంపుల నిర్వహణ297 రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండగా, వాటిని దారి మళ్లించేలా చర్యలురాష్ట్రంలో మొత్తం 380 చెట్లు రహదారులపై విరిగిపడగా, అన్నింటినీ తొలిగించామని ప్రభుత్వ యంత్రాంగం వివరించింది.

# నరసాపురం వద్ద తీరందాటిన తుఫాన్

>> వేగంతో గాలులు వీసాయి. వాతావరణ శాఖ అధికారులు ముందుగా ప్రకటించిన విధంగా అందరూ భావించినట్లు కాకినాడ- మచిలీపట్నం మధ్య తీరం దాటింది. తీరాన్ని తాకిన సమయంలో పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీసాయి. అల్లకల్లోలంగా మారిన సముద్రం నుండి పెద్ద ఎత్తున అలలు ఎగసిపడ్డాయి. అంతర్వేది వద్ద సముద్రం ముందుకు రావడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలడంతో మంగళవారం ఉదయం నుండి బుధవారం వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అనేక ప్రాంతాలు అంధకారమయంగా మారాయి.మొంథా తుపాన్ కారణంగా నష్ట వాటిల్లినప్పటికీ కోనసీమ ప్రాంతం పెను ముప్పు నుండి బయటపడింది. అందరూ కోనసీమ వద్ద తుఫాను తీరం దాటుతోందని, హెచ్చరికల నేపథ్యంలో 1996 నవంబర్ 6న హరికేన్ సృష్టించిన నష్టాన్ని జ్ఞాపకం చేసుకుంటూ కోనసీమ వాసులు వణికిపోయారు. అయితే తీరాన్ని తాకే సమయానికి సైక్లోన్ విచ్ఛిన్నమై క్రమేపీ బలహీనపడుతూ అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకడంతో భారీ నష్టం తప్పింది. మొంథా తుపాను కోనసీమ వద్ద తీరాన్ని తాకినప్పటికీ చిన్నపాటి నష్టంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుపాను ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. భారీ వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పాడ బీచ్ రోడ్ తుపాన్ తాకిడికి ధ్వంసం అయింది. సముద్రం నుండి రాకాసి అలలు ఎగసిపడుతూ బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి.

**ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తత**

మొంథా తుపాన్ పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాన్ ప్రభావం ఉండే ప్రాంతాల నుండి జనాలను పునరావాస కేంద్రాలకు తరలించి ప్రాణ నష్టాన్ని నివారించడంలో అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసింది. ఎప్పటికప్పుడు సిఎం సమీక్షలు చేసి అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎక్కడ ప్రాణ నష్టం జరక్కుండా అధికారులు జాగ్రత్త వహించారు.

**క్షేత్రస్థాయి పరిశీలన చేసిన సిఎం చంద్రబాబు నాయుడు**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఓడలరేవుకు హెలికాప్టర్‌లో వచ్చారు. అక్కడి నుండి రోడ్డు మార్గాన తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. కౌలు రైతులను ఆదుకుంటామన్నారు. నష్ట పరిహారాన్ని త్వరలో అందజేస్తామన్నారు. ప్రతి రైతుకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఓడలరేవు హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపి హరీష్ మాథూర్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మెట్ల రమణబాబు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు.

# భారీగా పంటనష్టం

>> వ్యంగా తెలంగాణ మీదుగా ప్రయాణించి ఈ మధ్యాహ్నానికి చత్తీస్‌గఢ్ వద్ద మరింత బలహీన పడుతుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాతీరాల్లో సముద్రఅలలు 3మీటర్ల ఎత్తుకుపైగా ఎగసిపడే ప్రమాదముందని మత్స్యకారులు గురువారం వరకు వేటకు వెళ్లొద్దని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. ఈ మధ్యాహ్నం వరకు తీరం వెంబడి గరిష్ఠంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మధ్యాహ్నానికి 80 కిలోమీటర్లకు, సాయంత్రానికి 65 కిలోమీటర్లకు తగ్గుతాయని అంచనా వేస్తోంది. మొంథా తీరం దాటినప్పటికీ గాలుల ప్రభావం కొనసాగుతోంది. గంటకు 85నుంచి 95, గరిష్టంగా 105 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. విశాఖ, మచిలీపట్నంలోని డాప్లర్ వెదర్ రాడార్లు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

మొంథా ప్రభావంతో ఎపిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ధాటికి ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు అల్లకల్లోలంగా మారాయి. భారీ వర్షాలు కురవటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అనేక చోట్ల అంధకారం నెలకొంది.

తుఫాన్‌ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. నదులు, చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో అడవిరావులపాడు, తోటరావుల పాడు, చందాపురం వద్ద నల్లవాగు క్యాజ్‌వేలపై పొంగి ప్రవహించాయి. భీమవారిపాలెం, సూర్యలంక రోడ్, మూలపాలెం, కర్లపాలెం, పార్లీ, పిట్లవానిపాలెం, కొండబోట్లవారిపాలెంలో అనేకచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో బాపట్ల అంతా అంధకారమైంది.

బాపట్ల జిల్లా యద్దనపూడిదేగరమూడి వద్ద పర్చూరు వాగు వంతెనపై నీటి ప్రవాహం పొంగిపొర్లుతుంది.చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, కారంచేడు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పర్చూరు మండలం ఉప్పుటూరు, వేటపాలెం మండలం కొత్తపేటలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కృష్ణా జిల్లాలో తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. గుడివాడలోని ప్రధాన మార్గాల్లో చెట్లు పడిపోయాయి. నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం, కృత్తివెన్ను, గన్నవరం తదితర మండలాల్లో చెట్లు నేల కూలాయి. విద్యుత్తు తీగలు తెగిపడటంతో సరఫరా నిలిచింది. మచిలీపట్నంలోని మంగినపూడి తీరంలో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. నిజాంపట్నం నుంచి రేపల్లె మార్గంలో పడిన చెట్లను బృందాలు తొలగించాయి. మచిలీపట్నం మంగినపూడి రహదారిపై పడిన వృక్షాన్ని సిబ్బంది తొలగించారు. అనకాపల్లి, మచిలీపట్నంలో పడిన చెట్లను సహాయ బృందాలు తొలగించారు. నాగాయలంక, హంసలదీవి, చినగొల్లపాలెం, పెదపట్నం తదితర తీర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ముంపు, తీర గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

మొంథా ప్రభావంతో నేడు భారీనుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ఇవాళ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో భారీ వర్షాలు కురవవచ్చని మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 35వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. కోనసీమలో వరి, అరటి పంటల రైతులకు భారీగా పంటనష్టంవాటిల్లింది. రాజోలు, పి.గన్నవరం, రావులపాలెం, చాకలిపాలెం, కనకాయలంక గ్రాయమాల్లో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విజయనగరం జిల్లా జామి మండలంలో పంట చేతికి వచ్చే సమయంలో వరిపంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతన్నలు వాపోతున్నారు. ప్రకాశం జిల్లాలో వేరుశనగ, పొగాకు, మిర్చి పంటలు సైతం దెబ్బతిన్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో విస్తృత పర్యటించారు.

# రహదార్లకు తీరని నష్టం

>> చారు. జిల్లా వ్యాప్తంగా 400 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 10,150 మందికి ఆశ్రయం కల్పించామని, వీరిలో ప్రతి కుటుంబానికి రూ.3,000 చొప్పున, ఒంటరి వ్యక్తులకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, చేనేత కార్మికులు తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా ఉపాధి కోల్పోయినందున వారికి 50 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. బియ్యం పంపిణీని రేషన్ డీలర్ల ద్వారా నేటి నుండే ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిశాంతిని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల వరి పంట తుఫాన్ ప్రభావంతో నష్టపోయిందని, అలాగే ఉద్యాన పంటలైన అరటి తదితర పంటలు కూడా నష్టానికి గురైనట్లు తెలిపారు. ఈ నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పంటల నష్టాలను తగ్గించేందుకు విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల సహకారంతో చర్యలు తీసుకుంటామని, ఆర్థిక సహాయం పారదర్శకంగా అందజేయాలని సూచించారు. బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకోవాలని ఆదేశించారు.

మొంథా తుఫాను తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆంధ్రా, తెలంగాణ, చత్తీస్‌గఢ్ భూభాగంపై ఇది కొనసాగుతోంది. దీని ప్రభావంతో తీరం వెంట 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. 'మొంథా' క్రమంగా బలహీనపడుతోందని ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ మేరకు ఆసంస్థ ఎండి ప్రఖర్‌జైన్ ఓ ప్రకటన విడుదలచేశారు. తుఫాను ప్రభావంతో నేడు ఎపిలో విస్తారంగా వర్షాలుకురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం,పార్వతీపురం మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా,ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే వీలుంది. కాకినాడ,డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ,తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు,నంద్యాల,అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది' అని అధికారులు తెలిపారు. కోస్తాంధ్రలో ఈదురుగాలులు వీస్తాయని...ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.


అల్లూరి జిల్లా బొర్రా-చిమిడిపల్లి రైల్వేస్టేషన్ మధ్య ట్రాక్‌పై పడిన బండరాళ్లు


తుఫాన్ ధాటికి లంబసింగి ఘాట్‌రోడ్‌లో విరిగిపడిన చెట్లు


భారీ వర్షాలకు నెల్లూరు జిల్లా సోమశిల రామాలయంలో విరిగిపడిన ధ్వజస్తంభం

## జస్టిస్ సుభేందు ప్రమాణం

>> శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ,హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్. ద్వారకానాథ్‌రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ.సాంబశివప్రతాప్,డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు,పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీ నారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు,హైకోర్టు ఉద్యోగులు, ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జ్యుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

30-10-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి ఉ.10.03
శ్రవణ సా.6.28
వర్జ్యం : రా.10.31-12.05
దు.ఉ.9.56-10.42, 2) మ.2.34-3.20
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో పలుకుడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు.

**మిథునం:**పొదుపు పథకాలు అవలంభిస్తారు. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

**కర్కాటకం :** మీ తొందరపాటుతనం వల్ల కాంట్రాక్టులు చేజారిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

**సింహం:**ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి.

**కన్య :** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**తుల :**బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** దైవ సంబంధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఒకానొక బాధ్యతను పూర్తి చేసి బరువు దించుకుంటారు.

**మకరం:** అప్పు చేయడం, అప్పు ఇవ్వడం రెండు చేయకండి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కుంభం:**కార్యాలయంలో పనిభారం పెరిగినప్పటికి సమర్ధతతో నిర్వహిస్తారు.

**మీనం :** ఆర్థికంగా లాభ పడకపోయినా మీ శ్రమను అధికారులు గుర్తిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వెలుగొండ సొరంగంలో చేరిన వరద నీరు

## ప్రాజెక్టు రెండో సొరంగంలో చిక్కుకుపోయిన 200 మంది కార్మికులు

## కార్మికులను సురక్షితంగా కొల్లం వాగు వద్దకు తరలింపు

## అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపిన అధికారులు

**పెద్దదోర్నాల, అక్టోబరు 29, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు సొరంగంలో పెను ప్రమాదం తప్పింది. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలతో నిర్మాణంలో ఉన్న రెండో సొరంగంలోకి అకస్మాత్తుగా వరద నీరు చేరడంతో అక్కడ పని చేస్తున్న 200 మంది కార్మికులు లోపల చిక్కుకుపోయారు. నీటి ప్రవాహం వేగంగా పెరగడంతో వెంటనే సమాచారం అందుకున్న అధికారులు రక్షణ చర్యలు చేపట్టి సురక్షితంగా వెలుపలకి తీసుకొచ్చారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం కొత్తూరు సమీపంలో వెలుగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. బుధవారం కార్మికులు పనిలో నిమగ్నమై ఉండగా ఒక్క సారిగా సొరంగంలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో లోపల ఉన్న 200 మంది కార్మికులు బయటకు వచ్చే మార్గం లేక సొరంగంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ప్రాజెక్టు అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. సొరంగం లోపల ఉన్న వారిని గట్టిగా ధైర్యపరుస్తూ నియంత్రిత మార్గంద్వారా సొరంగంలో చిక్కుకున్న కార్మికులందరిని కృష్ణానది సమీపంలోని కొల్లంవాగువద్దకు సురక్షితంగాచేర్చారు.వారంతా క్షేమంగా ఉన్నారని, వెలిగొండ ప్రాజెక్టు ఇఇ కృష్ణారెడ్డి తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా వారిని కట్టుదిట్టంగా అక్కడ నుండి ప్రత్యేక బోట్ల ద్వారా శ్రీశైలానికి తరలించారు.

# అర్హత ప్రక్రియ మార్చడం సబబు కాదు..

>> అసిస్టెంట్ అధికారి (ఎంఐఏవో) అభ్యర్థన మేరకు అర్హతలో సవరణలు తీసుకు వచ్చింది. బీఎస్సీ (బీజెడ్‌సీ) లేదా బీఎస్సీ, ఎంఎస్సీలో హార్టికల్చర్‌ను ఒక సబ్జెక్ట్ చదివిన వారు, 10+2తో ఒక సంవత్సరం హార్టికల్చర్ డిప్లొమో, బీఎస్సీ (అగ్రి) చేసినవారు, తదితరులను రాత పరీక్షకు అనుమతించింది.2020 జూన్‌లో రాత పరీక్షకు 5 రోజుల ముందు ఏపీ హార్టికల్చర్ సబార్డినేట్ సర్వీసు నిబంధనలను ప్రభుత్వం సవరించింది. తద్వారా గతంలో ఇచ్చిన అర్హతల సడలింపును రద్దు చేశారు. దీని వల్ల ప్రభావితులైన అభ్యర్థులు హైకోర్టులో వ్యాజ్యాలు వేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు జివి శివాజీ, వై. మల్లికార్జునరెడ్డి, ఆర్. హరీష్‌కుమార్ వాదించగా, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది కల్యాణ్ చక్రవర్తి వాదనలు వినిపించారు. ఇరువైపు వాదనలూ విన్న న్యాయమూర్తి, చట్టపరమైన నిబంధనలు లేనప్పుడు ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుల ద్వారా పోస్టుల భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టవచ్చని స్పష్టత నిచ్చారు. 'ప్రస్తుత వ్యాజ్యాల విషయంలో 2020 జనవరి 10న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. అర్హతల్లో సవరణ చేస్తూ 2020 జూన్‌లో తెచ్చిన నిబంధనలను అంతకు ముందు ఇచ్చిన నోటిఫికేషన్‌కు వర్తింపచేయడం సముచితం కాదు' అని తీర్పులో పేర్కొన్నారు.

# వారంలో మళ్లీ చర్చలు

>> నిర్ణయం ద్వారా ఒక జిల్లాకు పరిమితం చేయాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజల అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. వీటిపై బుధవారం మరోసారి సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం ఇదే అంశంపై చర్చించింది. సిఎం చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనికోసం అభిప్రాయ సేకరణ తీసుకుని పూర్తి నివేదికను సమర్పించాలని అభిప్రాయపడింది. గుంటూరు జిల్లాలోని చుండూరను బాపట్లఓ విజయవాడలో కలిసిపోయిన గన్నవరం, పెనుమలూరు నియోజకవర్గాలను కృష్ణాజిల్లాలో కలపడంపట్ల ఈ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి, అలాగే గిరిజన జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని అభిప్రాయ పడ్డారు. అలాగే బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రులు ప్రతిపాదించారు. బుధవారం సమావేశంలోనూ ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. గూడూరు రెవెన్యూ డివిజన్‌ను నెల్లూరులో కలపాలని ప్రతిపాదించారు. గతంలో ఒక నియోజకవర్గంలోని మండలం పరిధిలో ఉన్న గ్రామం మరొక నియోజకవర్గంలోకి వెళ్లిందని, దీనివల్ల అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడ్డాయని భవిష్యత్‌లో అలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నిర్ణయించినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం అనంతరం బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల తలెత్తిన ఇబ్బందులపై చర్చించి సరిదిద్దాలని నిర్ణయించామని తెలిపారు. విభజన హామీలకు అనుగుణంగా జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, వాటిపై చర్చించామని తెలిపారు. వచ్చేవారంలో మరోసారి సమావేశం అయిన తరువాత పూర్తిగా నివేదిక ఇస్తామని మంత్రి తెలిపారు.

# పిపిపి విధానంపై ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని.. అది చట్టవిరుద్ధం అయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని హై కోర్టు స్పష్టం చేసింది. టెండర్ ప్రక్రియను అడ్డుకుంటూ ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు క్లారిటీ ఇచ్చింది. థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలని పిటిషనర్ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది.కౌంటర్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి మరికొంత సమయం ఇచ్చింది. హైకోర్టు. తదుపరి విచారణని నాలుగు వారాలకు న్యాయస్థానం వాయిదా వేసింది. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 590ని సవాల్ చేస్తూ తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కొర్రా వసుంధర హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. హైకోర్టులో వేసిన పిల్‌పై ఇవాళ విచారణ జరిగింది. ఈ వ్యాజ్యంపై పిటీషన్ తరఫున హైకోర్టులో సీనియర్ న్యాయవాది శ్రీరాం, మరో న్యాయవాది అశోక్ రాం వాదనలు వినిపించారు. టెండర్లు ఖరారు చేయకుండా స్టే ఇవ్వాలని న్యాయవాదులు అభ్యర్థించారు. న్యాయవాదుల అభ్యర్థనని తిరస్కరించింది హైకోర్టు.

30-10Pg3exHMNWJQEKT 3 VJA_30-10Pg3exHMNWJQEKT.qxd 30/Oct/25 12:54 AM Page 1



# తిరుమల సమాచారం

## నేడు మలయప్పకు పుష్పయాగం - ఆర్జితసేవలు రద్దు



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో (నేడు) గురువారం పుష్ప యాగమహోత్సవం ఆగ˘మోక్తంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు బుధవారం సాయంత్రం అంకురార్పణ శాస్త్రోక్తంగా చేపట్టారు. నేటి ఉదయం ఆలయంలో ఉదయం రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి సంపంగి ప్రాకారంలోని కల్యాణమండపానికి వేంచేపు చేస్తారు, అక్కడ విశేష స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1గంట నుండి చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, కనకాంబరాలు, జాజి,రోజా,తామర, మల్లి, వృక్షి, బిల్వపత్రం, తులసి, పన్నీరు ఆరురకాల ఆకులతో 12రకాల పుష్పాలతో ఉత్సవమూర్తులకు పుష్పాలు, పత్రాలతో పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయమాడవీదుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో నేడు ఆర్జితసేవలు తిరుప్పావడ,కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం రద్దయ్యాయి. వేకువజామున తోమాల,అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు.

## శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని ప్రముఖ శైవాలయం తిరుపతి కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా బుధవారం కాభైరవహోమం జరిపించారు. యాగశాలలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పూజ, అష్ట భైవరహోమం, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. నేటి నుండి నవంబర్ 7వతేదీ వరకు చండీహోమం జరుగుతుంది. గృహస్థ భక్తులు 500 రూపాయలు చెల్లించి హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. కార్తీకమాసాన నెలరోజులపాటు హోమాలను ఏకాంతంగా జరిపించడం సంప్రదాయం.

## ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఆలయాలు

### - ఆధ్యాత్మికత పెంపొందించేలా టిటిడి కార్యాచరణ



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో, ఎస్సీఎస్టీకాలనీల్లో మతమార్పిడులను అరికట్టేందుకు, ఆధ్యాత్మికభావం పెంపొందించేందుకు ఆలయాలు నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఐదువేల ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ప్రజల్లో ఆధ్యాత్మికచింతన పెంపొందేలా,,భక్తిభావం కలిగించేలా ఆలయాలు అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇదే విషయంగా టిటిడికి సూచనలు చేయడంతో ఎస్సీ,ఎస్టీ ఆలయాల్లో భగవంతుని ఆలయాలను నిర్మించాలని టిటిడి ధర్మకర్తలమండలి తీర్మానించింది. శ్రీవాణి నిధులతో బాటు దాతల సహకారంతో ఈ ఆలయాల నిర్మాణం చేపట్టనుంది. ఇప్పటికే శ్రీవాణి ట్రస్ట్‌ద్వారా కూడా నిధులు రెండువేలకోట్లరూపాయలవరకు ఆదాయం చేరింది. ఈ నిధులతో దేశవ్యాప్తంగా టిటిడి ఆలయాలు నిర్మిస్తోంది. చాలావరకు కొన్ని ప్రాంతాల్లో ఆలయాలను నిర్మించి ధూపదీపనైవేద్యాలకు నిధులు కేటాయిస్తోంది. ఇప్పుడు ఎస్సీఎస్టీ కాలనీల్లో ఆలయాలు నిర్మించి హిందూ సనాతన ధర్మాన్ని విశ్వవ్యాప్తంచేయడమేగాక మతమార్పిడిలను పూర్తిగా అరికట్టాలనే సదుద్దేశ్యంతో ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. దేశవ్యాప్తంగా ఆలయాలు ఇప్పటికే నిర్మించింది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టిటిడి చర్యలు చేపట్టింది.


## అలిపిరి టోల్‌రోడ్డు గుంతలమయం

### కుండపోత వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాత వార్తప్రతి నిధి:** మొంథా తుఫాన్ ప్రభావంతో నాలుగురోజులు కురిసిన భారీ వర్షాలకు తిరుమలకు వచ్చే ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి టోల్‌గేట్ వద్ద రోడ్డు గుంతలమయమైంది. రోడ్డుపై కంకర తేలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు దిగుతుండటంతో మరమ్మతులకు గురవుతున్నాయి. అలిపిరి టోల్‌గేట్‌లో 12 వరుసలు ఉన్నాయి. ఈ వరుసల్లో 9,10,11 వరుసల రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. యాత్రికుల వాహనాలు వెళ్ళే ఈ మార్గంలో రోడ్లు గుంతలమయంగా మారడంతో వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## శేషాచలంలో 'హెమిఫిల్లోడాక్టిలస్ ఎస్పీ.ఎన్ఐవి' అరుదైన బల్లి



**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅడవులు వైవిధ్యంగా ఎన్నో రకాల జంతువులు, వృక్షజాతులు, ఔషధమొక్కలకు నిలయంగా ఉంది. ఇప్పుడు జీవావరణం పరిధిలో శాస్త్రవేత్తలు "హెమిఫిల్లోడాక్టిలస్ ఎస్పీ.ఎన్ఐవి" అరుదైన బల్లి జాతిని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జడ్ఎస్ఐ)కోల్‌కత్త శాస్త్రవేత్తల బృందం తిరుమలకొండపై పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపం సమీపంలోని దట్టమైన శ్రీగంధం వనంలో ఈ బల్లిని కనుగొన్నారు. ఈ కొత్తబల్లిజాతి పలుచగా తొండను పోలి ఉందని పేర్కొన్నారు. చందనపు చెట్టు బెరడుక్రింద నివసిస్తున్న సమయంలో దీన్ని గుర్తించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ధృతి బెనర్జీ ఈ జాతికి చెందిన మరో మల్లి హెచ్ అరకు యెన్సిస్ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని తెలిపారు. ద్వీపకల్పంలో వీటి దగ్గరి జాతులతో పోల్చినపుడు జన్యువైవిధ్యం కలిగిఉంటాయని వివరించారు.

### రెండోఘాట్‌లో ద్విచక్రవాహనాలు ఢీ!

**తిరుమల,అక్టోబర్ 29ప్రభాతవార్తప్రతినిధి:** అసలే బలమైన వర్షాలు కురిసి రోడ్డు పటిష్టత లేకపోయినసమయంలో తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో బుధవారం ఉదయం ద్విచక్రవాహనాలు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. తిరుపతికి చెందిన చంద్రమౌళి, చంద్ర ఇద్దరూ తిరుమలలో వ్యాపారాలు చేసుకుని జీవనంసాగిస్తున్నారు. బుధవారం ఉదయం తిరుమలకు వస్తుండగా వినాయకుని గుడి దాటిన తరువాత ఘాట్‌లో మలుపువద్ద అదుపుతప్పి తొలుత చంద్రమౌళి పడ్డాడు. ఆ వెనుకనే వచ్చిన చంద్ర ద్విచక్రవాహానాన్ని ఢీ కొని క్రిందపడ్డాడు. వెనుక వచ్చిన వాహనదారులు పరిస్థితిని గమనించి వెంటనే అంబులెన్స్‌లో తిరుపతి రుయాకు తరలించారు.



## వైఎస్సార్సీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి సిబిఐ కోర్టులో ఊరట

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి సీబీఐ కోర్టులో ఊరట లభించింది. లండన్ పర్యటనపై సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు డిస్మిస్ చేసింది. తన పెద్ద కుమార్తెను చూసేందుకు ఇటీవల వైఎస్ జగన్ లండన్ వెళ్లారు. అయితే బెయిల్ షరతులను ఉల్లంఘించారని, అలాగే తన సొంత ఫోన్ నంబర్‌ను వెల్లడించలేదని సీబీఐ పిటిషన్ చేసింది. లండన్ పర్యటనలో ఉన్న సమయంలో మూడు సార్లు జగన్‌కి కాల్ చేసినా నెంబర్ పని చేయలేదని పిటిషన్‌లో తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే పని చేయని నెంబర్ ఇచ్చారని సీబీఐ వాదనలు వినిపించింది. అయితే ఈ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. జగన్ తన కుమార్తెను కలిసేందుకు లండన్ వెళ్లారు. 10 రోజుల పాటు లండన్ టూర్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు నుంచి అనుమతి కూడా తీసుకున్నారు. ఎప్పటిలాగే బెయిల్ షరతుల్లో భాగంగా తాను అందుబాటులో ఉండే మొబైల్ ఫోన్‌నంబర్‌ను కూడా సీబీఐకి ఇచ్చారు. గతంలో ఇచ్చిన మొబైల్ నంబర్, ఈసారి ఇచ్చిన నంబర్‌కూ మధ్య వ్యత్యాసం ఉండటంతో సీబీఐ దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

## ఇసుక అక్రమ మైనింగ్ కేసు

### సుప్రీంకోర్టులో మరోసారి విచారణ వాయిదా

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ హయాంలో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు వ్యతిరేకంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుచ్చింది. ఈ మేరకు సదరు సంస్థపై దాదాపు రూ.18 కోట్ల జరిమానాను విధించింది. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ 2023 మే 15న జేపీ వెంచర్స్ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. అయితే, మరోసారి ఆ పిటిషన్‌పై ఇవాళ జస్టిస్ సంజయ్ కరోల్,జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే,ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే,ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం కేసులో తదుపరి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేసింది. కాగా,సెప్టెంబరు 3న జరిగిన విచారణలో భాగంగా జేపీ వెంచర్స్‌పై గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన ఎన్జీటీ రూ.18 కోట్ల జరిమానా నగదును 2 వారాల్లో డిపాజిట్ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్జీటీ జరిమానాపై గతంలో విధించిన స్టేను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. నాగేంద్రకుమార్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను న్యాయస్థానం పరిగణలోకి తీసుకుంది. అక్రమ ఇసుక తవ్వకాలపై కొంతకాలంగా నాగేంద్రకుమార్ న్యాయ పోరాటం చేస్తున్నారు.

## సీనియర్ సైంటిఫిక్ అధికారిపై విచారణకు ప్రభుత్వం ఆదేశం

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్ర లేబొరేటరీలో సీనియర్ సైంటిఫిక్ అధికారిగా పనిచేస్తున్న కె.యాదగిరిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారులుగా డ్రగ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయ జెడీని, మరో సీనియర్ సైంటిఫిక్ అధికారిని నియమించింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలను యాదగిరి ఎదుర్కొంటున్నారు. 2021 అక్టోబరు 20న ఒంగోలుకు చెందిన కె.శ్రీనివాస్,ఇతర ఫార్మాసిస్టుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. పదోన్నతికి విచారణ అడ్డంకిగా మారుతోందని యాదగిరి న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నిర్ధేశిత సమయంలో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### తుఫాను బాధితులకు రోజుకు 10వేల ఆహార పొట్లాలు

**విజయవాడ,అక్టోబరు 29, ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా,ఎన్టీఆర్,గుంటూరు,బాపట్ల,పల్నాడు జిల్లాలకు ఆత్మకూరు 'అక్షయపాత్ర' నుంచి రోజుకు 10 వేల ఆహారపొట్లాలు అందిస్తున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట సెంట్రల్ రీజియన్ ఉపాధ్యక్షుడు విలాసదాస తెలిపారు.

గుంటూరు జిల్లా మంగళగిరి అక్షయపాత్రలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వాధికారులు,హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్,అన్న క్యాంటీన్ నెట్‌వర్క్ ద్వారా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఆహార పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు.

# అమరావతి రైతులకు ప్లాట్‌ల కేటాయింపు రిజిస్ట్రేషన్లపై అసత్య ప్రచారం చేస్తున్నారు

- తుదిదశకు చేరిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- సచివాలయంలో మీడియాతో మంత్రి నారాయణ

**విజయవాడ,అక్టోబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని రైతులకు ప్లాట్ ల కేటాయింపు రిజిస్ట్రేషన్ల పై కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ అన్నారు.. .రైతులను ,ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారని ఆరోపించారు...రాబోయే నాలుగు నెలల్లో రైతులకు కేటాయించాల్సిన ప్లాట్ లతో పాటు రిజిస్ట్రేషన్లను కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేసారు మంత్రి.. సచివాలయంలో మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.అమరావతి విషయంలో పక్కా ప్రణాళికతో ముందు˘కెళ్తున్నామని అన్నారు. అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ,201419 మధ్య కాలంలో,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్ ల కేటాయింపు,రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురించి లెక్కలతో సహా మీడియా ముందు వివరించారు మంత్రి నారాయణ. అమరావతి కోసం భూసమీకరణ కింద మొత్తం 30,635 మంది రైతుల నుంచి 34,911.23 ఎకరాలను సీఆర్డీఏ ద్వారా తీసుకోవాలని నిర్ణయించామన్నారు.. వీటిలో ఇప్పటివరకూ 29,644 మంది రైతులకు సంబంధించిన 34,192.19 ఎకరాలకు ప్లాట్ ల కేటాయింపు పూర్తయిం దన్నారు...గత టీడీపీ ప్రభుత్వంలోనే 26,197 మంది రైతులకు సంబంధించిన 31,003.38 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తి కాగా...కూటమి ప్రభుత్వం వచ్చిన ఇప్పటివరకూ 2727 మంది రైతులకు సంబంధించిన 3188.81 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందన్నారు...ఇంకా 991 మంది రైతులకు సంబంధించిన 719.04 ఎకరాలకు ప్లాట్ల కేటాయింపు చేయాల్సి ఉందన్నారు..వీటిలో ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం,లంక భూములు,కోర్టు కేసులు,పీఓటీ కేసులు,12 సెంట్ల లోపు ఉన్న భూములు ఉన్నాయన్నారు. ఇక రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా వేగంగా జరుగుతుందని మంత్రి తెలిపారు...మొత్తం 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా....

ఇప్పటివరకూ 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్ లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని మంత్రి నారాయణ తెలిపారు.. 2501 మంది రైతులకు 8441 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు...

వీటిలో కోర్టు కేసులున్నవి 70 మంది రైతులకు చెందిన 312 ప్లాట్లు,ల్యాండ్ ఎక్విజిషన్ పెండింగ్ ప్రాంతంలో 254 మంది రైతులకు చెందిన 1170 ప్లాట్లు,వివాదాల్లో 450 మందికి చెందిన 1889 ప్లాట్లు,పీఓటీ కుసుల్లో 78 మంది రైతులకు చెందిన 208 మంది ప్లాట్లు,దేవదాయ శాఖ వివాదంలో 32 మంది రైతులకు చెందిన 69 ప్లాట్లు,లంక అసైన్డ్ భూములు 170 మంది రైతులకు చెందిన 337 ప్లాట్లు,ఎన్ ఆర్ ఐలు 210 మందికి చెందిన 444 ప్లాట్లు ఉన్నాయి..

## మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా హసీం బేగ్ బాధ్యతలు

**విజయవాడ, అక్టోబరు 29 ,ప్రభాతవార్త** రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొ రేషన్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ హసీం బేగ్ బుధవారం భాధ్యతలను స్వీకరించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ సాహెబ్, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరా వ్యవస్థ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

**విశాఖపట్నం, అక్టోబర్ 29, ప్రభాతవార్త:**మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్తు సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. బుధవారం కోనసీమ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పృథ్వీతేజ్ ఇమ్మడి విద్యుత్ పునరుద్ధరణ చర్యల పురోగతిని వివరించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్ సాలు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు వంటి అవసరమైన సామగ్రి, సిబ్బందిని ముందస్తుగా అందుబాటులో ఉంచడం వలన పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు.

## బెంగుళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ జగన్ ఫేక్ ప్రచారాలు : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,అక్టోబర్29,ప్రభాతవార్తప్రతినిధి:** విపత్తుల సమయంలో మానవత్వం ఉన్న ఎవరైనా ప్రజలకు సాయం చేస్తారని వైకాపా అధ్యక్షుడు జగన్ మాత్రం ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తూ విష రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగుళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ దొంగ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు లోకేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాకినాడ జిల్లా కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు లోని పునరావాస కేంద్రంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడ ఉన్న వారికి ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకున్నాం. వదంతులు నమ్మొద్దు.ఇది ప్రజల ప్రభుత్వం.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE(SECOND CALL)**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | 28/MAU61-USI0HB(OTH)/297/2025-HB/2nd Call, Dt. 29.10.2025. | "APCRDA - H&B(M) - AP Secretariat - Providing Certain Plumbing repairs, Roof ceiling repairs, toilet repairs and other miscellaneous repairs in AP Legislature building Legislature Secretariat, Velagapudi" - **Estimate Amount: Rs.18,50,000/-** |

The bid can be downloaded on AP e-procurement portal from **30.10.2025** to **07.11.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **07.11.2025 up to 15.00 Hrs**, Technical bid opening **07.11.2025 @ 16.00 Hrs.**

**E-PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | 38/MAU61-USI0HB (OTH)/357/2025-CETT Dt. 29.10.2025. | "Providing Kitchen Room for Pantry with raised flooring on the terrace of Main Building of AP High Court, Nelapadu" - **Estimate Amount: Rs.20,00,000/-** |

The bid can be downloaded on AP e-procurement portal from **30.10.2025** to **14.11.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **14.11.2025 up to 15.00 Hrs**, Technical bid opening **14.11.2025 @ 16.00 Hrs.**

For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

**Sd/- Commissioner, APCRDA, Vijayawada**



## భారత ప్రభుత్వం జనపనారకు కనిష్ఠ మద్దతు ధర (MSP) పెంపుచేస్తూ ప్రకటిస్తోంది

భారతప్రభుత్వం జనుము పంట పెంచే ఆరురాష్ట్రాలలో జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (JCI) యొక్క 14 ప్రాంతీయ కార్యాలయాలు మరియు 110 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతాంగానికి MSP మద్దతు అందిస్తోంది

JCI ముడి జనుము MSPకి , జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (JCI) కేంద్రీయ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది.

**MSP రేట్ : 2025-26**

2025-2026 పంట సీజన్‌కు యావద్భారత దేశంలో ముడి జనుము మెస్టా & బిమ్లీ యొక్క వివిధ రకాలు మరియు గ్రేడ్స్‌కు నిర్ణయించబడిన కనీస మదతు ధరలు ఈ విధంగా ఉన్నాయి :


**భారత దేశం అంతటా**

| రకం | Grade ⇨ | TD-1/W1 | TD-2/ W2 | TD-3/ W3 | TD-4/ W4 | TD-5/ W5 | |
|---|---|---|---|---|---|---|---|
| టొస్సా/వైట్ | రూ/ Qtl. | 6350 | 6150 | 5650 | 5125 | 4875 | |
| రకం | Grade ⇨ | M1 / O.TOP | M2 / S.MID | M3 / MID | M4 / BOT | M5 / B.BOT | M6 / X.BOT |
| మెస్టా/బిమ్లీ | రూ/ Qtl. | 4135 | 3985 | 3860 | 3760 | 3660 | 3560 |

**1971లో ప్రారంభం నుంచి ది జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (JCI)జనపనార రైతులకు మద్దత్తు ఇస్తోంది.**

- 10 సంవత్సరాలలో MSP 135%పెంపుదల CY 2014-15 లో క్వింటాల్‌కు/రూ2400-MSP CY 2025-26 లో క్వింటాల్‌కు/రూ.5650కు పెరిగింది
- MSP ఆపరేషన్ కొత్త రాష్ట్రాలలో ప్రారంభమైంది- నాగాల్యాండ్ మేఘాలయ, జార్ఖండ్
- 3 పని రోజులలో రైతాంగానికి చెల్లింపుల పంపిణీ
- బ్లాక్ చైన్ సాంకేతికత పై ఆధారపడి ఇ-సప్లయ్ చైన్ మరియు ఇ-వేలం ప్లాట్ ఫారమ్‌లు ద్వారా రియల్ టైమ్ ప్రాతిపదికన పారదర్శకత, గుర్తింపు, ధర కనుగొనటం మరియు నూతన కల్పనా యాజమాన్యం తీసుకువచ్చే అమలుకు ప్రణాళికలు
- చిన్న మరియు మధ్య తరహా రైతాంగం నుండి సేకరణ ఆపరేషన్‌లు వేగంగా నిర్వహించటానికి ఆపరేషన్‌ల డిజిటలీకరణ
- JCI, 11 సంవత్సరాలుగా అన్‌గోయింగ్ జ్యూట్ అగ్రొనమీ అభివృద్ధి ప్రాజెక్ట్ I-CARE ను అమలుపరిచే ఏజెన్సీగా కలిగి నిర్వర్తిస్తోంది
  - అత్యధిక దిగుబడి సర్టిఫైడ్ విత్తనాలు (50%) సబ్సిడీపై పంపిణీ
  - రైతులకు ఆధునిక వ్యవసాయ పరికాలను ఉచితంగా పంపిణీ
  - రెట్టింగ్ యాక్సిలేటర్‌ల యొక్క ఉచితంగా పంపిణీ
  - ఉచితంగా ప్రయోగ ఫలితాల ప్రదర్శనలు మరియు చైతన్య అవగాహనా కార్యక్రమాలు
  - 2015 నుండి 2.15 లక్షల - హెక్టార్ల భూమి కవరింగ్ మరియు 5.6 లక్షల రైతులకు ప్రయోజనాలు





JCI సంస్థ PAAT MITRO App ఆరంభించి సమకూర్చింది :

- MSP రేట్స్ & కొనుగోలు కేంద్రాల సమాచారం
- అగ్రొనమిక్ అడ్వైజరీలు
- వాతావరణ తాజా వివరాలు
- జనుము యొక్క నాణ్యతా ప్రమాణాలు
- సేకరణ తర్వాత చెల్లింపు స్టేటస్

భారత ప్రభుత్వం యొక్క గత రెండు దశాబ్దాల మధ్య MSP సేకరణలో తారతమ్యం (2005-2014 : 2015-2024)

| 2005-2014 | | 2015-2024 | |
|---|---|---|---|
| పరిమాణం (సుమారుగా లక్షల బేల్స్‌లో) | విలువ (కోట్లలో రూ.) | పరిమాణం (సుమారుగా లక్షల బేల్స్‌లో) | విలువ (కోట్లలో రూ.) |
| 15 | 380 | 18 | 1345 |

JCI
दि जूट कॉर्पोरेशन अफ इंडिया लिमिटेड
भारतीय पटसन निगम लिमिटेड
The Jute Corporation of India Limited

హెడ్ ఆఫీస్: పటేసన్ భవన్, 3వ మరియు 4వ అంతస్తు, బ్లాక్-CF, యాక్షన్ ఏరియా-1 న్యూటౌన్, కోల్‌కతా-700156, ఫోన్: (033) 2252 1100/6720/6770/7107/7109 ఫ్యాక్స్ : (033) 2252 1771, ఇ-మెయిల్: jci@jcimail.in,www.jutecorp.in

**West Bengal:**
Regional Offices (RO): Kolkata RO, Krishnagar RO, Bethuadahari RO, Berhampore RO, Siliguri RO, Coochbehar RO, Malda RO

**Assam:** RO: Guwahati RO, Gauripur RO, Nagaon RO

**Bihar:** RO: Forbesganj

**Odisha:** RO: Bhadrak RO

**Andhra Pradesh:** RO: Parvathipuram RO; Purchase Centres (DPC): Bobbili, Parvathipuram, Udaipur, Telisamora/Udaipur, Telisamora

**Tripura:** RO: Udaipur RO; Purchase Centres (DPC): Udaipur, Teliamura

CBC 41122/15/0035/2526

వార్త

మనం స్వీకరించే ఆనందం కన్నా మరొకరికి ఆనందం పంచడం వల్ల మనకు మరింత ఆనందం లభిస్తుంది.

-ఎ.బెర్గ్

# మరో అగ్ని పరీక్ష!

ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ అంశంల అపప్రథ మూటగట్టుకున్న ఎన్నికల సంఘంఅన్ని ఆటంకాలు, అనుమానాలను, అవమానాలను తట్టుకొని తాము నడిచే దారే అన్ని రాష్ట్రాలకు శ్రీరామరక్షగా నిరూపించుకోబోతోంది. దీనిపై విపక్షాలు సుప్రీంకోర్టు కెక్కడం, దానాదీనా అన్ని సలహాలు సూచనలను మార్గదర్శకాలను అనుసంధానం చేసుకుంటూ బీహార్‌లో 65 లక్షల మంది అన్య ఓటర్లను జాబితా నుంచి తొలగించడంలో ఎన్నికల సంఘం కృతకృత్యురాలైంది. నవంబరు 4 నుంచి దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాల్లో ఓటర్ల ముమ్మర జాబితా సవరణ (ఎస్ఐఆర్) చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ వెల్లడించారు. ఆయన నేతృత్వంలో ఇది అతికీలక నిర్ణయం తీసుకున్నారు. ఇలా జాబితా సర్వే వెనుక ప్రత్యేక అజెండా ఉంటుంది. కనుక అలాంటి సర్వేను తాము అంగీకరించబోమని,కాంగ్రెస్ తృణమూల్ కాంగ్రెస్ తమిళనాడులోని డిఎంకె పార్టీలు పూర్తిగా నిషేధించాయి. ఇప్పటికిప్పుడు అత్యవసరంగా ప్రత్యేక ముమ్మర సర్వే చేపట్టాల్సిన అవశ్యకత ఏముందని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రజల హక్కులను దోపిడీ చేసే ప్రయత్నమే ఇదని,ఇప్పటికే బీహార్‌లో విస్తృత జాబితా సవరణ కార్యక్రమాన్ని అసంబద్ధంగా చేసిందని వాపోయింది.తుది జాబితా కూర్పులో పారదర్శకత పాటించలేకపోయిందని విపక్షాలు ఎద్దేవా చేశాయి. ఎన్నికల కమిషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టే ముందు రాజకీయ పార్టీలను చర్చలకు పిలవాల్సి ఉందని అలా చేయకపోవడం వల్లనే అపోహలు తలెత్తాయని సుప్రీంకోర్టు కూడా గట్టిగాచెప్పిచూసింది. అనంతరం సజావుగానే జరిగిందని చెప్పాలి. విమర్శల దాడినుంచి బయటపడిన ఎన్నికల కమిషనర్'ఎస్ఐఆర్-2' కార్యక్రమాన్ని ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు పుదుచ్చేరి, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలే కాకుండా అండమాన్ నికోబార్ దీవులలో కూడా ఓటర్ల ముమ్మర సవరణ చేపట్టనున్నారు. ఈసారి గతంలో ఉన్నటువంటి గత అనుభవాలతో ముందుకెళ్లేందుకు ఇ.సి సిద్ధమైంది. మునుపటి మాటేమో కాని సుప్రీంకోర్టు మందలింపులు విన్నాకఎన్నికల కమిషన్ మరింత జాగ్రత్తగా వ్యవహరించినట్లు నిరూపితమైంది. అయినా ఎందుకో విపక్షాలకు శంక వదల్లేదు. ప్రధానంగా బిజెపియేతర పార్టీల పాలనలో ఉన్నతమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అంగీకరించే పరిస్థితిలో లేవు. రెండో విడత సజావుగా జరిపేందుకు ఎన్నికల కమిషన్ ప్రతి ఇంటికీ తనిఖీకి బూత్ లెవెల్ అధికారులను ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. కనీసం మూడుసార్లు ఈ పరిశీలన ఉంటుంది కనుక సందేహించాల్సిన అవసరం ఉండదు. నవంబరు, డిసెంబరులలో నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేసేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, అసోంలలో వచ్చే యేడాది శాసన సభ ఎన్నికలు జరగుతున్నాయి. ఇదే సమయంలో అసోంలో విడిగా జాబితాల ముమ్మర సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఇసి ప్రకటించడాన్ని చూసే మరోకొత్త అనుమానం రాకతప్పదు. ఎందుకంటే దక్షిణాది రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్‌లో కేంద్రంలోని ఎన్డీయేయేతర పార్టీల పాలనలో ఉన్నాయి. ఆది నుంచి కేంద్రప్రభుత్వం ఏకార్యక్రమాన్ని చేపట్టినా సహకరించని రాష్ట్రాలుగాపేరుబడ్డాయి. అదే విధంగా కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలమాట వినేందుకు సిద్ధంగా లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హిందీని తమ విద్యా విధానంలో చూపిస్తున్నారనే ఆరోపణతో కేంద్రం చర్యలను వ్యతిరేకిస్తున్నారు. ఇక అసోం విషయంలోపౌరసత్వం వంటి సమస్యలు ఉన్నాయి.అయినప్పటికీ ఆ విషయాన్ని ఇ.సి తమ తలకెత్తుకోవడం లేదు. పౌరసత్వం చట్టంలో విడిగాఉండే నిబంధనమాత్రమే అసోం రాష్ట్రానికి వర్తింపు చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ వివరించారు. కనుక ఈ అంశంలో పెద్ద అపోహలు తలెత్తారు. అసోం ఎన్డీఏ పాలనలో ఉన్నా అక్కడున్న పౌరసత్వ సమస్యలు వేరు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంతవరకు 8సార్లు ఎస్ఐఆర్ చేపట్టగా ప్రస్తుతం9సవరణ జరుగుతోంది.ఇంతక్రితం బీహార్ జాబితా విషయంలో తప్పులు,లోపాలులేని జాబితాను రూపొందించగలిగామన్న సంతృప్తిని కమిషన్ వ్యక్తంచేసింది. అర్హుడైన ఏ ఒక్క ఓటరునూ వదులుకోమనీ, అనర్హులైన వారిని వదిలిపెట్టబోమని ఎన్నికల కమిషన్ నిర్ధారిత లక్ష్యంతో ముందుకు కదలడం ఇకపై ఎలాంటి బేషజాలకు పోకుండా వ్యహరించడం వలనఎన్నికల కమిషన్‌కు అభినందనలు పొందే అవకాశం ఉంది. ఎస్ఐఆర్ నిర్ణయం ప్రజాస్వామ్యానికి వ్యతిరేక కుట్రగా తమిలనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అభివర్ణించారు. ఎన్నో మార్పులు చేర్పులతో చేప్టిన జాబితా సవరణను కూడా ఆయన అంగీకరించినట్లు లేదు. కేవలం పరస్పర అనుమానాల కారణంగానే విపక్షాలు, ఎన్నికల కమిషన్ ఏకాభిప్రాయానికి రావడం లేదని సుప్రీంకోర్టు ఏనాడో అభిప్రాయపడింది. ఇంతపెద్ద కార్యక్రమాన్ని నిర్వహించదలచినప్పుడు విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాల్సిన ఆవశ్యకత,బాధ్యతను ఎన్నికల కమిషన్ గుర్తించాలి.రాజ్యాంగ బద్ధమైన బాటలో తమవిధులు తాము నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ ఆత్మ విశాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోపభూయిష్ట విధానాలుంటే సరైన సమయంలో సరైన విధానంలో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంలో విపక్షాలు చొరవతీసుకోవాలే తప్ప అయినదానికీ, కాని దానికీ ఒంటికాలి మీదలేవటం సరైనపద్ధతికాదని తెలుసుకోవాలి.

ఎక్కువ గమనించడం, ఎక్కువ బాధలను అనుభవించడం, ఎక్కువ అధ్యయనం చేయడం ఇవి అభ్యాసనకు మూడు ముఖ్య స్తంభాలు.



ఎమర్సన్

ఇతరుల్ని కష్టపెడుతూ నువ్వు కష్టపడకపోవచ్చు. కానీ సంతోష పెట్టేటప్పుడు మాత్రం నువ్వు తప్పక సంతోషంగా ఉంటావు.



సిసిరో

# ప్రజావాక్కు



## డిఏ బకాయిల ఉత్తర్వులను సవరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు 2024 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డిఏను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జి.వో.ఎంఎస్.నెం.60జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల్లో పెరిగిన 3.64శాతం కొత్త డిఏను అక్టోబర్ 2025 జీతంతో కలిపి చెల్లిస్తారు. జనవరి 2024 నుంచి సెప్టెంబర్ 2025 వరకు ఇవ్వాల్సిన డిఏ బకాయిలను సదరు ఉద్యోగిపదవీ విరమణ సమయంలో చెల్లిస్తారు. ఈ కొత్త డిఏతో కలిపి ఉద్యోగుల మొత్తం డిఏ 37.31శాతం అవుతుంది. మొత్తం నాలుగు డిఏ బకాయిలు ఉండగా ప్రభుత్వం ఒక్క డిఏ మాత్రమే ఇచ్చింది. ఆ ఒక్క డిఏ బకాయిలు జనవరి 24 నుంచి సెప్టెంబర్ 25 వరకు చెల్లించాల్సినవి పదవీవిరమణ అనంతరం చెల్లిస్తామని చెప్పడందారుణం.చనిపోయినఉద్యోగికిఅయితే వారసులకు ఇస్తామని ఉత్తర్వుల్లో పేర్కొనడం మరీ దారుణం.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## యువతకు రాజకీయ అవకాశాలు

ఎంఎల్ఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయసు పరిమితిని 25నుండి 21సంవత్సరాలకు తగ్గించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదన ఎంతో సరికొత్త ఆలోచన. ఇది యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించే దిశగా తీసుకున్న ప్రగతిశీలమైన అడుగు. నేటి యువత సమాజంపై అవగాహన కలిగిన వారు, సాంకేతికంగా నైపుణ్యం ఉన్న వారు. వారికి ప్రజాప్రాతినిధ్యం లభిస్తే, ప్రభుత్వ వ్యవస్థలో కొత్త ఉత్సాహం, సృజనాత్మకత, పారదర్శకతను తీసుకురాగలరు.ఈప్రతిపాదన అమలులోకి వస్తే, భారత దేశ రాజకీయ వ్యవస్థలో యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే అనేక దేశాల్లో యువతను శాసనసభల్లోకి ప్రవేశపెట్టే విధానాలు ఉన్నాయి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి పెద్ద బండ రాళ్ళు కిందికి పడినవి. ఈఘాట్ రోడ్‌లో రోజూ బస్సులు లక్షల ప్రయాణీకుల్నితీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణుల అభిప్రాయం ప్రకారం చర్యలు చేపట్టాలి.

- బొల్లోజు మేఘానథం, విశాఖపట్నం

## ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

అమెరికాలో నున్న 50రాష్ట్రాలలో అక్కడిప్రజలు లక్షల సంఖ్యలో వీధులలోకి వచ్చి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తూ తమ నిరసనను తెలియజేయడం బహుశ అమెరికాచరిత్రలో ఇంతకు ముందెప్పుడు జరిగి ఉండదేమో.దాదాపు ఏడినిమిది యుద్ధాలను నివారించి శాంతిని నెలకొల్పానని తనకు తానే ప్రశంసలు చేసుకుంటున్న ఆ పెద్దమనిషి తన దేశంలో తనకు వ్యతిరేకంగా జరుగుతున్న అలజడులను నివారించక లేకపోవడం ఆశ్చర్యకరం. ఇజ్రాయెల్ గాజా, ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. రష్యా నుండి భారత్‌కు వచ్చే చమురు దిగుమతులనుఆపేశానన్నాడు. దీనిని భారత్ ధృవీకరించలేదు. ఇదొక అబద్ధం. అమెరికన్ కాంగ్రెసులో ఆయనపై అభిశంసన తీర్మానం పెట్టవచ్చును కదా. తగినంత సంఖ్యాబలం కన్సర్వేటివ్ పార్టీకి ఉన్నదేమో. చరిత్రలో నిలచిపోయేది చరిత్రకారులే కాదు, చరిత్ర హీనులు కూడా ఉంటారు.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## సాదాబైనామా వర్తింప చెయ్యాలి

2015లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 42 గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనంచేయడం జరిగింది.2020 అక్టోబర్, నవంబర్ నెలలో భూమి పాస్ బుక్ కానీ రైతులు, సదబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికీ, పాస్‌బుక్‌ల కోసం అప్లై చేసుకోమని అప్పటి ప్రభుత్వం చెపితే,మీ సేవలో కొన్నివేలమంది రైతులు, కొన్ని వేలఎకరాల భూమి పాస్‌బుక్‌లకోసం అప్లై చేసుకున్నారు. భూ భారతి వెబ్సైటులో అట్టి వివరాలు కూడా, ల్యాండ్ స్టేటస్‌లో నమోదు అయి ఉన్నవి.ఇప్పుడు కోర్టు స్టే ఎత్తి వేసిన పిదపెమో 42 గ్రామాల రైతులకు వర్తించదు, అని రెవిన్యూ అధికారులు చెప్పుతున్నారు. విలీనం ఐనా 42 గ్రామాలలోని, రైతుల వ్యవసాయ భూములకు కూడా సాధాబైనామా వర్తింపా చేయాలి.

-బీరం రాములు, వరంగల్

## నిప్పులేనిదే పొగ రాదు

నేపాల్,బంగ్లా, శ్రీలంకలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలు ప్రధాని రాజీనామా దాకా తీసుకొచ్చారు. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్టు ప్రభుత్వం అనుసరించిన అవినీతి విధానాలు ఒకవైపు వలసీకరణ ఒకవైపు విద్యార్థుల ఉద్యమం ఒకవైపు ఈజెన్‌జీ ఉద్యమాన్ని ఫలవంతం చేసాయి.

- భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదపు అంచున ప్రభుత్వ విద్య!

**తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్‌అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తని ఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యం కల్పించాలి. గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పిం చాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపా ధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి.**

శ్రీశ్రీ కుమార్

ఒకప్పుడు బడి అంటే ప్రభుత్వ బడి, చదువు అంటే ప్రభుత్వ బడులలో చెప్పేదే చదువు. గత నాలుగు దశాబ్దాలలో ప్రభుత్వ రంగానికి సమాంతరంగా ప్రైవేట్, కార్పొరేట్ రంగాలలో పాఠశాలలు వెలిశాయి. అంతకు ముందు ప్రైవేటు పాఠశాలలను సేవా భావంతో నెలకొల్పితే తర్వాత రోజుల్లో స్థాపించడం వ్యాపారాత్మకమైనది. నేడు అది లాభసాటి వ్యాపారాల్లో ఒకటిగా వెలుగొందుతున్నది. దినదిన ప్రవర్ధమానమై ప్రభుత్వం ఇచ్చే ఉచిత చదువును కబళించింది. సంఖ్యాపరంగా చూస్తే ప్రభుత్వ బడుల సంఖ్యలో (24997) ప్రైవేట్ పాఠశాలలు సగానికి కూడా తక్కువ (11407) కానీ అడ్మిషన్ల పరంగా ప్రైవేటులో 60 శాతం విద్యార్థులు చదువుకొంటుండగా, ప్రభుత్వ బడులలో కేవలం 31 శాతం మంది చదువు నేర్చుకోవడం ప్రమాదకర సంకేతాలను ఇస్తున్నది. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో మిగిలిన శాతం విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి నానాటికి తీసికట్టు నాగంబొట్టు లాగుంది. ప్రభుత్వ పాఠశాలల ఉనికికి, మనుగడకు వాటి భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న పరిస్థితి నెలకొన్నది. అసలు జీరో అడ్మిషన్లున్న 1897 పాఠశాలలను గుర్తించారు. పదిమందికన్నా తక్కువ విద్యార్థులను పాఠశాలలు 4325 ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. 250 నుండి 1000 లోపు విద్యార్థులు అడ్మిషన్ పొందిన పాఠశాలలు 2261 ఉండటం, వెయ్యికిపైగా విద్యార్థులున్న బడులు 26 ఉండడం ప్రభుత్వ విద్యకు ఆశా కిరణాలుగా ఉన్నాయి. ఒక రకంగా చెప్తే ఇవి ప్రభుత్వ విద్యకు ప్రాణం పోస్తున్నాయి అనవచ్చు. దాదాపు మూడున్నర లక్షలకు పైగా ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సమర్పించే న్యాస్ (నేషనల్ అచీవ్మెంట్స్ సర్వే) నివేదిక ప్రకారం 2021 లో 36వ స్థానంలో ఉండగా 2024లో అది 26వ స్థానానికి చేరింది. అంటే కొంత పురోగతి సాధించింది. అది విద్యార్థుల అభ్యసన స్థాయికి సంబంధించినవి. అంటే ఇంకా విద్యార్థుల్లో చదవడం రాయడం మామూలు లెక్కలు సాధించే స్థాయికి చేరలేకపోతున్నారు. చాలా దురదృష్టం ఏమంటే విద్యాశాఖ మంత్రులు కానీ సంబంధిత అధికారులు కానీ రాష్ట్రస్థాయిలో ఈ విషయమై సమీక్ష జరిపిన దాఖలాలు లేవు. చాలా తరచుగా డీఎస్సీలు, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేస్తున్నామని ప్రభుత్వం గర్వంగా ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కాదు కదా కనీస స్థాయిలో కూడా లేకపోవడం దారుణం. ఇంకా 20 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం వేల మంది టీచర్ల పదవీ విరమణ జరుగుతుండగా వారి స్థానాల్లో తిరిగి నియామకాలు జరగడం లేదు. దీంతో విద్యార్థులకు ఎంతో అన్యాయం జరుగుతున్నది. అదే ప్రైవేటు వ్యవస్థలో లేదా కార్పొరేట్ పాఠశాలల్లో ఎవరైనా రాజీనామా చేసినా మరి ఏ ఇతర కారణాలకైనా పాఠశాలకు హాజరు కాకపోతే వారి స్థానంలో కొత్తగా టీచర్లను తక్షణమే నియమించుకుంటారు. తద్వారా విద్యార్థులు ఆ సబ్జెక్టులో వెనుకపడకుండా యాజమాన్యాలు జాగ్రత్త వహిస్తాయి.ప్రభుత్వాలు ఈవిషయమై తమ క్యాలెండర్ లేదా తమప్రణాళిక, రాబోయే ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని నియామకాలు చేస్తాయి. అయ్యవార్ల కోసం అమావాస్య ఆగదు. జరగవలసిన నష్టం అధికారులు అరికట్టలేరు. ఉచితంగా పుస్తకాలు అందజేసినా,యూనిఫామ్స్ ఇచ్చినా, మధ్యాహ్న భోజనం కల్పించినా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగడంలేదు. అభ్యసన స్థాయిలు కూడా రోజు రోజుకు తీసికట్టుగానే ఉంటున్నాయి. వీటిలో చదివే విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు.



వారికి మరింత చేయూతనివ్వవలసిన బాధ్యత అందరి మీదఉంది. మొదట్లో సర్వశిక్ష అభియాన్, ఆ తర్వాత రాజీవ్ విద్యా మిషన్ ద్వారా చాలా బడులకు భవనాలు సమకూరినాయి. కానీ మరుగుదొడ్లు, మంచినీరు, విద్యుత్ సరఫరా నేడు అత్యవసరమైనాయి. ప్రభుత్వాలు ఎప్పుడు విద్య గురించి మాట్లాడినా ఒకాయన కంప్యూటర్ లిటరసీ, మరొకాయన డిజిటల్ ఎడ్యుకేషన్, ఇంకొకరు స్మార్ట్ బోర్డులు స్మార్ట్ తరగతి గదులు అంటూ ఊదరగొడుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాలేని పాఠశాలలు ఎన్నో ఉన్నాయి. వీటి గురించి ఎవరూ పట్టించుకోరు. డిజిటల్ విద్య గురించి పెద్ద పెద్ద కంపెనీలతో ఎంఒయూలు కుదుర్చుకుంటున్నారు. మౌలిక వసతుల గురించి ఎట్టి ఎంఒయూలు ఉండవు. అంటే ఇవన్నీ కేవలంప్రచార ఆర్భాటాలు మాత్రమే అనేది స్పష్టం. ఇక మూడవ తరగతినుండి ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా కృత్రిమ మేధ నేర్పుతామంటున్నారు. ఎందుకు దానిపై ఇంత మోజు? కేవలం సాంకేతికత మీదనే ఆధారపడతారా? భవిష్యత్తులో సాంకేతికత అవసరబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యాశాఖ సిద్ధంగా ఉందా అనేది చర్చించుకోవాలి, సమీక్షించుకోవాలి. అందుకు తగిన వనరులను ఏర్పాటు చేసుకోవాలి. అదే నిజమైతే ఉపాధ్యాయ నియామకాలు ఎందుకుజరుపుతున్నట్లు? సిలబస్ పూర్తి చేయాల్సిన సమయంలో ఉపాధ్యాయులకు శిక్షణల శిక్ష ఎందుకు? మంచి విద్యార్హతలు కలిగివున్న ఉపాధ్యాయులు పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి రోజురోజుకు విషమించడంపై తగిన సమీక్ష జరిగిదిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి. రోబోలు తరగతి గదిని నియంత్రించలేవు. కంప్యూటర్లు పాఠం బోధించలేవు. అవి కేవలం బోధనోపకరణాలు మాత్రమేనని గుర్తించనంతకాలం మన విద్యా విధానం మెరుగుపడదు. సాంకేతికతను విచక్షణతో ఉపయోగించుకోవాలి. అంతేకానీ దానికి బానిస కాకూడదు. దానిపైనే పూర్తిగా ఆధారపడితే ఉపయోగం శూన్యం. సాంకేతిక పరిజ్ఞానం కేవలం సమాచార సేకరణకు సమీక్షలకు పనికి వస్తుంది కానీ తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధనను ప్రభావితం చేయలేదు. సాంకేతిక పరికరాల కొనుగోళ్ల మీద చేసే ఖర్చుపాఠశాలల్లో ప్రయోగశాలలు, గ్రంథాలయాలపై చేస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనంచేకూరుతుంది. ఇక అనేక జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు లేరు. మండల శాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డైట్ కళాశాలలో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ పదోన్నతి ద్వారా నింపితే ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంది. పాఠశాలల పైన ఆజమాయిషి లోపించింది. తనిఖీలు జరగడం లేదు. వృత్యంతర శిక్షణలు మొక్కుబడిగా సాగుతున్నాయి. నూతన విద్యా విదానంలో చేరుతున్నామో లేదో స్పష్టం చేయకపోగా మనకు ఒక విలక్షణమైన విద్యా విధానాన్ని రూపొందించబోతున్నట్లు ప్రకటించి ఉపాధ్యాయ లోకాన్ని ప్రభుత్వం మరింత గందరగోళంలో పడవేయడం జరిగింది. బోధన ప్రభావవంతంగా జరగడంలేదని, అరకొరగా సాగుతున్నదని అధికారుల అభిప్రాయం. అందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి. 20 వేల పోస్టులు ఖాళీగా ఉండగా, ఉన్న వారిలో చాలామందిని తనిఖీల పేరుతో కమిటీల ఏర్పాటు చేసి వారిని బోధనకు దూరం చేస్తున్నారు. 168 కమిటీలు రాష్ట్రంలోని 16,474ప్రాథమిక పాఠశాలలో తనిఖీలుచేయాలట.అదేవిధంగా 300ప్రాథమిక ఉన్నత పాఠశాలల తనిఖీకి 35కమిటీలు, 4672 సెకండరీ పాఠశాలలకు 96 కమిటీలు తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయినాయి. ఈ కమిటీలలో ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయ సభ్యులుంటారు. ఈ కమిటీల ఏర్పాటులో జూనియర్లు కొన్నిచోట్ల సీనియర్ల బోధనను పరిశీలించడం, సలహాలు సూచనలు ఇచ్చి నివేదిక సమర్పించడం ఏమాత్రంఆమోదయోగ్యంకాదు. అసంబద్ధంగా ఉంటుంది. తనిఖీ కమిటీల ఏర్పాటుకై ఆసక్తి గల పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్‌అధ్యాపకుల సేవలను వినియోగించుకుంటే పాఠశాలల్లో బోధనకుంటు పడదు. అందువల్ల కొంతమంది మనోభావాలు కూడా దెబ్బ తినవచ్చు. తనిఖీ చేసే ఉపాధ్యాయుల బోధనవారి సొంత బడులలో దెబ్బతింటుంది. అక్కడి విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.బోధన క్రమం తప్పుతుంది. పర్యవేక్షణకు తనిఖీలకుతగిన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవడం శ్రేయస్కరం. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ఉచితరవాణా సౌకర్యంకల్పించాలి.గతంలో మాదిరిగా అల్పాహార పథకం మళ్లీ ప్రవేశపెట్టాలి. వారికి,వారి తల్లిదండ్రులకు ప్రభుత్వపరంగా అనేకరకాలైన ప్రోత్సాహకాలు కల్పించాలి. సాధ్యమైతే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగాలలో కూడా రిజర్వేషన్ కల్పించవచ్చు. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి. ఉపాధ్యాయులను పూర్తిగా బోధనకు పరిమితం చేయాలి. •

# అప్పులతోనే అభివృద్ధి.. ఆనందమెలా?

ప్రసాద రావు

ఒకప్పుడు అప్పు అంటే భయం. నేడు ప్రియంగా మారింది అంటే అతిశయోక్తికాదు. దేశ జి.డి.పి 2023 24లో 173.82 లక్షల కోట్లు కాగా, దాదాపు దీంట్లో సగ సమానమైన మొత్తం అప్పులు రూపంలోవివిధ బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, ఫైనాన్స్ సంస్థలు నుంచి మనదేశ ప్రజలు వ్యక్తిగతంగా అప్పులు తీసుకున్నట్లు కేంద్ర గణాంక శాఖ నివేదిక పేర్కొంది. ఈ అప్పుల్లో మన తెలుగు రాష్ట్రాలు మొదటి రెండు స్థానాల్లో నిలువుగా,ఒక అడుగు ముందుకేసి ఆంధ్రప్రదేశ్ 43.7 శాతంతో మొదటి వరుసలో నిలబడింది. రెండో స్థానంలో 37.2 శాతంతో తెలంగాణా ఉంది. పూర్వం అనగా ఒక రెండు దశాబ్దాల క్రితం వరకూ, డబ్బులు ఉంటేనే ఏవస్తువు అయినా కొనడం, ఇల్లు కట్టుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగేది. అయితే ఇటీవల కాలంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకున్న ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు వచ్చే ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేయడానికి అలవాటు పడ్డారు. దీనికి తోడు, బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థలు అప్పులు ఇవ్వడానికి ముందుకు వచ్చాయి. ఇక ప్రైవేటు బ్యాంకులు, సంస్థలు నియమనిబంధనలు సరళీకృతం చేసి మరీ ఇంటి వద్దకే అప్పులు ఇచ్చే సదావకాశం కల్పించాయి. ఆన్లైన్ సిస్టం ద్వారా, వ్యక్తిగత గ్యారంటీ ద్వారా ఋణాలు ఇవ్వడం ద్వారా అప్పులేని వ్యక్తి లేడు అన్నట్లు అయిపోయింది. గృహాలు, కార్లు, స్థలాలు, పొలాలు, గ్రహోపకరణాలు, గోల్డ్ వంటివి కొనడానికి సుముఖంగా ఉంటే చాలు.ఋణాలు సులభంగా అందిస్తున్నారు. కొంతమంది వాస్తవంగా ఈ ఋణాలు ద్వారా అభివృద్ధి చెందుతుంటే, మరెందరో ఋణగ్రస్థులుగా మారిపోతున్నారు. ఆదాయానికి మించి అప్పులు చేయడంతో చాలా మంది ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. ఇక పెళ్ళిల్లు, బర్తడే వేడుకలు, ఇంట్లో జరిగే అనేక వేడుకలు, విందులు వినోదాలు కోసం అప్పులు చేయడంతో చాలా కుటుంబాల్లో చీకటి అలుముకుంటున్న పరిస్థితి. 'క్రెడిట్ కార్డు' అందుబాటులోకి రావడంతో ఎక్కువ మంది అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. ఇక జీవితం అంతా అప్పులు, వడ్డీలు కట్టడం సరిపోతుంది. ఆన్లైన్ షాపింగ్, అమెజాన్, ఫ్లిప్ కార్ట్, మీసో, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్ ఇలా వివిధ రకాల సంస్థలు ఆన్లైన్ ద్వారా వస్తువులు, సరుకులు ఇంటి వద్దకే అందిస్తుంటే, చాలా మంది సుఖజీవులుగా మారి అనవసరమైన ఖర్చులు చేయడం జరుగుతుంది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. తద్వారా ఆర్థికంగా, ఆరోగ్య పరంగా నశిస్తున్న పరిస్థితి. " వినిమయతత్వం ( కన్జురిజం) నిత్యజీవితంలో భాగం అయింది. దీంతో ఎంత సంపాదించినా, సరిపోని పరిస్థితి నెలకొంది. విలాసాలు, వినోదాలు, పార్టీలు, గెట్ టుగెదర్, వీకెండ్ పార్టీలు, రకరకాల టూరిజం పర్యటనలు చేస్తూ అనవసరమైన ఖర్చులతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న పరిస్థితి. మరోవైపు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, డి మార్ట్, రిలయన్స్, విజేత, మోర్, విశాల్, డిపార్ట్మెంట్ స్టోర్స్, వస్త్ర వ్యాపార సంస్థలు, లూలు మాల్స్, రెడిమేడ్ వస్త్రాలు,అలంకరణలు, లగ్జరీ బైక్,కార్లు, పెర్ఫ్యూమ్ అందుబాటులోకి రావడంతో అవసరానికి మించి కొనడం,అన్నిటికీ మించి ' సెల్‌ఫోన్లు, టీ.వీలు, ఫ్రిజ్, ఏ.సిలు' ఇలా అనేక వస్తువులపై ఆకర్షణ ఏర్పడి, ఆదాయంతో సంబంధం లేకుండా ఖర్చు చేసికొనడంతో దాదాపు అన్ని కుటుంబాలు అప్పులు ఊబిలో కూరుకు పోతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు అప్పుల్లో మునిగి తేలుతున్న వైనం పట్టణ ప్రజలు కంటే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ అప్పుల్లో ఉన్నట్లు సర్వేతెలిపింది. 'జెన్‌జెడ్‌యువత, ప్రజలు' అప్పుల్లో ఎక్కువగా ఉంటున్నారు. వివిధ రకాల లగ్జరీ అలవాట్లు కలిగి ఉండటం వల్ల అప్పులు కుప్పలుగా చేయడం జరుగుతుంది. మరి కొందరు'స్టాక్ మార్కెట్'లో పెట్టుబడులు పెట్టేందుకు అప్పులు చేసిమరీ పెట్టుబడి పెడుతున్న పరిస్థితి.. ఆన్లైన్ గేమ్స్, విలాసవంతమైన ఇళ్లు నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, విలాసవంతమైన జీవితం కోసం ఆదాయానికి మించి ఖర్చు చేయడం, అప్పులు చేయడంతో జీవితాన్ని నరకప్రాయం చేసుకోవడం జరుగుతుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో అప్పు తక్కువ ఉన్న ప్రజలు ఎక్కువగా ఉండుట గమనించదగిన విషయం. •

# ప్రజాస్వామ్య ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు

మేకిరి దామోదర్

సత్యం, అసత్యం మధ్య తేడా మసకబారిన యుగంలో మన ఆలోచన స్వేచ్ఛే అత్యంత విలువైనదిగా మారింది. అబద్ధాలకు శబ్దం ఎక్కువ, కానీ సత్యానికి శక్తి అపారమని తెలుసుకునే బుద్ధి అవసరం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడమే కాదు, ప్రశ్నించే హక్కును వినియోగించడం కూడా. మన ఆలోచనా స్వాతంత్ర్యం క్షీణిస్తే, ప్రజాస్వామ్యం శ్వాస ఆగిపోతుంది. ప్రస్తుత కాలంలో మనం "సత్యానంతర సమాజంలో జీవిస్తున్నాం. రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక వక్రీకరణలు దైనందిన జీవితంలో మమేకమైపోతున్నాయి. నకిలీ వార్తలు, అబద్ధాలు, పాక్షిక వాస్తవాలు ఇప్పుడు సమాచారం కంటే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఒకప్పుడు దౌర్జన్యాలు దైవలీలల పేరుతో జరిగేవి; ఇప్పుడు అవే 'ఇదే మీకు మంచిది" అంటూ సాంకేతిక ముసుగులో సోషల్ మీడియా ద్వారా ప్రజల మనసుల్లోకి చొరబడుతున్నాయి. ప్రశ్నించని సమాజం మౌనంలో మునిగిపోతుంది. ఆ మౌనం మన ఆలోచనా శక్తిని మంటించిన మంటల్లా దహిస్తుంది. సగటు మనిషి స్వతంత్రంగా ఆలోచించే, వాస్తవాలను విచారించే సామర్థ్యాన్ని కోల్పోతున్నాడు. హేతుబద్ధతకు బదులు భావోద్వేగాలు, శాస్త్రీయ దృష్టికి బదులు ఆరాధనాత్మక దృష్టి చోటు దక్కుతోంది. ఫలితంగా, విలువల వ్యవస్థ పతనమవుతోంది. నీతి, నిజాయితీ, మర్యాదలు అన్నవి ఇప్పుడు ప్రదర్శనాత్మక పదాలుగా మారాయి. సత్యానికి విలువ లేని దేశంలో సత్యవంతుడు సులభంగా దోషిగా మారుతాడు. ఇలాంటి స్థితినే పాశ్చాత్య సమాజంలో 'పోస్ట్ ట్రూత్" అని పిలుస్తారు. ఇక్కడ వాస్తవాల కంటే వ్యక్తిగత నమ్మకాలు, భావోద్వేగాలే ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తాయి. నకిలీ వార్తల ప్రభావం వల్ల ప్రజలు తమకు నచ్చినది నిజమని నమ్ముతున్నారు. వాస్తవాలను నిర్లక్ష్యం చేయడం అలవాటైపోతోంది. ఫలితంగా సమాజంలో తప్పుడు సమాచారమే 'ప్రజాజ్ఞానం'గా మారుతోంది. సోషల్ మీడియా వేదికలపై అబద్ధాలకు లైకులు ఎక్కువ, సత్యానికి నిశ్శబ్దం ఎక్కువ. ఆ పరిస్థితి ప్రజాస్వామ్యాన్ని సున్నితంగా, కానీ ఘోరంగా దెబ్బ తీస్తోంది. ప్రశ్నే ప్రగతికి పునాది. ఏ వైజ్ఞానిక ఆవిష్కరణైనా, సామాజిక సంస్కరణైనా, ఆధ్యాత్మిక అన్వే షణైనా ఒక ప్రశ్నతోనే మొదలవుతుంది. కానీ ఆధునిక సమాజంలో విమర్శనాత్మక ఆలోచన శక్తి తగ్గిపోతోంది. విశ్లే షణకు బదులు నమ్మకాలు, విచారణకు బదులు మూస భావాలు, ఆలోచనకు బదులు వ్యక్తి ఆరాధన పెరుగుతోంది.



విమర్శను విరోధంగా చూడటం, భిన్నాభిప్రాయాలను ద్రోహంగా పరిగణించడం – ఇవి ప్రమాదకరమైన ధోరణులు. ప్రభుత్వాల నుండి మీడియా వరకు అన్నీ భావోద్వేగాల ఆధారంగా నడుస్తున్నట్లున్నాయి. సమాచార హక్కు కోసం పోరాడిన ఉద్యమకారులపై దాడులు, వారి హత్యలు – ఇవన్నీ ప్రజాస్వామ్యపు ఆత్మను గాయపరుస్తున్న దృశ్యాలు. సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేక్‌న్యూస్ ఛానెల్స్ వల్ల ప్రజల్లో ఆలోచనకంటే ప్రతిస్పందన వేగం పెరిగింది. ఆలోచన తగ్గి,ఆక్రోశం పెరిగింది. భిన్న అభిప్రాయాలపై అసహనం రోజురోజుకూ పెరుగుతోంది. 'నేను అనుకున్నదే సత్యం' అనే భావం మన సామాజిక సంభాషణలను విషపూరితం చేస్తోంది. రాజకీయాల్లో వ్యక్తి పూజ పరాకాష్టకు చేరింది.నాయకుడు తప్పుడు నిర్ణయం తీసుకున్నా, ఆయన అభిమానులు దానిని సమర్థించడమే కాదు, దానిని సత్యంగా నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. విధానాలపై విమర్శలు చేయడం ప్రమాదకరమని భావించే వాతావరణం నెలకొంది. ఈధోరణి ప్రజాస్వామ్య ఆత్మను మెల్లగా హరింపచేస్తోంది. విద్యా వ్యవస్థ కూడా విచారణాత్మక దృష్టిని పెంపొందించడంలో విఫలమవుతోంది.ఎలా ఆలోచించాలి? అన్న ప్రశ్నను ప్రాధాన్యంగా బోధించాల్సిన చోట, కేవలం మార్కులు సాధించే విద్యకే ప్రాధాన్యం ఇచ్చింది. ఐన్‌స్టీన్ చెప్పినట్లుగా విద్య అంటే విషయాలు తెలుసుకోవడం కాదు, ఆలోచించడం నేర్చుకోవడం. అందుకే పాఠశాలల నుంచే "క్రిటికల్ థింకింగ్" అనే అంశాన్ని బోధించాలి.పిల్లలు ప్రశ్నించడానికి, విశ్లేషించడానికి, వాస్తవాలను పరిశీలించడానికి ప్రోత్సహించాలి. మూఢనమ్మకాల నిరోధక చట్టాలు, సోషల్ మీడియా నియంత్రణ చట్టాలు వంటి సంస్కరణలు కూడా అవసరం. సమాజంలో ఆలోచనాత్మక దిశను బలోపేతం చేయడం అత్యవసరం. సత్యం కోసం నిలబడే ధైర్యం ప్రజాస్వామ్యానికి ఇప్పుడు అనువార్యం. 2+2=5" అని బలవంతం చేసే ఉపాధ్యాయుడి ముందు నిలబడి 'అది నాలుగు" అని రాసే విద్యార్థి ధైర్యం అదే విమర్శనాత్మక ఆలోచన జీవచిహ్నం.నియంతృత్వం తుపాకీతో భయపెట్టినా, సత్యం కోసం లేచిన ఆ విద్యార్థి మనసు ప్రతి మనిషిలో ఉండాలి. ఆ ధైర్యం సత్యానికి, ప్రజాస్వామ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించని మనిషి ఓ నిష్క్రియ పౌరుడుమాత్రమే. ఆలోచించని విద్యార్థి భవిష్యత్తుకే ప్రమాదం. విమర్శించని మేధావి జాతి దురదృష్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం పాలకులను ఎంచుకోవడం కాదు, వారి పనిని ప్రశ్నించడం, విశ్లేషించడం, తప్పు అయితే సరిదిద్దమని చెప్పడం కూడా పౌరుని బాధ్యత. సత్యాన్ని తెలుసుకోవడమే కాదు, దాన్ని నిలబెట్టే ధైర్యం చూపడమే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం. మన సమాజం ప్రగతిపథంలో కొనసాగాలంటే విమర్శనాత్మక ఆలోచన సజీవంగా ఉండాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యానికి, ప్రగతికి ప్రశ్నలే పట్టుకొమ్మలు, ఆలోచనే దారి చూపులు, సత్యమే శాశ్వతం. •

విజయవాడ వార్త

## వర్షపు నీటి నిల్వలను ఎయిర్‌టెక్ మిషన్లతో తొలగించండి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 29,ప్రభాతవార్త: వర్షపు నీటి నిల్వలను ఎక్కడా నిలవకుండా ఎయిర్‌టెక్ మిషన్లు,గల్పర్‌లతో ఎప్పటికప్పుడు తొలగించాలని, మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ రోడ్డుపైన నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మున్సిపల్ కమీషనర్



ధ్యానచంద్ర ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బందరు రోడ్,లయోలా కళాశాల రోడ్,జమ్మి చెట్టు సెంటర్,సిద్ధార్థ కళాశాల రోడ్,ఈఎస్ఐ రోడ్డు,ఏలూరు రోడ్,బస్టాండ్, నేషనల్ హైవే,భారతినగర్,ఫార్చ్యూన్ మురళి పార్క్ రోడ్ తదితర ప్రాంతాన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకింగ్ పాయింట్లు,ఫ్లోటింగ్ గార్బేజ్‌లను అవుట్‌ఫాల్ డ్రైన్లలో ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డోర్నకల్ రోడ్డు,ఆలీ బేగ్ స్ట్రీట్,గవర్నర్‌పేట,బస్టాండు,జాతీయ రహదారి వద్ద గల యం.హోటల్,భారతినగర్,ఫార్చ్యూన్ మురళి పార్క్ వద్ద రహదారుల పైన పడిపోయిన వృక్షాలను గమనించి ప్రజలకు ఇబ్బంది కల్గకుండా వెంటనే వృక్షాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. నగరం మొత్తం ప్రత్యేక బృందాలతో తుఫాను ఈదురుగాలుల వల్ల పడిపోయిన వృక్షాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అనంతరం గులాబితోటలో ఉన్న అన్న క్యాంటీన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాను నేపథ్యంలో అన్న క్యాంటీన్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని, అందుకు తగ్గట్టుగా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏమైనా మరమ్మత్తులు వస్తే వెంటనే వాటిని పూర్తి స్థాయిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,సిబ్బంది పాల్గొన్నారు.

## కొండ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

### పొంగిన వాగులు దాటకుండా బందోబస్తు

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 29,ప్రభాతవార్త: మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ ఎక్కడా ఎలాంటి ప్రాణ,ఆస్థి నష్టం జరగకుండా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తి అప్రమత్తంగా ఉండేందుకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ సిపి



రాజశేఖరబాబు స్వీయ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మొంథా తుఫాను మొదలైనప్పటి నుండి ప్రజలను అప్రత్తమం చేస్తూ,కొండ చరియలు విరిగి పడేందుకు అవకాశమున్న కొండ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు నచ్చచెప్పి అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు,జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్ళేలా చర్యలు తీసుకున్నారు. తీవ్రమైన గాలులకు పడిపోయే అవకాశం ఉన్న హోర్డింగ్‌లను తొలగించడమే కాక, విరిగిపడిన చెట్లను త్వరగా తొలగించే విధంగా చర్యలు తీసుకుని,వాటిని తొలగించి ఆయా ప్రదేశాలలో ట్రాఫిక్ క్లియర్ చేసేలా చర్యలు చేపట్టారు.అంతేకాక నగరంలో అక్కడక్కడ పొంగిన వాగులు,కాల్వల వద్ద పోలీసు బందోబస్థు ఏర్పాటు చేసి ప్రజలు ఎవ్వరూ ఆ పరిసర ప్రాంతాలకు వెళ్ళకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. నదులు,కాలువలు,వాగుల వద్ద డ్రోన్ కెమేరాల ద్వారా పరిస్థితులను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకున్నారు.

## పొంగిన వాగు వైపు వెళ్లకుండా చర్యలు

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 29,ప్రభాతవార్త: కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగి రోడ్ల మీదకు నీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ రోడ్ల మీద వాహనదారులు ప్రయాణం చేయకుండా తగు చర్యలు తీసుకుంటూ ప్లే కార్డులతో పాటు బ్యానర్లను ఏర్పాటు చేసి.వాగు సమీపం నుంచి వెళుతున్న



రోడ్డును ప్రజల భద్రత కోసం పోలీసులు ట్రాక్టర్‌తో సదరు రోడ్లను సిపి రాజశేఖరబాబు ఆదేశాల ప్రకారం పోలీసులు బ్లాక్ చేస్తున్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో ప్రజల భద్రకు భరోసా కల్పిస్తూ ఎక్కడా ఎలాంటి ప్రాణ,ఆస్థి నష్టం జరక్కుండా సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు వర్షాల వలన నీరు నీలిచి ఉండే రహదారులను,రోడ్లను గుర్తించి ఆయా ప్రదేశాల్లో ప్రయాణీకుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా చేసుకొని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగు చర్యలను పోలీసులు తీసుకుంటున్నారు. కురిసిన వర్షాలకు రోడ్లపై నిలిచిన నీరు వలన వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోలీసు అధికారులు,సిబ్బంది ఆయా ప్రదేశాల్లో ఫ్లేకార్డుల ద్వారా బ్యానర్ల ద్వారా,మైకుల ద్వారా సమాచారం అందిస్తూ వారి ప్రయాణాన్ని సులభతరం చేసారు. మోటార్ల దా ్వరా నిలిచిన నీటిని త్వరగా తొలగించే విధంగా చర్యలు చేపట్టారు.డ్రోన్ కెమేరాల ద్వారా నిరంతరం ట్రాఫిక్ రద్దీని పర్యవేక్షిస్తూ ఎక్కడా ప్రమాదాలు జరుగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు.

## రోడ్డుపై కూలిన వృక్షాల తొలగింపు : కమీషనర్

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 29,ప్రభాతవార్త: మొంథా తుఫాన్ నేపథ్యంలో నగరంలో రోడ్డుపైన కూలిన చెట్లను దాదాపు 93 వృక్షాలను తొలగించినట్లు మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర



పేర్కొన్నారు.దాదాపు 500 మందికి పైగా ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు పంపామని అందులో 350కి పైగా ప్రజలు పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్నారని,కొంత మంది వారి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్ళారని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మొంథా తుఫానను నేపథ్యంలో నగరంలో రోడ్లపైన ఉన్న వర్షపు నిల్వలను ఎప్పటికప్పుడు గల్పర్లు,ఎయిర్ టెక్ మిషన్స్,ఆయిల్ ఇంజన్స్,మోటారు పంపులతో తొలగిస్తున్నామన్నారు. అందులో భాగంగా భవానీపురం,ఊర్మిళా సుబ్బారావు నగర్,గవర్నర్‌పేట,సూర్యారావుపేట,జమ్మిచెట్టు సెంటర్,పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు,నిర్మల కాన్వెంట్ రోడ్,ఎయిర్పోర్టు కారిడార్,ప్రసాదంపాడుతో పాటు నగరంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో ఎయిర్‌టెక్ మిషన్లు,గల్పర్లు,ఆయిల్ ఇంజన్లు,మోటారు పంప్ సెట్లతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామన్నారు. ముఖ్యంగా గవర్నర్‌పేట లోని ప్రజా వైద్యశాల వద్ద నాలుగు గల్ఫర్లను పెట్టి వర్షపు నీటిని తొలగించామని, తద్వారా ఆస్పత్రికి వెళ్ళే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. డ్రైన్‌లలో పూడికలు తీయడమే కాకుండా,అవుట్ ఫాల్ డ్రైన్‌లలో డీ సిల్టింగ్ పనులను శరవేగంగా చేస్తున్నామన్నారు.ప్రజారోగ్యం,ఇంజనీరింగ్ సిబ్బంది సమన్వయంతో డ్రైన్లలో నీటిపారుదలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకుంటున్నామన్నారు.

## బుడమేరు పొంగుతోందనే వదంతులను నమ్మద్దు : సిపి రాజశేఖరబాబు

విజయవాడ కార్పొరేషన్,అక్టోబరు 29,ప్రభాతవార్త: బుడమేరు పొంగుతుందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి కొంతమంది ఫేక్ సమాచారాన్ని స్పెడ్ చేస్తున్నారని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధి లోని మున్నేరు,బుడమేరు తదితర అన్ని వాగులు,కాల్వలు పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమేరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని ప్రస్తుతం ఎక్కడా ఎటువంటి అలజడులు లేదని ఆయన తెలిపారు. జిల్లా యంత్రాంగం అందరూ అప్రమతంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

## ప్రజలను రక్షించడంలో ౩ా పనిచేసిన అధికారులకు ప్రశంసలు

ఎ కొండూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త : ఎపి స్టేట్ సిఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు తిరువూరు నియోజకవర్గాల్లోని ఎ కొండూరు మండలంలో మొంథా తుఫాన్ విపత్కరాన్ని ఎదుర్కొని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించి బాధితులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించి ఆదుకోవడంలో ఆయా శాఖల ప్రభుత్వ శాఖల అధికారులు సునామిలా గ్రామాల్లోకి దూసుకెళ్లి




పని చేశారని అధికారులు రేయింబవళ్లు చేసిన శ్రమ కష్టాన్ని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అభినందించారు. ఎ కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని వరి పత్తి బొప్పాయి, మిర్చి తదితర పంటల సాగు నష్టంపై డ్రోన్ల ద్వారా వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు సర్వే చేయించి అధికారులు చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు అన్నారు. ఇంకా ఈ సమీషా సమావేశంలో తహశీల్దార్ కాలి లక్ష్మి ఎంపిడివో బొజ్జగాని శ్రీనివాసరావు మండల స్పెషల్ ఆఫీసర్ ఎన్‌టిఆర్ పశు సంవర్ధక శాఖ జెడి హనుమంతరావు మండల పిహెచ్‌సి డాక్టర్ దివ్య ఆర్‌డబ్లుఎస్ ఎఈ లక్ష్మి, కంభంపాడు ఎలక్ట్రికల్ ఎఈ పామర్తి నాగరాజు తిరువూరు అగ్రికల్చర్ ఎడిఎ రంగారావు వివిధ శాఖల అధికారులతో పాటు రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ వెల్ఫేర్ డైరెక్టర్ ఎ కొండూరు మాజీ ఎంపిపి వాసం మునియ్య మండల టిడిపి మాజీ అధ్యక్షుడు తెదేపా సీనియర్ నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి, వనపర్ల డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించండి



ఎ కొండూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త :పత్తి మిర్చి వరి తదితర పంటలకు మద్దతు ధర గిట్టుబాటు ధర లేక రైతన్నలు లబోదిబోమంటూ నెత్తినోరు బాదుకుంటున్నారు.ప్రస్తుతం క్వింటా పత్తి రూ.5వేలు, మిర్చికి గత ఏడాది నుండి ధర లేకపోవడంతో కొందరు రైతులు మిర్చి పంట సాగుకు ముందుకు రావడంలేదు. అలాగే ధాన్యం ధర కూడా అధ్వాన్నంగా మారడంతో దేశానికి పట్టెడన్నం పెట్టే అన్నదాత పరిస్థితి నానాటికి దిగజారిపోతుండటంతో రైతన్నలు వ్యవసాయంపై మొగ్గు చూపటానికి వెనుకడుగు వేస్తున్నారు నియోజకవర్గంలోని తిరువూరు ఎ కొండూరు విసన్నపేట గంపలగూడెం మండలాలకు చెందిన సన్నచిన్నకారు రైతులు ఆందోళన చెందుతున్నారు.







మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏరియల్ పర్యటన (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)





మొంథా తుఫాను సహాయక చర్యలపై ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయి పర్యటన చిత్రాలు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)



## నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

### మంత్రులు 'గొట్టిపాటి', పార్థసారథి

బాపట్ల,అక్టోబర్29,ప్రభాతవార్త: తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి మరియు జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం బాపట్ల నియోజకవర్గంలో తుఫాను వల్ల దెబ్బతిన్న వరి, మిర్చి పొలాలను రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మరియు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో తుఫాను ప్రభావాన్ని 36 గంటలముందు నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆర్.టి.జి.ఎస్ ద్వారా నియోజకవర్గ స్థాయి మండల స్థాయిలో పర్యవేక్షించారన్నారు. తుఫాను కొంతమేర ప్రజలను నష్టపరిచి నప్పటికీ ఎక్కడ కూడా ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగలేదని మంత్రి చెప్పారు. తుఫాను తీవ్రత తగ్గిపోయిందని నష్టపోయిన రైతుల పంట వివరాల అంచనాలు తయారు చేయవలసిందిగా వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తుఫాను ప్రభావం వల్ల పడిపోయిన విద్యుత్ స్తంభాలను బుధవారం సాయంత్రంలోగా వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాను వల్ల దెబ్బతిన్న వ్యవసాయ పంటలు ఉద్యాన పంటల రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపారం పరిహారం అందించ డానికి చర్యలు తీసుకుంటామన్నారు.. తుఫాను వల్ల దెబ్బ తిన్న గృహాల యజమాను లకు నష్ట పరిహారం అందించాలని అదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల నష్టాలను అంచనా వేయడానికి అధికార బృందాలను పంపిస్తామన్నారు.

## అమరావతిలో ఎల్అండ్‌టి కన్‌స్ట్రక్షన్ స్కిల్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణానికి భూమిపూజ

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, అక్టోబర్ 29: రాజధాని అమరావతిలో లార్సెన్ టుబ్రో(ఎల్అండ్‌టీ) సంస్థ నిర్మించనున్న కన్‌స్ట్రక్షన్ స్కిల్స్ స్కిల్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ కేంద్రానికి భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణాంధ్ర 2047" లక్ష్యసాధనకు అనుగుణంగా రానున్న 15 ఏళ్లలో యువతకు నైపుణ్య శిక్షణ అందించి రాష్ట్రాన్ని గ్లోబల్ వర్క్‌ఫోర్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కేంద్రం రాజధాని అమరావతిలో ఏర్పాటు కానుంది. భూమి పూజలో ఎల్ టీ సంస్థ విజయవాడ క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ వడ్డే వెంకటరెడ్డి, క్లస్టర్



హెడ్(అకౌంట్స్ అడ్మినిస్ట్రేషన్) గాదె రామకృష్ణ, ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్ ప్రభాకరన్ పాల్గొన్నారు. ఎల్అండ్ టీ సంస్థకు నిర్మాణ రంగంలోని వివిధ అంశాలకు సంబంధించిన నైపుణ్య శిక్షణలో విశిష్ఠ అనుభవం ఉంది. అమరావతిలోని నెక్కల్లు ఇండస్ట్రియల్ ఏరియాలో ఈ శిక్షణా సంస్థను సుమారు 4 ఎకరాలలో ఎల్ టీ సంస్థ స్థాపించనుంది. 4,540 చదరపు మీటర్ల విస్తీర్ణంలో దిళీగి। సంస్థకు చెందిన భవనాలు, 1,883 చదరపు మీటర్ల విస్తీర్ణంలో భవనాల బాహ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఎల్ టీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఆరు విభిన్న ట్రేడ్స్‌లతో పాటు డిజిటల్ అక్షరాస్యతపై ప్రాక్టికల్ ఆధారిత, అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఎల్ టీ సంస్థ పేర్కొంది.నైపుణ్య శిక్షణా కార్యక్రమాల నిర్వహణకై అత్యాధునిక మౌలిక సదుపాయాలు, వసతి సౌకర్యాలు, ఆధునిక శిక్షణా సాంకేతికత ప్రమాణాలతో నిర్మించనున్న ఈ కేంద్రాన్ని రూ.369 కోట్ల వ్యయంతో ఎల్ టీ సంస్థ నిర్మించనుంది. శిక్షణా కార్యక్రమాల ప్రాజెక్ట్‌ను అమరావతిలో 30 ఏళ్లపాటు అమలు చేయడం జరుగుతుంది. 2026 ఫిబ్రవరి నుంచి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యే ఈ సంస్థ ద్వారా సుమారు 78,600 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారు. అలాగే అభ్యర్థుల ఎంపిక, శిక్షణా కార్యక్రమాల సమర్థవంతమైన అమలు వంటి అంశాలలో ఎల్ టీ సంస్థకు ప్రభుత్వం విస్తృతంగా సహకారం అందించి యువతకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఈ కేంద్రం ద్వారా రాష్ట్ర యువతకు నిర్మాణ రంగం సహా వివిధ పరిశ్రమల్లో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభించడంతోపాటు రాజధాని అమరావతిలో ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధి మెరుగవుతుంది.

## రహదారులపై నీళ్లు నిలవకుండా పకడ్బందీ చర్యలు

విజయవాడ, అక్టోబరు 29, ప్రభాతవార్త : లోతట్టు ప్రాంతాల్లోనూ వాన నీరు నిలిచిపోకుండా ఏర్పాట్లు క్రియాశీలంగా పనిచేసిన ప్రత్యేక బృందాలు వాన నీటి పంపుహౌజ్‌ను రాష్ట్ర వైద్య



ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్‌టిఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం విజయవాడ లోబ్రిడ్జ్ ప్రాంతంలోని వాననీటి పంపు హౌజ్‌ను పరిశీలించారు. ఈ పంపు హౌజ్ పనితీరును మునిసిపల్ ఇంజనీర్లు మంత్రికి వివరించారు. పంపుహౌజ్‌లో ఎనిమిది మోటార్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్లతో తోడిసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ విషయంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ ్మశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం మార్గదర్శకంలో ప్రత్యేక బృందాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నీరు నిలిచిపోతే అంటు వ్యాధులు, విష జ్వరాలు ప్రబలే అవకాశముందని అందువల్ల ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## వరద బాధితులకు యండ్రాతి కిరణ్ మాధవి భోజన సదుపాయం


తిరువూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త :ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టౌన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మొంథా తుఫాన్ వరద బాధితులకు



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యండ్రాతి కిరణ్ మాధవి ఆధ్వర్యంలో భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. బాధితులకు స్వయంగా వారు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షత ప్రధాన కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు పరిసె రామలింగేశ్వరరావు (రామా) కౌన్సిలర్లు అబ్దుల్ హుస్సేన్ నాళ్ళా సురేంద్ర మూడు దుర్గారావు తెదేపా నేతలు కొత్తపల్లి ఆనంద్ స్వరూప్ మోదుగు వెంకటేశ్వరరావు పర్వతం శ్రీనివాసరావు పెరుమాళ్ళ నిరంజన్ షేక్ హుస్సేన్ 13వ వార్డు తెదేపా ఇంచార్జీ కొలికపోగు రామకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంటలు పరిశీలించిన ఎంఎవో

తిరువూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త :తిరువూరు తోకపల్లి, రాజుపేట నందు తుఫాను వలన పడిపోయిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి పి. పద్మ పరిశీలించడం జరిగినది. అవకాశం ఉన్న రైతులందరూ పొలంలోని నీరు బయటకు పోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలని, పడిపోయిన పంటను ప్రాథమికంగా పైకి లేపి కట్టుకోవాలని, నీట మునిగి మొలక వచ్చే పరిస్థితి ఉన్నట్లయితే 5 ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.



## 3 ఇన్ 1 సూపర్ అకౌంట్ కోటక్ 811

అమరావతి, అక్టోబర్ 29, ప్రభాతవార్త : భారతదేశంలో ప్రముఖ డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫాం కోటక్ 811 తాజాగా తన 3 ఇన్ 1 సూపర్ అకౌంట్‌ను ప్రారంభించింది. ఇది ఒక సేవింగ్స్ అకౌంట్‌గా, ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా, సూపర్ మనీతో కూడిన ఒక సురక్షి తమైన క్రెడిట్ కార్డుగా అన్నీ ఒకచోటే లభిస్తాయి.

## మెల్ట్ తయారీని మెరుగుకు ఏఐ టెక్నాలజీ

విజయవాడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకటైన రుసల్, దాని ఉత్పత్తి ప్రక్రియలలో సామర్థ్యాన్ని పెంచడం మరియు ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడం వంటి రెండు ముఖ్యమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలను ప్రవేశపెట్టింది. ప్రపంచ కార్యకలాపాలతో రష్యా ప్రధాన కార్యాలయం కలిగిన ఈ కంపెనీ వరుసగా అల్యూమినియం ఉత్పత్తి మరియు అల్యూమినియం మెల్ట్ తయారీని మెరుగుపరచడానికి మెషిన్ హియరింగ్ మరియు మెషిన్ విజన్ టెక్నాలజీలను అమలు చేసిందని ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ సెంటర్‌లోని ప్రొడక్షన్ ఆటోమేషన్ డైరెక్టర్ మిఖాయిల్ గ్రినిషిన్ అన్నారు.

## ఏపీ మద్యం కేసులో ఏడుగురికి బెయిల్ నిరాకరణ

విజయవాడ, అక్టోబరు 29, ప్రభాతవార్త : సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో భారీ మద్యం కొనుగోలు అవకతవకల విచారణకు సంబంధించిన కేసులో నిందితులుగా ఉన్న ఏడుగురు వ్యక్తులు దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌లను విజాయవాడలోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి తిరస్కరించారు. సీనియర్ అడ్వకేట్ సిద్ధార్థ్ లూథ్రా సమర్పించిన వాదనలను న్యాయస్థానం పూర్తిగా సమర్థించింది. వరుస బెయిల్ పిటిషన్‌లపై అమలయ్యే న్యాయసూత్రాలు, ఆర్థిక నేరాల తీవ్రత, అలాగే చట్టం ప్రకారం దర్యాప్తు కొనసాగించే హక్కు ప్రాసిక్యూషన్‌కు ఉందన్న అంశాలను న్యాయస్థానం ధృవీకరించింది.

## సీజన్ చేంజ్‌లో రోగనిరోధక శక్తి

విజయవాడ, అక్టోబర్ 29, ప్రభాతవార్త : రుతువులు మారినప్పుడల్లా, మన ఆరోగ్యంపై వాటి ప్రభావం కూడా మారుతుంది. ఉష్ణోగ్రతలలో హెచ్చుతగ్గులు, అలర్జీ కారకాల బారిన ఎక్కువగా పడటం, రోజువారీ దినచర్యలో మార్పులు ఇవన్నీ మన రోగనిరోధక వ్యవస్థపై భారాన్ని పెంచుతాయి.

## పునరావాస కేంద్రంలో వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్



చిలకలూరిపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త: తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం పట్టణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మరియు అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం పరిశీలించారు. వీరితో పాటు తాసిల్దార్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరి బాబు, మున్సిపల్ డి ఈ రహీం, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఓగేరు వాగులో మునిగిన బొందిలిపాలెం స్మశాన వాటికను పరిశీలించిన చిలకలూరిపేట తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్. (చిలకలూరిపేట, ప్రభాతవార్త)

## గర్భిణీని క్షేమంగా హాస్పిటల్ చేర్చిన ఆశా కార్యకర్త



అచ్చంపేట, అక్టోబర్ 29 (ప్రభాతవార్త): తుఫాను ప్రభావంతో ఈదురుగాలులు, వర్షాలు కురుస్తున్నప్పటికీ తన బాధ్యతను మరువని ఆశా కార్యకర్త మానవత్వాన్ని చాటారు. అచ్చంపేట మండలంలోని తాళ్లచెరువు గ్రామానికి చెందిన ఓ గర్భిణీకి ప్రసవ వేదనలు మొదలయ్యాయి. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఆశా కార్యకర్త రాణి, 108 అంబులెన్స్ సాయంతో గర్భిణీని సురక్షితంగా సత్తనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమెను చేర్పించి, వైద్య సిబ్బందికి అవసరమైన సూచనలు అందజేశారు. తుఫాను తీవ్రత మధ్యన కూడా సేవాభావంతో ముందుకువచ్చిన ఆశా కార్యకర్త రాణి చర్య ప్రశంసనీయమని స్థానికులు అభినందించారు.

## అన్నదాత విలవిల!



ముప్పాళ్ల అక్టోబర్ 29 (ప్రభాతవార్త): ముప్పాళ్ళ మండలంలో వివిధ గ్రామాల్లో మొందా తుఫాన్ అధిక వర్షాలు పడటం వలన ప్రత్తి , వరి పంటలను అగ్రికల్చర్ అధికారులు శ్రీధర్ రెడ్డి సందర్శించి తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వరి పంటలలో చిరుపొట్ట దశ నుంచి కోత దశ కి వస్తున్నందున ఎక్కువ గా ఉన్న నీటి ని పొలం నుంచి తొలగించి తర్వాత ప్రొపికోనజోల్ ను ఎకరానికి 200 మీ. లీ పిచికారి చేసిన చో పొడ తెగులు నాని పండు తెగులు రాకుండా నివారించవచ్చు అదేవిధంగా ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో



దుబ్బు దశలో ఉన్న వరి పంట పొలం లో ని నీరు తగ్గిపోయిన వెంటనే యూరియా 20 కి లోలు మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 20 కి లోలు ఒక ఎకరానికి బూస్టర్ డోస్ గా పంట ఎదుగుదల కోసం పంట పొలం లో చల్లాలి అని సూచించారు అదే విధంగా మండలం లో సాగు చేసిన ప్రత్తి పంట ప్రస్తుతం 90 నుంచి 120 దశ లో ఉన్నందున ప్రస్తుత అధిక వర్ష ప్రభావాన్ని నిర్వహించే మార్గాన్ని చూసిస్తూ మొదటిగా మురుగునీటిని వీలైనంత త్వరగా పోయే మార్గం కల్పించడం 2 యూరియా లేదా 2 పొటాషి యం నైట్రేట్ లేదా 2 19:19:19 ని 1 మెగ్నీషియం సల్ఫేట్ తో పాటుగా రెండు సార్లు 7 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కాయ కుళ్ళుని తగ్గించడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సి ఓ సి) + 0.1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ / లీ. మొక్కల క్రింది భాగపు కొమ్మలు మరియు పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటె ప్లానోఫిక్స్ (4. 5 నాప్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి అని మండల వ్యవసాయ అధికారి తెలియజేయటం జరిగింది..

## మానవత్వం పరిమళించిన సేవ: డాక్టర్ సింగరాజు

సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 29ప్రభాతవార్త : :సత్తెనపల్లి పట్టణంలోని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆశ్రయం, 350 మందికి భోజనంఏర్పాటు చేసింది.మంగళవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన ప్రజలకు సత్తెనపల్లిలోని డా. సింగరాజు సాయికృష్ణ తన వంతుగా అండగా నిలిచారు.ఆయన నిర్వహిస్తున్న సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ద్వారా



వెంకటపతి కాలనీ, సుందరయ్య కాలనీ, నాగన్న కుంట ప్రాంతాల ప్రజలకు ఆశ్రయం కల్పించడానికి ముందుకు వచ్చారు. నిరాశ్రయులైన ప్రజలు నరసరావుపేట రోడ్డులో ఉన్న తమ ఆసుపత్రిలో సురక్షితంగా ఆశ్రయం పొందవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. భారీ వరదాపురం ప్రభావంగా నీట మునిగిన కుటుంబాలను డా. సింగరాజు సాయికృష్ణ తన మానవతా దృక్పథంతో, ఆశ్రయం పొందిన సుమారు 350 మంది ప్రజలకు బుధవారం భోజన సౌకర్యాన్ని కూడా అందించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ప్రజలు సంప్రదించవచ్చు. ఆపద సమయంలో డా. సాయికృష్ణ మరియు వారి సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ అందిస్తున్న ఈ సేవ ఎంతో ప్రశంసనీయం. వారి ఔదార్యం మరియు సేవానిరతి మరెందరికో ఆదర్శనీయం నిలిచింది ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## గర్భిణీలు, బాలింతలకు ఆహారం అందజేత



సత్తెనపల్లి టౌన్ అక్టోబర్ 29ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలో 31వ వార్డుఅంబేద్కర్ కాలనీ అంగడి వారి కేంద్రం పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఆదెమ్మ తన సిబ్బందితో గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పాల ప్యాకెట్లు ఆహారం అందించారు ఆదెమ్మ మాట్లాడుతూ భారీ తుఫాన్ కారణంగా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందించామని ఈ కార్యక్రమం చేపట్టామనితెలిపారు..భారీ వర్షాల కారణంగా పూరి గుడిసెలో నివసిస్తున్న బాధితులను అంగడి వారి పాఠశాలలో ఆశ్రయం కల్పించాలని తాసిల్దార్ ఆదేశాల మేరకు కుటుంబాలకు ఆశ్రయం కలిగించామని వాళ్లకు భోజన సౌకర్యం అందించామన్నారు .ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఏరియా , అంగడి ఉపాధ్యాయులు ఆదెమ్మ ,ఆశా వర్కర్స్ మేరీ ,తదితరులు పాల్గొన్నారు.

## చప్టాపై వరద నీరు



సత్తెనపల్లి రూరల్, అక్టోబర్ 29ప్రభాతవార్త సత్తెనపల్లి మండలంలోని నందిగామ గ్రామ కోల్డ్ స్టోరేజ్ వద్ద గల చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. నీటి ఉధృతి తగ్గే వరకు వాహనదారులు సహకరించాలని, నిలిచి ఉండాలని స్థానిక వీఆర్వోలు, పంచాయితీ సిబ్బంది కోరారు. ప్రయాణానికి అంతరాయం కలిగినప్పటికీ, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు.

## అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

క్రోసూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త: తుఫాన్ సందర్భంగా ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జ్వరాలు, విరోచనాలు సంభవిస్తే తక్షణమే వైద్య సిబ్బందికి తెలియజేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు గ్రామంలో లోతట్టు ప్రాంతమైన అనంతవరం రోడ్డు ఎస్టీ కాలనీ ను సందర్శించి ప్రజలకు



అంటువ్యాధులపై తుఫాను పట్ల తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తల గురించి వివరించారు కాలనీలో నీరు వస్తే వెంటనే తహసిల్దార్ వారి కార్యాలయానికి తెలియజేయాలన్నారు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యంగా నిండు గర్భిణీ స్త్రీల ఆరోగ్యం సురక్షి త ప్రసవం కోసం వైద్య ఆరోగ్యశాఖ ముందు చూపుతో అమలు చేసిన కార్యక్రమాన్ని తూ. చ తప్పకుండా పాటిస్తున్నట్లు ఆయన తెలిపారు వాతావరణ సూచనలను గమనించి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు బయట పనులు కార్యక్రమాలు విరమించుకొని ఆపుకోవాలని అని అన్నారు పొలాల్లో పనిచేసే రైతులు బహిరంగ ప్రదేశాల్లో పని చేసేవారు పశువుల కాపర్లు గొర్రెల కాపర్లు సురక్షిత భవనాల్లోకి వెళ్లాలన్నారు ఉరుములు, మెరుపులు సంభవిస్తే చెట్ల కింద చెట్ల సమీపంలోని టవర్ల వద్ద చెరువుల వద్ద ఉండరాదని అన్నారు పిడుగులు సమయంలో స్నానం చేయటం చేతులను కడగటం నీటితో ఉండటం లాంటివి చేయకూడదన్నారు పిడుగు బాధితుని సత్వరమే దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలి అని పేర్కొన్నారు ప్రభుత్వ అధికారులు సూచించిన వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు వెళ్లాలన్నారు వర్షాలు, గాలి వానలలో రవాణా వ్యవస్థ దెబ్బ తినే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్స్పెక్టెడ్ డెలివరీ డేట్ (ప్రసావ తేదీ వారం రోజులు మాత్రమే సమయం ఉన్న గర్భిణీ స్త్రీలను స్థానిక వైద్య సిబ్బంది ముందుగానే గుర్తించి, వారిని సురక్షితంగా ఏరియా ఆసుపత్రులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రములకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించడం జరిగిందన్నారు ఈ సత్వర చర్యల వల్ల అనేకమంది గర్భిణీ స్త్రీలు శిశువులు, సురక్షితంగా ఉండే అవకాశాలు మెరుగుపడినట్లు శాంసన్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## తుఫాను ప్రభావిత ప్రజలు ఆందోళన చెందవద్దు

### చీఫ్‌విప్ జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన

వినుకొండ, అక్టోబర్29, ప్రభాతవార్త: తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు గ్రామాలు, కాలనీల్లో జీ.వీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, అధికారులతో కలిసి పర్యటించారు.









వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి పంచాయితీ పరిధిలో నీటమునిగిన అరుంధతి కాలనీ, రజకకాలనీ, పట్టణంలోని సుందర య్యకాలనీ, ముట్లకుంట కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రజలను పరామర్శించారు. వరద బాధితుల కోసం పట్టణంలోని నిర్మలా స్కూల్ నందు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అక్కడి ప్రజలను తరలించారు. పునరావాస కేంద్రాలను సందర్శించి అక్కడ వసతి పొందుతున్న ప్రజలతో మాట్లాడారు. కల్పిస్తున్న భోజనవసతి, తాగునీరు, వైద్యం తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా విపత్తు ప్రమాదం నుంచి ప్రజలను కాపాడామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి సమన్వయంతో వరద సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట, అక్టోబర్ 29 ప్రభాతవార్త : పట్టణంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సహాయక చర్యలను చేపట్టారు. భోజనం, త్రాగునీటి ప్యాకెట్లను వరద




బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావాన్ని గుర్తించి సకాలంలో అధికార యంత్రాంగం స్పందించలేదన్నారు. ముందస్తు చర్యలను చేపట్టినట్లయితే నష్టం వాటిల్లేదికాదన్నారు. దెబ్బతిన్న ఇళ్ళకు తక్షణమే నష్టపరిహారం అందించాలన్నారు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సహాయక చర్యలు వేగంగా లేవన్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి బాధితులను ఆదుకోవాలన్నారు. సత్తెనపల్లిరోడ్డులో చంద్రబాబునాయుడు కాలనీ, బిసి కాలనీ నీటమునిగాయన్నారు. చెట్ల విరిగి ఇళ్ళపై పడ్డాయని, కరెంటు స్తంభాలు కూలిపోయాయన్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. బరంపేట వంటి ప్రాంతాలలో త్రాగునీటి బాల్స్‌ను వైకాపా అందజేసే వరకు అధికారయంత్రాంగం పట్టించుకోలేదని విమర్శించారు. సహాయక చర్యల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న వైకాపా నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.

## పొంగి పొర్లిన వాగులు, వంకలు...నీట మునిగిన పంట పొలాలు

పెదకూరపాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త : మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా బుధవారం పెదకూరపాడు, అమరావతి మండల పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నివాస స్థలాల్లోకి, వీధుల్లోకి వర్షపునీరు చేరుకుంది. పెద్దమద్దూరు, మల్లాది పరిసర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాగుల వద్ద విఆర్వోలు, విఆర్ఏలు, పంచాయితీ సిబ్బంది కాపలాగా ఉన్నారు. రాకపోకలను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. అమరావతి మండలంలోని పెదమద్దూరు వద్ద వాగు పొంగిపొర్లింది. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు భయంగుప్పెట్లో ఉండిపోయారు.







పెదకూరపాడు మండలంలో పేరమ్మ వాగు, కంభంపాడు వాగు, ఏపీ వద్ద వాగు, తాళ్ళూరు వద్ద వాగు, పరస పెట్రోల్ బంక్ వద్ద వాగు పొంగిపొర్లింది. వాగులు, వంకలను ఆయా మండల తహశీల్దార్, పోలీస్ సిబ్బంది పరిశీలించి పర్యవేక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎప్పటికప్పుడు నియోజకవర్గంలో లోతట్టు ప్రాంత ప్రజల వివరాలను, వారి స్థితిగతులను అందిస్తున్న పునరావాస కేంద్రాల పరిశీలనలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నంకి తుఫాన్ ప్రభావం కొంత మేర తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పంట పొలాలు పూర్తిగా మునిగిపోయి కొన్ని ప్రాంతాల్లో పత్తి పొలాలు ఉరకెత్తాయి. అధికారులు పరిశీలించి నష్టపోయిన పంట పొలాలకు నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## వైరల్ ఫీవర్ పై సర్వే చేపట్టిన ఆరోగ్య సిబ్బంది



పెదకూరపాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త : వైరల్ ఫీవర్ పై సిహెచ్ఓ అనుపమ పెదకూరపాడు -3 సెంటర్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం జ్వరాల సర్వే చేపట్టారు. ఇంటింటికి వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించారు. తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్త వహించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనూషకుమారి, ఆశా కార్యకర్తలు పరిశుద్ధ సుఫియా, స్వప్న, ఆశ పాల్గొన్నారు.

## దానాలు ఎన్ని ఉన్నా అన్నదానాన్ని మించిన దానం లేదు

పెదకూరపాడు, అక్టోబర్ 29 ప్రభాతవార్త : దానాలు ఎన్ని ఉన్నా అన్నదానాన్ని మించిన దానం లేదని, అన్నం పెట్టడం అంటే ప్రాణం నిలబెట్టడమేనని ఆకలితో ఉన్నవారి కడుపులోకి వెళ్ళే ఒక్కొక్క మెతుకు వారికి ప్రాణాన్ని పోసి శక్తినిస్తుందని తుళ్ళూరి సాంబశివరావు అన్నారు. పెదకూరపాడుకు చెందిన గుడిపూడి శివకృష్ణ, ఓల్గా వినూత్న దంపతుల కుమారుడు తారక్ అయాన్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో జనచైతన్య సమితి స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి



వచ్చిన రోగుల సహాయకులకు, రోడ్డు ప్రక్కన జీవించే నిరాశయులకు యాచకులకు బుధవారం భోజనం ఏర్పాటు చేశారు. అలాగే పెదకూరపాడు మండలంలోని శాంతి కాలనీవాసులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా భోజనానికి ఇబ్బంది పడే వారికి భోజనం సమకూర్చటం అభినందనీయమన్నారు. ఫంక్షన్ ఏదైనా భోజనం మిగిలిందనే సమాచారం ఇస్తే ఆ భోజనం వృధా కాకుండా అవసరమైన వారికి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి బృందం ప్రతినిధులు బెజ్జం నాగేశ్వరరావు, దాసరి కారుణ్యబాబు, గోగులపాటి సజీవ్ రూప్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాను ధాటికి విజయపురిసౌత్‌లో ఆస్తినష్టం



విజయపురిసౌత్, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను కారనంగా విజయపురిసౌత్‌లోని గండిపోయిన గౌరమ్మ అలియాజ్ పద్మ నివసిస్తున్న ఇల్లు తుపాను ధాటికి కూలిపోయింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మట్టిగోడలతో నిర్మించిన రేకుల ఇల్లు కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న మాచర్ల ఎమ్మార్వో కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. నష్టపోయిన కుటుంబానికి పప్పు, నూనె, బియ్యం కొన్ని సరకులు అందజేశారు. గృహ నిర్మాణ శాఖ వారు తాత్కాలికంగా గృహం ఏర్పాటు చేయాలని సూచించారు. అప్పటి వరకు బాధితులు ఎస్టీ హాస్టల్‌లో ఉండటానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఈదురు గాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

## ప్రభుత్వం అపమ్రత్తతతో తప్పిన ముప్పు

గురజాల, అక్టోబరు 29 ప్రభాతవార్తః కూటమి ప్రభుత్వం అప్రమత్తత, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మొంథా తుఫాన్ ముప్పు తప్పిందని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.



విపత్కర పరిస్థితుల సమయంలోనే ప్రభుత్వ సమర్థత బయటపడుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, అనితలు నిరంతరం సమీక్షిస్తూ అధికారులతో సమీక్షిస్తూ తుఫాన్ గండం నుంచి గట్టెక్కించారని ప్రశంసించారు. తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, విద్యుత్ సరఫరా, రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టడం వలన రాష్ట్రం పెను ప్రమాదం నుంచి బయటపడిందన్నారు. వాతావరణ శాఖ సూచనలను అనుసరిస్తూ 24 గంటలు పనిచేస్తూ పై నుంచి కింది స్థాయి అధికారుల వరకు అప్రమత్తతం చేయడం వలన ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు.

**విపత్తులోనూ మారని వైసీపీ తీరు:** కూటమి ప్రభుత్వంలోని పెద్దలు రాత్రి పగలు తేడా లేకుండా తుఫాన్‌ను ఎదుర్కొనడానికి తీవ్రంగా కష్టపడుతుంటే వైసీపీ సోషల్ మీడియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం దారుణమన్నారు. వరదలు వచ్చాయని, విజయవాడ మునిగిపోతుందని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ వైసీపీ నేతలు ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు నియోజకవర్గంలోని అధికారులు, కూటమి నేతలతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడుతూ అధికారులు, నాయకుల సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామన్నారు. మొంథా తుఫాన్ వలన గురజాల నియోజకవర్గంలోని ప్రజలు ఇబ్బందులకు గురైతే నాయకుల దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే యరపతినేని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. వర్షం ప్రభావం తగ్గిన తరువాత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కాసు



గురజాల, అక్టోబరు 29 ప్రభాతవార్తః మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని చర్లగుడిపాడులో గ్రామం నీట మునిగిన పంట పొలాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తుఫాన్ కారణంగా నీట మునిగిన పొలాలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సాయం అందించి వారికి కొంత ఉపశమనం కలిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి మురళీధరరెడ్డి, సీనియర్ నేతలు కొమ్మినేని వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా నేత గాంధీ, ఎంపీపీ చలమయ్య, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఆంధ్రయ్య, మన్యం ప్రసాద్, అన్నారావు, పోలా సతీష్, జక్కా సత్యం, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి మండలంలో వరద ఉధృతి

### సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

### వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో వెల్దుర్తి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ఫలితంగా మండలంలోనిన లోతట్టు గ్రామాలు వరద నీటితో మునిగిపోయాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి. వరద ఉధృతి గ్రామాల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. రాకపోకలు స్తంభించాయి ఈ పరిస్థితిని గమనించిన జిల్లా యంత్రాంగం తక్షణమే








స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. వరద ముంపునకు గురైన సుమారు 10 గ్రామాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తాత్కాలిక పునరావాస కేంద్రానికి తరలించారు. శిరిగిరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమన్వయంతో సుమారు 100 మందికిపైగా బాధితులను సురక్షితంగా ఈ కేంద్రానికి తరలించి ఆశ్రయం కల్పించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వరద బాధితులకు ఆహారం, వైద్య సదుపాయాలు అందేలా అధికారులతో పర్యవేక్షించారు. వారికి అవసరమైన నిత్యావసరాలు, ఆహారం, సురక్షిత తాగునీరు వెంటనే అందజేశారు. వృద్ధులు, పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వ్యాధులు ప్రబలకుండా అవసరమైన మందులు, వైద్య సేవలను పునరావాస కేంద్రంలో అందజేశారు. వరద ఉధృతి తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట తహశీల్దారు రాజశేఖర్‌నాయక్, ఎంపీడీఓ ప్రసాద్, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు



సత్తెనపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : పట్టణంలోని సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు హాస్పటల్ ఎం.డి. డాక్టర్ సింగరాజు సాయికృష్ణ బుధవారం తెలియజేశారు. పట్టణంలోని వెంకటపతికాలనీ, సుందరయ్యకాలనీ, నాగన్నకుంట ప్రాంతాలలోని నివాసితులకు హెల్ప్‌లైన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సోమవారం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం అయ్యాయని ఆయన తెలిపారు. అటువంటి ప్రాంతాల ప్రజలు తమ హాస్పటల్‌లోని హెల్ప్‌లైన్ నెంబర్ 9932374555 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. నిర్వాసితులు ఆశ్రయం పొందవచ్చని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు.

## పనులు కోల్పోయిన కార్మికులను ఆదుకోవాలి

సత్తెనపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : పనులు కోల్పోయిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలకు రూ.10 వేలు నగదు, నిత్యావసర సరుకులు, గ్యాస్ సిలెండర్ అందించాలన్నారు. అదే విధంగా పనులు లేనటువంటి వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తుఫాన్ వలన వరి, పత్తి, మిరప, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం ఆ పంటలకు నష్టపరిహారం అందించాలని జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

## జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు

సత్తెనపల్లి, అక్టోబర్ 29 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. నరసరావుపేటరోడ్డులోని సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పటల్, పట్టణంలోని హోరీస్ స్కూల్ నందు, రిహాబిలిటేషన్ సెంటర్ నందు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముంపు ప్రాంత బాధితులకు అల్పాహారం అందిస్తున్నామన్నారు. అదే విధంగా పట్టణంలోని ఎస్పిజి డిగ్రీ కళాశాల వద్ద, మస్టిన్‌పేటలోని 40 కుటుంబాలను ప్రభుత్వ పాఠశాలకు తరలించామన్నారు. యాదవ హాస్టల్‌లోనూ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

## ఉయ్యందనలో మళ్లీ వరద సమస్య

క్రోసూరు( అక్టోబర్ 29, ప్రభాతవార్త: క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామంలో వరద సమస్య మళ్లీ మళ్లీ తలెత్తుతోంది. ఇప్పటికే నాలుగు నుండి ఐదు సార్లు వాగు పొంగి పొర్లినా పరిస్థితి మారలేదు. సమీపంలోని 88 తాళ్లూరు గ్రామానికి చెందిన కొంతమంది రైతులు కాలువను పొలాల్లో కలుపుకొని సాగు చేయడం వలన నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి.దీంతో వాగు నిండిపోయి ప్రతి సారి వరద ముప్పు తలెత్తుతోంది. రెండు గ్రామాల మధ్య రాకపోకలు అంతరాయం కలుగుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కు వెళ్ళడం, స్కూల్ పిల్లల ప్రయాణం వంటి విషయాల్లో కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రజలంతా అధికారులు వెంటనే స్పందించి గతంలో ఉన్న కాలువను పునరుద్ధరించాలని, ఆక్రమణలు తొలగిస్తే నీటి ప్రవాహం సక్రమంగా సాగి సమస్య తగ్గుతుందని కోరుతున్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రేపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త: మండలంలోని కారుమూరు,పేటేరు, వేజండ్లవారి లంక తదితర గ్రామాల్లోని వారి పంటను బుధవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు.తుఫాన్ ప్రభావం కారణంగా రైతులు చేపట్టాల్సిన చర్యల గురించి వెల్లడించారు.వరిపంట పూతదశలో తెగుళ్ళు నివారణకు తగిన సూచనలిచ్చారు.వరి పంట పరిస్థితులను గమనించి పురుగు, తెగుళ్ళు ఉధృతిని నిర్ధారించుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్ బాబు సూచించారు.బ్యాక్టీరియా ఎండాకు తెగులుకనిపిస్తే ప్లాంటోమైసిన్ 1 మి.లీ/లీటరు,కొసైడ్ (కాపర్ హైడ్రాక్సయిడ్) 2గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.నీరు తగ్గిన తరువాత హెక్సాకోనాజోల్ 400 మి.లీ ఎకరాకు లేదా ప్రోపికోనాజోల్ 200 మి.లీ/ఎకరాకు పిచికారీ చేయడం ద్వారా మాగుడు తెగులు వ్యాప్తి తగ్గుతుందని ఆయన రైతులకు వెల్లడించారు. మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి. ఆకుముడత పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రా లేదా క్లోరాన్ట్రిప్రోల్ 60 మి.లీ 200 లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.దోమపోటు, మాగుడు తెగులు, మానిపండు నివారణకు ఎకరానికి ప్రోపికోనజోల్ 200 మిల్లి,పైమెట్రోజాన్ 120 గ్రా లేదా ప్రోపికోనజోల్ 200 మిల్లి,96 మిల్లీ ట్రైఫ్లుమెజోపైరం 10 ఎస్ సి పిచికారీ చేసుకోవాలని మహేష్ బాబు చెప్పారు.తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీకి అందుబాటులో ఉన్న డ్రోన్ లను ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు,గ్రామవ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణే లక్ష్యం : జె.సి భావన శ్రేష్ట



రేపల్లె,అక్టోబరు 29,ప్రభాతవార్త: తుఫాన్ నేపథ్యంలో ప్రజల ప్రాణ రక్షణ కోసం ప్రభుత్వ యంత్రాంగం అహర్నిశలు అప్రమత్తంగా వ్యవహరిస్తోందని జాయింట్ కలెక్టర్ భావన శ్రేష్ట స్పష్టం చేశారు.బుధవారం రేపల్లె మండలంలోని పెనుమూడి గ్రామంలో కొనసాగుతున్న పునరావాస కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.వసతి గృహంలో సౌకర్యాలు,ఆహార ఏర్పాట్లపై ఆశ్రయం పొందుతున్న వారిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో పునరావాస కార్యక్రమాలపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.రేపల్లె నియోజకవర్గంపై తుఫాన్ ప్రభావానికి సంబంధించిన అంశాలను జాయింట్ కలెక్టర్ భావన శ్రేష్ట దృష్టికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి,రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



రేపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త: రేపల్లె పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.సాంబశివరావు చెప్పారు.ఈ సమావేశంలో 19 అంశాలపై చర్చించి ఆమోదించాల్సి ఉంటుందన్నారు.సమావేశానికి మున్సిపల్ ఛైర్ పర్సన్ కె.మంగ అధ్యక్షత వహిస్తారని కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

## తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

రేపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త:తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు రూ.5వేల నష్ట పరిహారంతో పాటు,25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు.పునరావాస కేంద్రాలలో ఉన్న వారితో పాటు ఇళ్ళ చుట్టూ నీరు చేరిన వారికి,పనులు కోల్పోయిన కుటుంబాలకు సహాయం చేయాలన్నారు.అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బుధవారం పట్టణంలోని 20వ వార్డు ఐబీపీ పెట్రోల్ బంక్ వెనుక కాలనీ, పీఎంఏవై ఎన్టీఆర్ నగర్(పాత జగన్ కాలనీ),8 వార్డు రాజేష్ హాల్ వెనుక, నేతాజీ కాలనీ తదితర ప్రాంతాల్లోని తుఫాన్ బాధితులను ఆయన పరామర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు జి.దానియేలు,డి.అగస్టీన్,కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికునికి ఘనస్వాగతం



పిట్టలవానిపాలెం,అక్టోబర్29,ప్రభాతవార్త: మండల పరిధిలోని చందోలు గ్రామంలోని హబీబుల్లా మస్జిద్‌లో గత 15 సంవత్సరాలుగా పేష్మామంగా సేవలందిస్తున్న షేక్ హుస్సేన్ అహ్మద్ హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని బుధవారం స్వస్థలానికి చేరుకున్నారు.ఈ హజ్ యాత్రకు సంబంధించిన అన్ని ఖర్చులను గ్రామానికి చెందిన దాతలు, ఆలీఅక్తరున్నీస్సా దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుమారులు ప్రముఖ వ్యాపారవేత్తలు డాక్టర్ షేక్ రహంతుల్లా, షేక్ మునీర్ సహకారం అందించారు.సేవా భావంతో ముందుకొచ్చిన వీరు హజ్ యాత్రికునికి పూర్తి మద్దతు ఇచ్చి మతపరమైన సేవల పట్ల తమ అంకితభావాన్ని చాటుకున్నారు.హజ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని భారతదేశానికి తిరిగి వచ్చిన సందర్భంగా హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రముఖ వ్యాపారవేత్త అవార్డు గ్రహీత డాక్టర్ షేక్ రహంతుల్లా స్వయంగా హుస్సేన్ అహ్మద్ కు ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు.గ్రామస్థులు ఈ సందర్భాన్ని హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ, షేక్ రహంతుల్లా షేక్ మునీర్ సహోదరుల దాతృత్వాన్ని ప్రశంసించారు.

## అబ్దుల్ కాజా,అఖీల్ సేవలు అభినందనీయం

పిట్టలవానిపాలెం,,అక్టోబర్29,ప్రభాతవార్త: అపదలో ఉన్నవారికి సేవసహాయాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తహాశీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావస కేంద్రాల్లో ఉన్న వృద్ధులకు, మహిళలకు, చిన్నారులకు అబ్దుల్ కాజా, అఖిల్ సహకారంతో బుధవారం తాసిల్దార్ వెంకటేశ్వరరావు, ఎస్సై మర్రి వెంకట శివకుమార్, దుప్పట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ దాతలు అబ్దుల్ కాజా,అఖీల్‌లు పునరావాల కేంద్రాలలోని వారికి సహాయాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అఫ్జల్, టిడిపి యువ నాయకులు సయ్యద్ నిజామ్, కార్యదర్శి సుజాత, విఆర్ఓ అరుణ ఉన్నారు.



## మానవతా కర్లపాలెం శాఖ ఆధ్వర్యంలో ..దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం,అక్టోబర్28,ప్రభాతవార్త: తుఫాను పునరావస కేంద్రాల్లో ఉంటున్న వృద్ధులకి కర్లపాలెం మానవతా శాఖ అధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ దుప్పట్ల పంపిణీ తూనుకుంట్ల జగదీష్ కుమార్, ఆలపాటి వెంకటరమణ, పెనుమత్స నాగ వర్మ రాజు, తూనుకుంట్ల లలిత బాబు. వారి సహకారంతో వీటిని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. మండల పరిధిలోని నర్రా వారి పాలెం, ఉర్లమ్మకాలనీ, పరిసరప్రాంతాల్లో ఉన్న 70 మంది కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మానవతా శాఖ అధ్యక్షులు తూనుగుంట్ల వెంకట సుబ్బారావు, కార్యదర్శి మందపాటి పరమానంద కుమార్, కోశాధికారి లలిత బాబు, కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇన కొల్లు పోలీసురావు, మానవతా శాఖ డైరెక్టర్ ఆట్ల బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నీట మునిగిన 636 ఎకరాల వరి పంట

కర్లపాలెం,అక్టోబర్29,ప్రభాతవార్త: మొంత తుఫాను ప్రభావం వలన కర్లపాలెం మండలంలో ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం 636 ఎకరాల వరి పైరు నీట మునిగిందని ఎడిఎ,ఎపిసిఎన్ఎఫ్,డిపిఎం హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా తుఫాను తర్వాత వరి పైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై సమ్మెటవారిపాలెంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హుస్సేన్ మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా చేలలోని నీరు కాలువల ద్వారా బయటకు పంపించాలన్నారు. నీరు తీసిన తర్వాత పైరు చిరుపొట్ట దశలో ఉంటే ఎకరానికి 20 కిలోల యూరియా + 20 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. పూత దశలో వర్షం పడితే తాలు మరియు రంగు మారిన గింజలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వాతావరణంలో పురుగు మరియు తెగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా తెగుళ్లలో మానిపండు తెగులు, ఆకు మచ్చ, మాగుడు తెగులు సోకే అవకాశం ఉందనీ ఈ తెగుళ్ల నివారణకు ప్రోపికోనజోల్ (టిల్ట్) 200 మి లీ లేదా కస్టోడియ 300 మి లీ లేదా నేటివో 120 గ్రా పిచికారీ చేసుకోవచ్చన్నారు. దోమ పోటుకు పైమెట్రోజిన్ (చెస్) 120 గ్రా లేదా ట్రైఫ్లుమెజోపైరం (పెక్సాలాన్) 96 మి లీ ఎకరాకు పిచికారీ చేసుకోవచ్చన్నారు. అవసరాన్ని బట్టి పైన తెలిపిన వాటిలో ఒక పురుగు మందు మరియు ఒక తెగులు మందు కలిపి పిచికారీ చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పరంగా ఆసక్తి కలిగిన వారు సప్త ధాన్యాంకుర కషాయం లేదా కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణం పిచికారీ చేయడం ద్వారా పైరుకు బలం చేకూరి గింజ మంచిగా పాలు పోసుకుంటుందన్నారు. పైరు గింజ గెట్టిపడే దశలో లేదా కోత దశలో ఉంటే 5 ఉప్పునీటి ద్రావణం (50 గ్రా ఉప్పు లీటర్ నీటికి) కలిపి పైపాటుగా పిచికారీ చేయడం వలన గింజ మొలకెత్తకుండా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆడిషనల్ మోహన్ గారు, మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్, లీగి శ్రీకాంత్ , రవి శంకర్, జుతితి భ్రమరాంబదేవి, రైతులు పాల్గొన్నారు.



## అధికారుల సమన్వయంతోనే మొంథా తుఫాను నుంచి సురక్షితం

బాపట్ల,అక్టోబర్29,ప్రభాతవార్త: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మొంథా తుపాను ప్రభావం నుండి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారని బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బుధవారం, చీరాల నుండి పర్చూరు మార్గంలో గల రొంపేరు కుడి మేజర్ కాలువను,



పర్చూరు వాగు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తో కలసి బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రి, సమాచార మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ తుఫాన్ నుండి ప్రజలను రక్షించుటలో, నష్టాన్ని తగ్గించుటలో, ప్రాణ నష్టం లేకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, అధికారులందరూ సమన్వయంతో పని చేశారన్నారు. పర్చూరు వాగు ఊహించని రీతిలో ప్రవహిస్తూ పర్చూరు, నాగులపాలెం ను వరద నీటితో చుట్టుముట్టిందన్నారు.. పర్చూరు వాగు సామర్థం 5500 క్యూసెక్కులు మాత్రమేనన్నారు. పల్నాడు, చిలకలూరిపేట, అద్దంకిలో కురిసిన వర్షం కారణంగా పర్చూరు వాగులో 9 నుండి 11వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందన్నారు. ఈ వరద నీటిని తరలించుటకు జిల్లా కలెక్టర్ ఒక మంచి నిర్ణయాన్ని తీసుకుని నీటిని తరలించి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు.. సరైన సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించకపోతే పర్చూరుకు, ఉప్పుటూరు గ్రామమునకు నష్టం జరిగేదన్నారు. భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి రాకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వరరావు, డ్రైనేజీ శాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా తుఫాను సహాయ కార్యక్రమాలు

## నిండు గర్భిణి ప్రాణాలు కాపాడిన ఇంకోలు ఎస్సై సురేష్

బాపట్ల,అక్టోబర్29,ప్రభాతవార్త: తుఫాను సహాయక చర్యల్లో భాగంగా ఇంకొల్లు మండలం కొనికి గ్రామపంచాయతీలోని కట్టవారిపాలెం గ్రామంలో నిండు గర్భిణి ప్రాణాలు కాపాడటంతో పాటు నిండు గర్భిణీ ఆసుపత్రికి తీసుకెళ్లడం వలన ఇద్దరు కవల పిల్లలకు జన్మనివ్వడం జరిగిందని తల్లి మరియు పుట్టిన ఇద్దరు బిడ్డలు క్షేమంగా ఉన్నారని జిల్లా ఎస్పీ బీ ఉమామహేశ్వర్ తెలిపారు.స్థానిక జిల్లా



పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎస్పీ మాట్లాడుతూ ఇంకొల్లు మండలం, కొణికి గ్రామ పంచాయతీలోని కట్టవారిపాలెం గ్రామంలో24 ఏళ్ల గర్భవతి అయిన టి. కీర్తి అనే మహిళకు తెల్లవారుజామున ప్రసవ నొప్పి



మొదలైయ్యాయన్నారు. ముంథా తుఫాను కారణంగా, వాగులు పొంగిపొర్లడంతో, 108 అంబులెన్స్ కొణికి నుండి గ్రామానికి చేరుకోవడం అసాధ్యం అయింది. కొణికి గ్రామ మహిళా పోలీసు అధికారి ప్రియ, ఇంకొల్లు ఎస్ఐ సురేష్, తన సిబ్బంది డబ్ల్యూహెచ్‌సి 243 బ్రహ్మేశ్వరి,హెచ్‌జి 612 రామకృష్ణ వెంటనే ఆ గ్రామానికి చేరుకున్నారు. అంగన్వాడీ కార్యకర్త మరియు మహిళా పోలీసుల సహాయంతో, వారు గర్భిణీ స్త్రీని తమ పోలీసు జీపులో ఉంచి, తుఫాను మధ్య వరదలున్న వాగును దాటి, ఇంకొల్లులోని విజయలక్ష్మి ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు,ఎస్ఐ కూడా ఇంకొల్లు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అంజలిని సంప్రదించి, ఆ మహిళకు చికిత్స చేయమని అభ్యర్థించారు. ఆ మహిళ కవల పిల్లలను ప్రసవించింది మరియు తల్లి మరియు శిశువులు ఇద్దరూ సురక్షితంగా ఉన్నారు. తరువాత, తదుపరి చికిత్స కోసం, వారిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు, మానవతా దృక్పదంతో ఇరువురి ప్రాణాలు కాపాడిని ఇంకొల్లుఎస్ఐ సురేష్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## నారా లోకేష్ ఆదేశాల మేరకు వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన..

మంగళగిరి, అక్టోబర్ 29, ప్రభాతవార్త: మొంథా తుఫాన్ వల్ల కురిసిన అకాల వర్షాలు రైతులపై తీవ్ర ప్రభావం చూపాయి. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో పంట పొలాలు ముంపుకు గురై నష్టం వాటిల్లింది. రైతుల సమస్యలు తెలుసుకోవడం కోసం రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆదేశాల మేరకు మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ బుధవారం పెదవడ్లపూడి



గ్రామంలో పంటల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు..ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ,"వర్షాల వల్ల పలు ప్రాంతాల్లో వరి, అరటి , మినుము, క్యాలీఫ్లవర్ వంటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మనకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి రైతు పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేసి, వారికి సరైన నష్టపరిహారం అందేలా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం" అని హామీ ఇచ్చారు.అలాగే, స్థానిక వ్యవసాయ విభాగం అధికారులకు వెంటనే పంట నష్టం వివరాలను సేకరించాలని సూచించారు. వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి రైతుల పక్షాన నిలబడి సహాయం అందించేలా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్శనలో మంగళగిరి మండల వ్యవసాయ అధికారి శైలజారాణి, జిల్లా సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, యోమినేని సుధాకర్, జాలాది సందీప్, జవ్వాది హనుమంతరావు, కట్టా దుర్గారావు,వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## క్షణం తీరకలేకున్నా... మంగళగిరిపై ప్రత్యేక దృష్టి..

..ఎప్పటికప్పుడు అధికారయంత్రాంగానికి సూచనలు..
..పునరావాస కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చర్యలు..
... మంత్రి నారా లోకేష్ కార్యదక్షతకు నిదర్శనం..



మంగళగిరి, అక్టోబర్ 29, ప్రభాతవార్త: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ గత మూడు రోజులుగా మొంథా తుఫాన్ తీవ్రతపై సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సహచర మంత్రులతో కలిసి నిరంతర పర్యవేక్షణ చేశారు. క్షణం తీరిక లేకపోయినా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఓవైపు రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికార యంత్రాంగం చేపడుతున్న సహాయక చర్యలపై సమీక్షి స్తూనే, మరోవైపు మంగళగిరి నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలపై నగరపాలకసంస్థ, రెవెన్యూ, పోలీసు శాఖలకు తగు సూచనలు, సలహాలు అందించారు.

**గత పరిస్థితుల దృష్ట్యా....** మంగళగిరి నియోజకవర్గంలో గత పరిస్థితులను దృష్ట్యా మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల గుర్తింపు, పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనావేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఇంతకుముందే ఎంటీఎంసీ పరిధిలో "స్వచ్ఛ మంగళగిర్తి పేరిట డ్రైనేజీల్లో సిల్ట్ తొలగింపు చర్యలు పెద్దయెత్తున చేపట్టడం సత్ఫలితాలనిచ్చింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటుచేయించారు. నియోజకవర్గంలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను తరలించేందుకు 24పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. కొండప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు మొదలు వారికెటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు, తాగునీరు, ఆహారం, వైద్యసహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఎంటీఎంసీ అధికారులు గత రెండు రోజులుగా నగరపాలకసంస్థ పరిధిలో ప్రధాన అవుట్ ఫాల్ మేజర్ డ్రైన్ లలో పూడికతీత పనులు చేపట్టారు. ఎన్నారై వద్ద, కాజ టోల్ ప్లాజా వద్ద గత అనుభవాల దృష్ట్యా పూడికలు తీయంచడం, యర్రబాలెం టుబాకో కంపెనీ, రైస్ మిల్ రోడ్ లో కచ్చా డ్రైన్ ల ఏర్పాటు, సుందరయ్యనగర్ లో జంగిల్ క్లియరెన్స్, నవులూరు మారుతీనగర్, ఎంఎస్ఎస్ కాలనీ, మక్కెవారిపేట, ఎంవీఐ కార్యాలయం వద్ద నిల్వ ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్ తో మళ్లింపు, కచ్చా డ్రైన్ ల ఏర్పాటు, నిడమర్రు శివాలయం వద్ద కచ్చా డ్రైన్, ఇప్పటం రోడ్ వడ్డెరపాలెంలో పూడిక తీయించడంతోపాటు పలు చోట్ల కచ్చా డ్రైన్ లు ఏర్పాటు చేశారు. అలాగే, ఆత్మకూరు శ్రీశైల నగర్ లో నిల్వవున్న నీటిని ఆయిల్ ఇంజిన్ తో మళ్ళించారు. వడ్డేశ్వరం టవర్ రోడ్ తోపాటు పలు ప్రాంతాల్లో డ్రైనేజీల్లో పూడిక తీయించారు. కచ్చా డ్రైన్ లు ఏర్పాటుచేశారు. తాడేపల్లి ప్రభునగర్, తెల్ల క్వారీ ఏరియా, ట్యాంక్ రోడ్, చైతన్య తపోవన్ వద్ద, మహానాడు, గాంధీనగర్, ఎమ్మెల రామయ్య కాలనీ, శివదుర్గాపురం, బాపనయ్య పేట, డోలాస్ నగర్ వంటి పలు ప్రాంతాల్లో ఆయిల్ ఇంజన్ ల ఏర్పాటుచేశారు. నులకపేట చెరువు పొర్లకుండా కచ్చా డ్రైన్ చేపట్టారు. మంగళగిరి యాదవపాలెం, బ్యాంకు కాలనీ లలో నీరు నిల్వవుండకుండా ఆయిల్ ఇంజన్తో మళ్ళించారు. టిడ్కోలో మాన్ హోల్స్ క్లీనింగ్, రత్నాలచెరువులో పెద్దయెత్తున పూడిక తీతలు, కచ్చా డ్రైన్ లు సిద్ధం చేశారు. చినకాకాని దీన్ దయాళ్ నగర్ లో పూడిక తొలగింపు పనులు వెంటనే చేపట్టారు. మంగళగిరి నియోజకవర్గంలో తుఫాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి, సమస్యాత్మాక ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కలిగించి వారిని కేంద్రాలకు తరలించి అన్నివసతులు కల్పించారు.

## తుఫాను... తీరని ప్రజల తిప్పలు



రేపల్లె,అక్టోబరు 29, ప్రభాతవార్త: తుఫాన్ కారణంగా మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ ఈదురు గాలులు వీచాయి.భారీ వర్షం కురిసింది.వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది.వరి పైరు పడిపోయిన చోట రైతులు ఓదెలను కలిపి మరలా నిలబెట్టారు.రైతుల పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు.లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.గాలులకు కూలిన చెట్లను తొలగించారు.రేపల్లె ఆర్టీసీ గ్యారేజీలో భారీ రావిచెట్టు పడిపోయింది.ఆర్టీసీ గ్యారేజీ జలదిగ్బంధంలో చిక్కుకున్న కారణంగా బస్సుల రిపేర్లు నిలిచిపోయాయి. మెకానికల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.ఇసుకుపల్లి







బాలికల బిసి హాస్టల్, నిజాంపట్నం రోడ్, అంకమ్మ చెట్టు,రూరల్ ఏరియాల్లో చెట్లు కూలాయి.చంద్రమోళి ఉద్యానవనం జలమయమైంది. భట్టిప్రోలు ప్రభుత్వ వైద్యశాల వెనుక ఇళ్ళ చుట్టూ నీరు చేరింది.38 సంవత్సరాలుగా కనీసం సౌకర్యాలు కల్పించకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎన్.సుబ్బారావు ఆవేదన వ్యక్తంచేశారు.రహదారి, డ్రైనేజీ సమస్యలు వెంటాడుతున్నా ఎవరూ స్పందించటం లేదని,నీటిలోనే నడవాల్సి వస్తున్నదని సుబ్బారావు తెలిపారు.రేపల్లెలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచే ప్రారంభమైన విద్యుత్ సరఫరా నిలిపివేత బుధవారం సాయంత్రం 4 గంటల వరకు సాగింది.భట్టిప్రోలు మండలంలోని పల్లెకోన, కోనేటిపురం, సూరేపల్లి,రాచూరు,ఆళ్ళమూడి గ్రామాలలో బుధవారం రాత్రి 8 గంటలు దాటినా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోచుకోలేదు.విద్యుత్ లైన్లు తెగిపోవటం,ట్రాన్స్ ఫార్మర్లు మొరాయించటం వంటి సమస్యలు తలెత్తాయి.విద్యుత్ పునరుద్ధరణ విషయంలో ముందుగా పట్టణం,మండల కేంద్రాలపై దృష్టిపెట్టారు.గ్రామీణ ప్రాంతాల విషయంలో 30 గంటల సమయం దాటుతున్నా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు నోచుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

## నేడు అద్దేపల్లిలో శ్రీ సీతారామ కళ్యాణ వేదిక ప్రారంభం

రేపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి శ్రీరామ నామ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ కళ్యాణ వేదికను గురువారం రాత్రి 11.11 గంటలకు ప్రారంభిస్తున్నట్లు శ్రీరామ నామ స్మరణ ఆధ్యాత్మిక సంఘం అధ్యక్షుడు కె.భాస్కరరావు బుధవారం తెలిపారు. 31వ తేదీ ఉదయం శ్రీ మహాగణపతి పూజ, శ్రీమన్నారాయణ మహామంత్ర హోమం,సుదర్శన హోమం,శ్రీ సీతారామ విశేష హోమం,శ్రీ ఆంజనేయ మన్యుసూక్త హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, అష్టదిక్పాలక సహిత వాస్తు హోమం నిర్వహిస్తామని వివరించారు.అనంతరం శ్రీ సీతారామ అన్న ప్రసాద సంతర్పణ జరుగుతుందన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## గోమాత పూజలు



రేపల్లె, అక్టోబరు 29, ప్రభాతవార్త: నగరం ,రేపల్లె, భట్టిప్రోలు మండలాల్లోని రామాలయాల వద్ద బుధవారం విశ్వహిందూ పరిషత్ ధర్మ రక్షా ప్రచార విభాగ్ ఆధ్వర్యంలో మహిళలు గోమాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ జి.కుటుంబరావు,కమిటీ సభ్యులు సి హెచ్.కిషోర్ బాబు,సాయి,ధర్మ రక్షా ప్రచార మహిళా కార్యకర్తలు డి.మాధవి,జి.దుర్గా ప్రసన్న, కె.శివనాగేశ్వరి, మోర్లప్రియదుర్గ, వి.శ్రీలక్ష్మి, వి.నాగప్రియాంక, పి.పూర్ణకుమారి, పి.కృష్ణకుమారి,డొక్కు చంద్రమ్మ, డొక్కు రత్నకుమారి,ఘంటా సరస్వతి,భజన సమాజ సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## 16 మంది ప్రాణాలు కాపాడిన పర్చూరు పోలీస్ సిబ్బంది

బాపట్ల,అక్టోబర్29,ప్రభాతవార్త: బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది తుఫాను సహాయ చర్యలు నిర్వహిస్తున్నారు అనేక మందిని తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కాపాడుతున్నారు.దీనిలో బాగంగా బుదవారం పర్చూరు,



గ్రామంలో రెండు ఘటనల్లో 16 మంది ప్రాణాలను కాపాడి ప్రజల చేత మన్ననలు పొందారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్చూరు మండల కేంద్రంలో పర్చూరు వాగు అలియాస్ మొండి వాగు కు కట్టతెగి గండిపడగా సమీపంలో ఉన్న ప్రార్థన మందిరంలోని 15 మంది మునిగిపోతున్న నేపథ్యంలో సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న పర్చూరు పోలీస్ సిబ్బంది వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి వాళ్ల ప్రాణాలు కాపాడారన్నారు.అదే విధంగా పర్చూరు గ్రామంలోని మొండి వాగులో పర్చూరు గ్రామానికి చెందిన షేక్ మున్న సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడని అతను కనపడట్లేదు అనే సమాచారంతో అక్కడకు చేరుకున్న పర్చూరు ఎస్సై జీవి చౌదరి చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేక వెంటనే డ్రోన్ సహాయంతో వెతకగా వాగు మధ్యలో ఒక ముల్ల చెట్టుకు ఇరుక్కొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న షేక్ మున్నా ను గుర్తించి వెంటనే వారి సిబ్బంది మరియు ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో కాపాడి ఒడ్డుకి సురక్షితంగా చేర్చడం జరిగిందన్నారు.16 మంది ప్రాణాలు కాపాడి పోలీస్ ప్రతిష్టను మరింత పెంచిన పర్చూరు పోలీస్ ఎస్ఐ జీ.వి. చౌదరిని, వారి సిబ్బందిని, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## అధైర్యపడొద్దు..అండగా ఉంటాం: ఎమ్మెల్సీ ఆలపాటి రాజా

కొల్లిపర,అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాన్‌తో పంటలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి తప్పకుండా రైతాంగానికి న్యాయం చేస్తోందని చెబుతూ..ఏ ఒక్క రైతు కూడా అధైర్యపడొద్దని..అండగా ఉంటామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ రైతులకు భరోసా ఇచ్చారు.బుధవారం మండల



పరిధిలోని అత్తోట,తూములూరు గ్రామాల్లో పునరావాస కేంద్రాల్లో స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు.సౌకర్యాలు ఎలా ఉన్నాయని పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ తుఫాన్ వల్ల ఎటువంటి ప్రాణనష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవటంతో పాటు ఆపద రాకుండా



కాపాడిన వ్యక్తి చంద్రబాబునాయుడు అన్నారు.తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి తగిన వసతులు కల్పించామన్నారు.పెనుగాలులకు..వర్షానికి దెబ్బతిన్న పంటలను అధికారులు అంచనాలు తయారు చేస్తారన్నారు.అనంతరం కొల్లిపర,తూములూరు,.చివలూరు గ్రామాల పరిసర ప్రాంతాలలో పెనుగాలులకు పండిపోయిన పంటలను పరిశీలించారు.కార్యక్రమంలో తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్ధ,ఎంపీడీఓ విజయలక్ష్మి ,మండల టీడీపీ అద్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి,దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి,టీడీపీ నాయకులు చాగంటి నారాయణరెడ్డి,కంచర్ల అమృతరాజు,కొల్లి కోటిరెడ్డి,కొఠారు ఆంజనేయులు,దాసరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మరమ్మతులు చేస్తూ వ్యక్తికి గాయాలు

కొల్లిపర, అక్టోబరు 29 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని తూములూరులో విద్యుత్ మరమ్మత్తులు చేస్తూ దాసరి శ్రీనివాసరావు అనే వ్యక్తి షాక్‌కు గురైయ్యాడు. తుఫాన్ కారణంగా తెగిపడిన కరెంటు వైర్లు తెగిపడినట్లుగా ఈ ప్రమాదం జరిగినట్లు తోటి కూలీలు చెప్పారు. స్థంభంపై నుంచి క్రింద పడటంతో ఆయన కాలు విరిగినట్లు చేయి, మొకంపై కాలి గాయాలు అయినట్లు డాక్టర్ శ్రావణి తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# ఘనంగా 'మాస్ జాతర' ప్రి రిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జె.ఆర్.సి కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర బృందం ఘనంగా నిర్వహించింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ వేడుకకు తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ కథానాయకుడు సూర్య మాట్లాడుతూ.. 'అభిమానుల మధ్యలో జరిగే ఇలాంటి వేడుకకు హాజరవ్వడం నాకిష్టం. నన్ను ఆహ్వానించిన నాగవంశీ గారికి కృతజ్ఞతలు. రవితేజ గారితో నాది 20 ఏళ్ల అనుబంధం. చాలాఏళ్లుగా రవితేజ గారిపై అభిమానులు ఎంతో ప్రేమని కురిపిస్తున్నారు. తన సహజ నటనతో పాత్రకు ప్రాణం పోస్తారు. ఇడియట్, కిక్ సహా రవితేజ గారు నటించిన పలు సినిమాలు తమిళ్‌లోనూ మంచి ఆదరణ పొందాయి. రవితేజ గారు ఇలాగే వినోదాన్ని పంచుతూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అక్టోబర్ 31న మాస్ జాతర రూపంలో రవితేజ గారి జాతర చూడబోతున్నాం. నాగవంశీ గారు వరుస సినిమాలు చేస్తున్నారు. ఆయన బ్యానర్‌లో నేను ఒక సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. అక్టోబర్ 31 విడుదలవుతున్న మాస్ జాతర సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటూ, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. 'నాకిష్టమైన వ్యక్తుల్లో ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర గారు ఒకరు. ఆయన వేసిన సెట్స్ అద్భుతంగా ఉంటాయి. ఈ చిత్రంలో యాక్షన్ బాగుందంటే ఆ క్రెడిట్ మా ఫైట్ మాస్టర్స్ వెంకట్, పృథ్వీకి వెళ్తుంది. మా సంగీత దర్శకుడు భీమ్స్ ఇంకో చార్ట్ బస్టర్ ఇచ్చాడు. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా అద్భుతంగా ఇచ్చాడు. శివుడు పాత్ర చేసిన నవీన్ గురించి మాట్లాడాలి. నవీన్ ఇలా కూడా చేయగలడా అని ఆశ్చర్యపోయేలా చేశాడు. రాజేంద్రప్రసాద్ గారి పాత్ర అద్భుతంగా ఉంటుంది. నాది, శ్రీలీలది సూపర్ హిట్ జోడి. ఈ సినిమాలో కొత్త శ్రీలీలను చూడబోతున్నారు. ఈరోజు గెస్ట్ గా విచ్చేసిన సూర్య గారికి థాంక్యూ సో మచ్. భాను రూపంలో మన పరిశ్రమకి మరో మంచి దర్శకుడు వస్తున్నాడు. మాస్ మాత్రమే కాదు, అన్ని రకాల సినిమాలు చేయగలడు. రచయిత నందుకి మంచి భవిష్యత్తు ఉంది. మాస్ జాతర చిత్రం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'అన్నారు. కథానాయిక శ్రీలీల మాట్లాడుతూ.. 'పెళ్లి సందడి విడుదలకు ముందు రవితేజ గారితో ధమాకా సినిమా చేశాను. భాను గారు అద్భుతంగా సినిమాని తెరకెక్కించారు. నాకు, రవితేజ గారి మధ్య వచ్చే సన్నివేశాలు, అలాగే రాజేంద్ర ప్రసాద్ గారి సన్నివేశాలు చాలా బాగుంటాయి. నాకు ఈ అవకాశం ఇచ్చిన నాగవంశీ గారికి, సితార బ్యానర్‌కి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ సినిమా చూసి ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తారు" అన్నారు. నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. "అన్ని మసాలాలు సరిగ్గా ఉన్న మాస్ సినిమా ఈ మధ్య కాలంలో రాలేదు. ఆ లోటుని తీర్చే సినిమా ఈ మాస్ జాతర. ఇప్పటిదాకా ఎందరో హీరోలతో కలిసి నటించాను. కానీ, రవితేజతో నటించలేదు. 'మాస్ జాతర' లాంటి మంచి సినిమా చేయాలనే ఇంత సమయంపట్టినట్టుంది. దర్శకుడు భాను అద్భుతమైనసినిమాని రూపొం దించాడు. సినిమా ఎలా ఉంటుంది? నా పాత్ర ఎలా ఉంటుంది? అనేది ఇప్పుడు చెప్పను. మీరు ఖచ్చితంగా థియేటర్ లోచూసి ఆనందించాల్సి న చిత్రమిది. అద్భుతమైన మాస్ సినిమా ఇది. 'మాస్ జాతర' సినిమా చూసిన తర్వాత తెలుగు ప్రేక్షకులంతా మమ్మల్ని మెచ్చుకుంటారు." అన్నారు.

నటుడు నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "చాలారోజుల తర్వాత మాస్ జాతర రూపంలో శక్తివంతమైన పాత్ర లభించింది. రవితేజ గారు నా లాంటి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. శివుడు అనే అద్భుతమైన పాత్రను నాకు ఇచ్చిన దర్శకుడు భాను గారికి ధన్యవాదాలు. 'అరవింద సమేత'లో బాలరెడ్డి పాత్ర తర్వాత నా కెరీర్ లో గుర్తిండిపోయే పాత్ర ఇది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌కి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. అక్టోబర్ 31న విడుదలవుతున్న ఈ సినిమా అసలు నిరాశ పరచదు. ముఖ్యంగా రవితేజ గారి అభిమానులు ఈ సినిమాని బాగా ఎంజాయ్ చేస్తారు." అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. 'వెంకీ, విక్రమార్కుడు, కిక్ చిత్రాల్లాగా రవితేజ గారి సినిమా అంటే ఏమి ఆశించి థియేటర్‌కి వస్తారో.. అన్ని అంశాలు మాస్ జాతరలో ఉంటాయి.ఈ వేడుకకు విచ్చేసిన సూర్య గారికి ధన్యవాదాలు' అన్నారు.దర్శకుడు భాను భోగవరపు మాట్లాడుతూ.. "రవితేజ గారు దర్శకులను పరిచయం చేసే ఒక యూనివర్సిటీ నెలకొల్పారు. ఆ యూనివర్సిటీలో సీట్ ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు.నా దగ్గర ఉన్న ఒకే ఒక అర్హత నా కథ. ఆ కథ నచ్చి రవితేజ గారు నాకు అవకాశమిచ్చారు. ఇందులో తులసి అనే పాత్ర శ్రీలీల పోషించారు. భీమ్స్ గారు అద్భుతమైన సంగీతం అందించారు. నటీనటులు, సాంకేతిక బృందం ఇచ్చిన మద్దతుని ఎప్పటికీ మరిచిపోలేను. నా దృష్టిలో నాగవంశీ గారి కంటే గొప్ప క్రిటిక్ లేరు. ఆయనకు సినిమా నచ్చిందంటే అది హిట్టే. వంశీ గారు ఈ సినిమా చూసి చాలా బాగుంది అన్నారు. అక్టోబర్ 31 కోసం మీ అందరిలాగే నేను కూడా ఎంతగానో ఎదురుచూస్తున్నాను." అన్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ.. "ధమాకా తర్వాత చిరంజీవి గారి సినిమాకి పనిచేసే అవకాశాన్ని దక్కించుకున్నాను. ఈరోజు నేను ఇక్కడ ఇలా నిలబడి ఉన్నానంటే దానికి కారణం రవితేజ గారు. ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అన్నారు.

## హీరోయిన్‌గా 'జాన్వి ఘట్టమనేని' ఎంట్రీ



సూపర్‌స్టార్ కృష్ణ ఘట్టమనేని వారసత్వం తెలుగు సినీ పరిశ్రమలో విశిష్టమైనది. ఇప్పుడు ఘట్టమనేని లెగసీ నుంచి తొలిసారిగా హీరోయిన్‌గా వెలుగులోకి రానున్నది జాన్వి ఘట్టమనేని. ఆమె తన తాత కృష్ణగారి గ్రేస్, తన మామ మహేష్ బాబుగారి మాగ్నటిజం, తల్లి మంజుల ఘట్టమనేని గారి ఆత్మీయతను తనలో కలుపుకుని గొప్ప వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంది. జాన్వి ఘట్టమనేని క్లాసిక్ బ్యూటీ. ఇటీవల వెలుగుచూసిన ఆమె ఫొటోలు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇండస్ట్రీ వర్గాలు ఆమెను 'ఇటీవలి తెరపై కనిపించే అత్యంత అందమైన అమ్మాయి'గా అభివర్ణిస్తున్నాయి. దర్శకులు ఆమె నటనను చూసి 'మాటలకన్నా కళ్ళతోనే భావాలను చెప్పగల సహజ నటిగా' వర్ణించారు. ఆమె ప్రతిభతో పాటు క్రమశిక్షణ కూడా ప్రత్యేకం. పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్, గేమింగ్ ప్రతి విషయంలోనూ సమాన ఆసక్తి చూపిస్తుంది. జిమ్‌లో ట్రైనింగ్ తో మొదలై తన డే, నైట్ తన ఆర్ట్ కార్నర్‌లో ముగుస్తుంది. కొత్తగా సినీ రంగంలోకి వచ్చే వాళ్లు సాధారణంగా ఒకే గుణంతో గుర్తింపుపొందుతారు. కానీ జాన్వి ఘట్టమనేని మాత్రం అందం, మాధుర్యం, ప్రతిభ, వారసత్వం.. ఈ నాలుగింటినీ కలగలిపిన ప్రత్యేక వ్యక్తిత్వం. బ్రాండ్ నిపుణులు ఆమెను 'దక్షిణాది శైలి, పాన్‌ఇండియా అప్పీల్ కలిగిన ఫేస్' అని పేర్కొంటున్నారు. సూపర్ స్టార్ కృష్ణగారు, మహేష్ బాబు కుటుంబం నుండి వస్తున్న జాన్వి ఎంట్రీ ఒక విధంగా విధి నెరవేరుతున్న క్షణం. జాన్వి సంప్రదాయలుక్ నుంచి మోడరన్ గ్లామర్ వరకు సునాయాసంగా మెరిసిపోతుంది. ఇంకా సినిమా రిలీజ్ కాకముందే ఆమెకు గుర్తింపు వచ్చేసింది. ఒక అద్భుతమైన జ్యువెలరీ క్యాంపెయిన్ తర్వాత, జాతీయ స్థాయి బ్రాండ్లు, దర్శకులు ఆమెను సంప్రదించారు. నిర్మాతలు ఆమెను 'దశాబ్దంలో ఒక్కసారి దొరికే ఆర్టిస్ట్, మాట్లాడకముందే స్క్రీన్‌ను ఆక్రమించే ప్రెజెన్స్' అని చెబుతున్నారు. యాక్టింగ్ ట్రైనింగ్స్, డాన్స్ రిహార్సల్స్, ఫిట్‌నెస్ సెషన్‌లతో ఆమె షెడ్యూల్ ఇప్పటికే ఒక స్టార్ లా వుంటుంది. సినిమా కుటుంబంలో పుట్టినా, ఆమె నటనపైఉన్న ప్రేమ మాత్రం వారసత్వం కాదు ..సహజ స్వభావం. పదేళ్ల వయసులోనే తల్లి మంజుల ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది' సినిమాలో కెమెరా ముందు కొచ్చిన జాన్వి తన సహజమైన నటనతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె నటించదు, ఫీల్ అవుతుంది. మంజులకి ఇది ప్రత్యేకమైన క్షణం. ఎన్నేళ్ల క్రితం ఆమెకూ నటనపై కలలు ఉండేవి, కానీ ఆ కాలం మహిళలకు అంత అనుకూలంగా ఉండేది కాదు. ఇప్పుడు మాత్రం ప్రపంచం సిద్ధంగా ఉంది, ప్రేమతోఉంది, ఎదురుచూస్తోంది. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వి కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వి చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం'అన్నారు మంజుల.



## 'చైనా పీస్' నుంచి సాంగ్ రిలీజ్

నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. యూనిక్ కాన్సెప్ట్, ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఇదేంటో జేమ్స్ బాండ్ సాంగ్ రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ ఈ సాంగ్‌ని ఎనర్జిటిక్‌గా కంపోజ్ చేశారు. స్ఫూర్తి జితేందర్, హారిక నారాయణ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. దినేష్ కాకర్ల లిరిక్స్ కాన్సెప్ట్‌ని చాలా ఫన్ ఫుల్ గా ప్రజెంట్ చేశాయి. ఈ చిత్రానికి సురేష్ రగుతు కెమరామ్యాన్. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## 'రాజు వెడ్స్ రాంబాయి' తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది: నిర్మాత వేణు ఊడుగుల

అఖిల్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీవాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ చిత్ర రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమా చూశాను. ఇది నా మనసుకు హత్తుకుంది. కొందరి లైఫ్‌లో జరిగిన ఘటనల ఆధారంగా ఈ సినిమా చేశారు. ఇది కాల్పనిక కథ అయితే మనం ఆ దర్శకుడి ఊహకు ఆశ్చర్యపోయేవాళ్లం. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులు ఒక ఎమోషనల్ ఫీల్ తో వస్తారు. అఖిల్ రాజు పాత్రలో బాగా నటించాడు. తేజస్విని తెలుగు అమ్మాయి. ఈ సినిమాలో తన స్క్రీన్ ప్రెజెన్స్, పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంది. హీరో సిద్ధు జొన్నలగడ్డ బ్రదర్ చైతన్య ఒక మంచి రోల్ చేశాడు. వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నారు అన్నారు. నటుడు చైతు జొన్నలగడ్డ మాట్లాడుతూ ఇది పక్కా తెలంగాణ సినిమా. తెలంగాణ నేటివిటీని, ఇక్కడి ప్రజల జీవితాలను ఈ చిత్రంలో చూస్తాం. తెలంగాణ నేటివిటీని ఇంత పర్ఫెక్ట్ గా చూపించిన సినిమా మరొకటి లేదు. ఈ చిత్రంలో ఒక ఇంపార్టెంట్ రోల్ చేయడం హ్యాపీగా ఉంది. అన్నారు. డైరెక్టర్ సాయిలు కంపాటి మాట్లాడుతూ '2016 నుంచి ఈ కథ పట్టుకుని తిరుగుతూ ఉన్నాను. ఒకే ఒక నెరేషన్‌లో వేణు ఊడుగులగారు మనం సినిమా చేస్తున్నాంరా తమ్ముడు అన్నారు. ఈటీవీ విన్ వారిని అప్రోచ్ అయితే వాళ్లకూ కథ నచ్చింది. సాయికృష్ణ, నితిన్ నాకు బ్రదర్స్‌లా సపోర్ట్‌చేశారు. సురేష్ బొబ్బిలి అన్న మ్యూజిక్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది'అన్నారు. ప్రొడ్యూసర్ వేణు ఊడుగుల మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్ మధ్య జరిగిన ఓ రియల్ ఇన్సిడెంట్ ఆధారంగా ఈ చిత్ర కథను దర్శకుడు సాయిలు రాసుకున్నాడు. ప్రేమతో కూడిన విషాధభరితమైన ఈ సంఘటన ఆ ఊర్లోనే జరిగి అక్కడే సమాధి అయ్యింది. దాన్ని బేస్ చేసుకుని సాయిలు ఒక మంచి స్క్రిప్ట్ రాశాడు. ఈటీవీ విన్ వారి వల్లే నేను ప్రొడ్యూసర్ ను అయ్యాను. నవంబర్ 21న రాజు వెడ్స్ రాంబాయి రిలీజ్ అవుతుంది. నా డైరెక్షన్‌లో యూవీ క్రియేషన్స్‌లో ఓసినిమా చేయబోతున్నాను' అన్నారు. హీరోయిన్ తేజస్వినీ మాట్లాడుతూ రాజు వెడ్స్ రాంబాయి సినిమాలో రాంబాయి క్యారెక్టర్‌తో మీ ముందుకు రాబోతున్నాను. ఈ సినిమా, ఈ క్యారెక్టర్ నా మనసుకు ఎంతో దగ్గరయ్యాయి. సినిమా చూస్తున్నంత సేపు మీరు ఒక ఎమోషన్ కు గురవుతారు.తెలుగు ఆడియెన్స్ కు మా మూవీ బాగా నచ్చుతుంది'అన్నారు. హీరో అఖిల్ మాట్లాడుతూ 'నన్ను హీరోగా పరిచయం చేస్తున్న వేణు గారికి, ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్'అన్నారు. ఈటీవీ విన్ నితిన్ మాట్లాడుతూ 'మన ప్రాంతంలో జరిగిన ఒక నిజమైన ఘటన నేపథ్యంగా ఈ సినిమా ఉంటుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా రిలీజ్ అయ్యాక తెలుగు ఆడియెన్స్ అంతా ఒకసారి మా మూవీ గురించి మాట్లాడుకుంటారు' అన్నారు. ఈటీవీ విన్ సాయికృష్ణ మాట్లాడుతూ 'ఈ సినిమా గ్రేటెస్ట్ లవ్ స్టోరీ అని మేము అంటున్నాం. చిన్న సినిమా పెద్ద సినిమా అని చూడకుండా మంచి సినిమాలను రిలీజ్ చేస్తున్న వంశీ నందిపాటి, బన్నీ వాస్ గారికి థ్యాంక్స్' అన్నారు. నిర్మాత వంశీ నందిపాటి మాట్లాడుతూ లిటిల్ హార్ట్స్ మూవీ చేసిన వెంటనే మేము రిలీజ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇది. ఈ సినిమా రిలీజ్ తర్వాత ఇందులోని చాలా మందిని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ గుర్తుపెట్టుకుంటుంది' అన్నారు.



## 'ఆర్యన్' తెలుగులో నవంబర్ 7న రిలీజ్



విష్ణు విశాల్ మోస్ట్ ఎవైటెడ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్', ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అక్టోబర్ 31న విడుదల చేయాలని ముందుగా అనుకున్న ఈ సినిమా నవంబర్ 7కి వాయిదా పడింది. అయితే, తమిళ వెర్షన్ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 31న విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ సినిమాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విడుదలచేయనున్నారు. టీజర్, ట్రైలర్, ఫస్ట్ సింగిల్ అద్భుతమైన స్పందనను పొంది సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. వాయిదాకు గల కారణాలను స్పష్టం చేస్తూ విష్ణు విశాల్ ఒక అనౌన్స్‌మెంట్ విడుదల చేశారు. సినిమా అనేది రేస్ కాదు, అది ఒక వేడుకని నేను ఎప్పుడూ నమ్ముతాను. ప్రతి వేడుకకీ తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం, వెలుగు ఉండాలి. మా చిత్రం 'ఆర్యన్' అక్టోబర్ 31న విడుదల కావలసి ఉంది. ఈ ప్రత్యేక తేదీ మాస్ మహారాజా రవితేజ గారి 'మాస్ జాతర', పవర్ ఫుల్ 'బాహుబలి ది ఎపిక్' మీ అందరినీ అలరించడానికి రావడంతో మరింత ప్రత్యేకమైనది. నేను ఎప్పటినుంచో రవితేజ గారిని గాఢంగా ఆరాధిస్తాను. స్క్రీన్‌పైన ఆయన ఎనర్జీకి మాత్రమే కాకుండా, మాకు ఆయన మద్దతు కూడా వుంది. అలాగే, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి గారికి నేను లైఫ్ టైం ఫ్యాన్‌ని. ఈ వారం వారి సినిమాలని సెలబ్రేట్ చేసుకోవడం సరైనదని భావిస్తున్నాను. 'ఆర్యన్' సినిమా తమిళ్ విడుదలైన ఒక వారం తర్వాత అదే పాషన్, థ్రిల్‌తో నవంబర్ 7న తెలుగులోకి వస్తుంది. మీ మద్దతుకు నేను హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.నా నిర్ణయానికి అండగానిలిచిన మా డిస్ట్రిబ్యూటర్లు శ్రీ సుధాకర్ రెడ్డి గారు, మహేశ్వర్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. నా సినిమా తనకంటూ ఒక మంచిస్థానం సంపాదించుకోవాలని నేను కోరుకుంటున్నాను. తెలుగు ప్రేక్షకుల కోసం విభిన్నమైన సినిమాలు అందించాలనే నా ప్రయత్నంలో ఇది ఒక మంచి ప్రారంభం అవుతుందని నేను నమ్ముతున్నాను అన్నారు.

## మాస్ అంశాలతో కూడిన చిత్రం 'మాస్ జాతర'

### - చిత్ర దర్శకుడు భాను భోగవరపు

మాస్ మహారాజా రవితేజ 75వ చిత్రం 'మాస్ జాతర'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార=ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. తెలుగులో ఎన్నో విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన భాను భోగవరపు ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రవితేజ, శ్రీలీల, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అక్టోబరు 31వ తేదీ సాయంత్రం ప్రత్యేక ప్రదర్శనలతో థియేటర్లలో అడుగుపెట్టనున్న 'మాస్ జాతర' చిత్రం కోసం మాస్ మహారాజా అభిమానులతో పాటు తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా మీడియాతో ముచ్చటించిన దర్శకుడు భానుభోగవరపు, సినిమాకి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



**మాస్ జాతర ఎలా ఉండబోతుంది? ఏమైనా ప్రత్యేకతలు ఉన్నాయా?** ఇందులో మాస్ అంశాలు ఉంటాయి. అదే సమయంలో ఒక కొత్త పాయింట్ కూడా ఉంటుంది. రైల్వే పోలీస్ నేపథ్యంలో ఈ కథ జరుగుతుంది. ఆ నేపథ్యంలో జరిగే క్రైమ్ కొత్తగా ఉంటుంది. సన్నివేశాలు కూడా కొత్తగా ఉంటాయి. 'మాస్ జాతర' అనే టైటిల్ రవితేజ గారే చెప్పారు. కథ విన్న తర్వాత వినోదంతో పాటు అన్ని అంశాలు బాగున్నాయి అంటూ ఆయన ఈ టైటిల్ సూచించారు. ఆ టైటిల్ తర్వాత నాపై బాధ్యత మరింత పెరిగింది. మాస్ అంశాలు మరిన్ని జోడించాను. థియేటర్ లో ప్రేక్షకులు కొన్ని సర్ ప్రైజ్ లు చూడబోతున్నారు. **ఏదైనా ప్రేరణతో ఈ రైల్వే పోలీస్ కథను రాసుకున్నారా?** ఇది కల్పిత కథే. అయితే ఈ కథ కోసం ఎంతో రీసెర్చ్ చేశాను. పలువురు రైల్వే పోలీస్ అధికారులను కలిసి వారి అధికారాల గురించి, వారు ఎదుర్కొన్న సంఘటల గురించి తెలుసుకున్నాను. వాటి స్ఫూర్తితో ఈ కథకుతగ్గట్టుగా కొన్ని సన్నివేశాలు రాసుకోవడం జరిగింది. **రవితేజ గారి 75వ చిత్రానికి దర్శకత్వం వహించడం ఎలా అనిపించింది?** ఇది రవితేజ గారి 75వ చిత్రమని మాకు ముందు తెలియదు. రవితేజ గారికి కథ నచ్చి, సినిమా ఓకే అయిన తర్వాత.. అప్పుడు లెక్కేస్తే 75వ సినిమా అని తెలిసింది. కథ బాగుంది, ఈ నెంబర్ల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా సినిమా చేయమని రవితేజగారు నన్ను ఎంతో ప్రోత్సహించారు. **నవీన్ చంద్ర గారి పాత్ర గురించి?** శివుడు అనే శక్తివంతమైన ప్రతినాయక పాత్ర పోషించారు. ఈ పాత్ర కోసం మొదట వేరే ఇద్దరు ముగ్గురు నటుల పేర్లు కూడా పరిశీలించాము. కానీ, సంతృప్తి లేదు. అలాంటి సమయంలో నవీన్ చంద్ర గారిని కలిసి కథ వినిపించాను. ఆయనకు కథ నచ్చి సినిమా చేయడానికి అంగీకరించారు. శివుడు పాత్రకు నవీన్ చంద్ర గారు పూర్తి న్యాయం చేశారు. సినిమా విడుదలైన తర్వాత శివుడు పాత్ర గురించి అందరూ ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. **శ్రీలీల పాత్ర గురించి ఏం చెబుతారు?** ఇందులో తులసి పాత్ర కోసం వేరే ఏ హీరోయిన్ పేరు మేము అనుకోలేదు. కథ రాస్తున్నప్పుడు నేను, కథ వింటున్నప్పుడు హీరో గారు, నిర్మాతలు మాకు తెలియకుండానే.. హీరోయిన్ శ్రీలీల గారు అని అనుకున్నాం. ధమాకా జోడి కాబట్టి శ్రీలీల గారిని తీసుకోవాలనే ఆలోచనమాకులేదు. ఆమెపాత్రకు సినిమాలో ఎంతో ప్రాధాన్యముంది. గ్యాంగ్ లీడర్‌లో చిరంజీవి గారువిజయశాంతి గారి మధ్య సన్నివేశాలు ఎలాగైతే కామెడీ టచ్ తో మాసీగా ఉంటాయో.. ఇందులో రవితేజ గారుశ్రీలీల గారి మధ్య సన్నివేశాలు అలా ఉంటాయి. **రచయితగా కామెడీలో మంచి ముద్ర వేసిన మీరు, దర్శకుడిగా మాస్ సినిమాతో పరిచయమవ్వడానికి కారణం?** మాస్ జాతరలో కూడా వినోదానికి పెద్ద పీట వేశాము. అదేవిధంగా మాస్ అంశాలు కూడా పుష్కలంగా ఉంటాయి. నిజానికి 'సామజవరగమన' లాంటి రొమాంటిక్ కామెడీ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవ్వాలనుకున్నాను. అయితే ఎక్కువమంది మంచి మాస్ కథ ఉంటే చెప్పు అనేవారు. అలా 'మాస్ జాతర' కథ రాయడం జరిగింది. మాస్ కథ అంటే మొదట గుర్తుకొచ్చే పేరు రవితేజ గారు. ఆయనను దృష్టిలో పెట్టుకునే ఈ కథ రాశాను. రవితేజ గారు పోలీస్ సినిమాలు కొన్ని చేశారు. అందుకే కొత్తగా ఉండేలా ఈ రైల్వే పోలీస్ కథని రాసుకున్నాను. **భీమ్స్ గారి సంగీతం గురించి?** భీమ్స్ గారి పేరుని రవితేజ గారు సూచించారు. వారి కాంబినేషన్‌లో ధమాకా లాంటి చార్ట్ బస్టర్ వచ్చింది. అందుకే నేను కూడా భీమ్స్ గారు సంగీత దర్శకుడు అయితే బాగుంటుంది అనుకున్నాను. 'తు మేరా లవర్' అంటూ ఆయన స్వరపరిచిన మొదటి గీతమే నాకు ఎంతగానో నచ్చింది. **నిర్మాత నాగవంశీ గారి గురించి?** దర్శకుడిగా నాకిది మొదటి సినిమా అయినప్పటికీ నాగవంశీ గారు ఎంతో మద్దతుగా నిలిచారు. నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఖర్చుకి ఎక్కడా వెనకాడకుండా ఆరున్నర కోట్లతో స్టేషన్ సెట్ వేయించారు. ఓ కొత్త దర్శకుడికి ఎక్కడ రాజీపడకుండా ఇంతటి సహకారం అందించడం మామూలు విషయం కాదు.

## 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' అన్ని జోన్లతో కలిపిన హాలీవుడ్ చిత్రం!



హాలీవుడ్ యాక్షన్ ప్రపంచాన్ని షేక్ చేయడానికి 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' సిద్ధమైంది. దర్శకుడు డాన్ ట్రాచెన్‌బర్గ్ నుంచి వస్తున్న ఈ సినిమా అంచనాలకు మించి ఉందని ఫస్ట్ స్క్రీనింగ్ రిపోర్ట్స్ తెలియజేస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చిత్రం ఒక సూపర్ హార్ట్ టచింగ్ ఎంటర్టైనింగ్, యాక్షన్ అడ్వెంచర్ అని రిపోర్టులు చెబుతున్నాయి.'బ్యాడ్‌లాండ్స్' కేవలం రక్తపాతం, వేట గురించి మాత్రమే కాకుండా యాక్షన్, సైఫై, మానవ సంబంధాలతో కూడిన ఒక మాస్టర్‌పీస్ అని క్రిటిక్స్ కొనియాడుతున్నారు. ఇది ఫన్, ఎమోషన్ నిండిన గెలాక్సీ రోడ్ మూవీ అని రివ్యూలు దూసుకుపోతున్నాయి. ట్రాచెన్‌బర్గ్ ఈసారి ప్రెడేటర్ యూనివర్స్‌ను మునుపెన్నడూ లేని విధంగా విస్తరించారు. కేవలం సర్వైవల్ గేమ్‌కు పరిమితం కాకుండా, ప్రెడేటర్ హంట్ వెనుక ఉన్న లెజెండ్, యాట్జుజా కల్చర్, వారి కోడ్ ఆఫ్ హానర్ లాంటి లోతైన కథాంశాలను డీల్ చేయడం ఫ్యాన్స్‌కు కొత్త అనుభూతిని ఇస్తోంది. ఈ విస్తృత కథనం సిరీస్‌కు కొత్త జీవితాన్ని ఇచ్చింది. ఇక డిమిట్రియస్ షస్టర్‌కొలోమాటాంగీ ఎల్లేఫ్యానింగ్ జోడీ తెరపై అద్భుతమైన కెమిస్ట్రీని పండించనుంది. ఏలియన్ హంట్ ఉద్రిక్తత మధ్యలో కూడా వారి మధ్య కనిపించే మానవత్వం, ఫ్రెండ్‌షిప్, హ్యూమర్ సినిమాకు సరికొత్త ఫీల్‌ను తెచ్చి, ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా చేస్తుందని రివ్యూల్లో హైలైట్ అవుతోంది. ఈ అసాధారణమైన బజ్ మధ్య 'ప్రెడేటర్: బ్యాడ్‌లాండ్స్' భారతీయ అభిమానుల కోసం నవంబర్ 7న థియేటర్స్‌లోకి అడుగుపెట్టబోతోంది. ఈసినిమా ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం భాషల్లో విడుదలవుతుంది. డాన్ ట్రాచెన్‌బర్గ్ సృష్టించిన ఈ 'ఎమోషనల్ అడ్వెంచర్ హంట్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తుందో చూడాలంటే నవంబర్ 7 వరకు వేచి చూడాల్సిందే.

## అందాలతో ఆకట్టుకుంటున్న మృణాల్!

సౌత్ నుంచి నార్త్ వరకు చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియాను వేదికగా చేసుకొని.. పలు రకాల ఫోటోలు షేర్ చేస్తూ.. ఫాలోవర్స్‌లో పెంచుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గ్లామర్ ఫోటోలుమాత్రమే కాకుండా సినిమాలకు సంబంధించి, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు అంశాలను షేర్ చేస్తూ నిత్యం అభిమానులకు టచ్ లో ఉంటున్నారు. ఇకపోతే అలా కొన్ని విషయాలను అభిమానులతో పంచుకుంటూ ఇటు గ్లామర్‌తో ఆకట్టుకుంటున్న హీరోయిన్స్‌లో మృణాల్ ఠాకూర్ కూడా ఒకరు. ఈమధ్య సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్న ఈమె.. తాజాగా చీర కట్టులో కనిపించి సాంప్రదాయంగా అభిమానులను అలరించింది. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా పలు రకాల లవ్, ఫైర్ ఎమోజీలను షేర్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈమె ప్రస్తుత సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం అడవి శేషు హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాలో హీరోయిన్గా అవకాశాన్ని దక్కించుకుంది.. నిజానికి ఈ పాత్రలో శృతిహాసన్ ఎంపికైంది. కొంత భాగం షూటింగ్ కూడా కంప్లీట్ చేశారు. కానీ శృతిహాసన్‌కి చిత్ర బృందంతో విభేదాలు ఏర్పడ్డాయని.. అందుకే ఆమె తప్పుకోవడంతో ఆమె స్థానంలో మృణాల్‌ను తీసుకున్నారు అంటూ వార్తలు వచ్చాయి. అయితే ఈ విషయంపై అడవి శేషు స్పందిస్తూ.. శృతిహాసన్ బిజీ షెడ్యూల్ వల్ల ఈ సినిమాకు ఎక్కువ రోజులు కేటాయించలేకపోతు ఇబ్బంది పడుతున్నారు అందుకే ఆమె తప్పుకోవడం తోనే మృణాల్‌ను తీసుకున్నామని ఆయన క్లారిటీ కూడా ఇచ్చారు.



30-10P g9exHMNWJQE 9 VO_30-10P g9exHMNWJQE.qxd 30/Oct/25 12:37 AM Page 1



# కార్టూన్లు ద్వారా తెలుగు వికాసం

అమరావతి, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి: సమకాలీన సామాజిక వ్యవస్థ సారమంతా ఒక కార్టున్ ద్వారా చెప్పే వచ్చు. హస్యం, వ్యంగ్యం, నిగ్గదీయడం అన్నింటి ఒక్క సారే కార్టున్ ద్వారా వెల్లడించవచ్చు. అటువంటి కార్టూన్లు ద్వారా తెలుగు భాషా వికాసాన్ని వృద్ధి చేయాలనే కీలక సంకల్పంతో ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో కార్టూన్లు పోటీలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ, అమరావతి, గుంటూరు హైవేలో 2026 జనవరి 3, 4, 5 తేదీలలో నిర్వహించబడనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన "కార్టూన్లు ద్వారా తెలుగు వికాసం" పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. శ్రీరామ్‌శేషు (నెల్లూరు), సునీల్(అమలాపురం), శ్రీసరస (హైదారాబాద్) ప్రథమ. ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. బొమ్మన్(విజయవాడ). పర్శి నాయుడు (మన్యం జిల్లా). కోరాడ రాంబాబుకు ప్రోత్సా హక బహుతులు లభించాయి. వీరందరికి సభలో వాటిని అందజేస్తారు. ఈ పోటీలు తెలుగు భాషా, సంస్కృతి, భావప్రకటనల అభివృద్ధికి కార్టూన్ కళాకారులు అందిస్తున్న సేవలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నంగా ఉన్నాయని డా. గజల్ శ్రీనివాస్ అన్నారు.



# గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

కాణిపాకం, అక్టోబరు 29 ప్రభాతవార్త: కాణిపాకంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసం కాగా మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలావున్నాయి. కాణిపాకం ఎస్సీ వాడకు చెందిన చిన పాపమ్మ అనే మహిళ బుధవారం ఉదయం వంటగదిలో టీ తయారు చేసుకోవడానికి వెళ్లి స్టవ్ వెలిగించింది. దీనితో ఉన్నట్టుండి మంటలు చెలరేగి సిలిండర్ పేలడంతో ఆమెకు నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. సిలండర్ పేలుడు దాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన చిన్న పాపమ్మను 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రాణిపేట సిఎంసి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని కాణిపాకం ఎస్ఐ నరసింహులు తమ సిబ్బందితో కలసి సందర్శించి సిలెండర్ పేలుడుకు సంబంధించి కారణాలను పరిశీలించారు.



లోకోషెడ్ సీనియర్ డిఇగా నియమితులైన సి.వీరయ్య

# రైల్వే విద్యుత్ అధికారులకు స్థానచలనం

గుంతకల్లు రైల్వే, అక్టోబరు 29 ప్రభాతవార్త; దక్షి ణ మధ్య రైల్వే గుంతకల్లులో పనిచేస్తున్న విద్యుత్ విభాగం అధికారులకు స్థానచలనం కల్పిస్తూ సంబంధిత ఉన్నత అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం గుంతకల్లు సీనియర్ డిఇ టిఆర్ఎస్ఓగా పనిచేస్తున సి వీరయ్యను స్థానిక విద్యుత్ లోకోషెడ్‌కు సీనియర్ డిఇ టిఆర్ఎస్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంతకల్లు విద్యుత్ లోకోషెడ్ టీఆర్ఎస్ డిఇగా పనిచేస్తున ఆర్ నాగేశ్వరరావును గుంతకల్లు డివిజనల్ టిఆర్ఎస్ఓ డిఇగా నియమించారు.

## తమిళనాడులో భారీ జాబ్‌స్కామ్

### దర్యాప్తుచేయాలని చెన్నై పోలీసులకు ఇడి లేఖలు

చెన్నై అక్టోబరు 29: తమిళనాడు భారీ జాబ్ స్కామ్ బయటపడింది. రూ.35 లక్షలు లంచం చొప్పున తీసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు అమ్మేస్తున్న వైనం తాజాగా వెలుగుచూసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ భారీ కుంభకోణం బట్టబయలు అయ్యింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల కోసం రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు వరకు ముడుపులు తీసుకుంటున్నారు. ఓ మనీలాం డరింగ్ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన సోదాల్లో ఈ జాబ్ స్కామ్ బయటపడింది. తమిళనాడు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగానికి సంబంధించి 2024లో రిక్రూట్‌మెంట్ చేపట్టారు. ఇందులో అసిస్టెంట్ ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితర పోస్టులు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టులో తమిళనాడు ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ స్వయంగా వీరికి నియామక పత్రాలు అందజేశారు. దాదాపు 150 మంది అభ్య ర్థులకు అనుకూలంగా పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని తెలి పింది. ఇందు కోసం ఆయా అభ్యర్థుల నుంచి ఏకంగా రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షలు చొప్పున లంచాలు తీసుకున్నట్లు గుర్తించామని చెప్పింది. దీనిపై దర్యాప్తు చేయాలని కోరుతూ తమిళనాడు పోలీస్‌లకు ఈడీ లేఖ రాసింది.





# నష్టపోయిన ప్రతి ఎకరాకు సాయం

## ధాన్యం కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు/ పెదపాడు, అక్టోబరు 29 ప్రభాతవార్త: ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నేలకొరిగిన వరిచేలను రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి మరియు ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు లు కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేశారు. 1318 వరి రకం వేశామని ఒక ఏకరాకు 42 నుండి 44 బస్తాలు దిగుబడి వస్తాయని, గడ్డి కూడా ఎక్కువ వస్తుందని, పశువులకు పనిచేస్తుందని ఆశించామని తెలిపారు. విపత్తులను తట్టుకునే శక్తి 1318 రకానికి ఉందని అయితే రాత్రి కురిసిన భారీ వర్షాలు, భారీ ఈదురు గాలితో వరి పంటలు నేలకొరిగాయని రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఎకరాను పారదర్శంగా నష్టం అంచనాలు వేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని రైతులకు భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, కూటమి ప్రభుత్వం రైతులు ప్రభుత్వం అని మీకు అండగా ఉంటామన్నారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతులు ఖాతాలో నగదు జమ చేస్తామని, ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి పంటలకు గిట్టుబాటు ధర అందించటమే మా ప్రధమ కర్తవ్యం అన్నారు. నేలకొరిగిన వరిపంటను దుబ్బులుగా కట్టుకుని వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన మందులను డ్రోన్లు ద్వారా స్ప్రే చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు సలహాలు, సూచనలు పాటించి పంటలను చేతికి వచ్చేలా చూసుకోవాలని రైతులకు సూచించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 1318 వరి రకం ఎటువంటి విపత్తులను తట్టుకునే శక్తి ఉందని ఇక్కడ ఎక్కువ మంది రైతులు 1318 వరి రకం వేసుకున్నారని తెలిపారు. తుపాన్ ప్రభావంతో అధిక వర్షాలు, అధిక గాలులు వీచుటవలన రాత్రికి నేలకొరిగాయని తెలిపారు. ఈ ప్రాంత రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ బాషా, ఎడిఇ ఇ.అనిత కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ ఖాసీమ్, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# నచ్చనేరిలో గిరిజనులతో మమేకమై...

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపానుతో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నష్టపోయిన బాధితులను పరామర్శించుకుంటూ, ప్రభుత్వం ప్రకటించిన సహాయాన్ని అందిస్తూ, భారీ వర్షాలతో మత్యువు పాలైన వారి కుటుంబాలను పరామర్శించుకుంటూ బుధవారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యటించారు. ఏర్పేడు మండలంలోని నచ్చనేరి గిరిజన కాలనీలో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇక్కడ సుమారు 60కుటుంబాలు నివాసముండగా 25 గుడిసెలు నేలకొరిగాయి. మంగళవారం ఉదయం సమాచారం అందటంతో మహిళా అధికారులైన సకాలంలో స్పందించారు. తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ డాక్టర్ సౌభాగ్యం కాలనీకి చేరుకొని పరిస్థితులను సమీక్షించారు. వెంటనే గుడిసెలు కూలిన వారిని 'పునరావస కేంద్రానికి' చేర్చారు. వారికి భోజన సదుపాయాలు కల్పించారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికార, రాజకీయనాయకులతో నచ్చనేరి చేరుకున్నారు. అక్కడ గిరిజనుల సమస్యలను సావధానంగా విన్నారు. ఓ సాదాసీదా వ్యక్తిగా వారితో కలసి నేలపై కూర్చున్నారు. గిరిజనుల గోడును విన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి పక్కాగృహాలు నిర్మాణం చేపడతామన్నారు. మీకు ఆదుకోవటానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్దంగా ఉందన్నారు. అలాగే మీకు సహాయ సహకారాలు అందించుటకు ఎల్లవేళల్లో నేనున్నానని వివరించారు. నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం ప్రకటించిన 25కిలోల బస్తా బియ్యంతో పాటు నిత్యావసర సరకులను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అందించారు. ఎంఎల్‌ఏతో పాటు తహశీల్దార్ భార్గవి మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు పొన్నారావు తదితరులున్నారు.

# కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు

గుంతకల్లు, అక్టోబరు 29 ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో రాజగోపురముల శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శిఖర కలశాలకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి పాల్గొన్నారు. ఉదయం వేదపండితులు శ్రీసీతారామ లక్ష్మణ సహిత నెట్టికంటి ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల ఆరాధన, పరిషత్ విజ్ఞాపన, రక్షాబంధనం, మృత్సంగ్రహణ, యాగశాల ప్రవేశం, గోపూజ, అగ్ని ప్రతిష్ఠ, రామాయణ, చతుర్వేద పారాయణములు, 18 కలశములకు పంచగవ్య స్వపనం, అర్చన, పూర్ణాహుతి, మంగళా శాసనంతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### కన్నుల పండువగా సాగిన నగర శోభాయాత్ర

పాత గుంతకల్లు వద్ద వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం నుండి నిర్వహించిన హనుమాన్ నగర శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర, రామాయణ, చతుర్వేద పారాయణములు, మహా కుంభ స్థాపన, ద్వారా తోరణ ధ్వజ కుంభారాధన, ఉప కుంభారాధనలు నిర్వహించారు. అగ్నిముఖము దిశగా 18 కలశాలు, ఉత్సవ మూర్తులను అశేష భక్త జనసంద్రం మధ్య ఊరేగించారు. చిన్నారుల వేషధారణ, మహిళల కోలాటం, గొరవయ్యల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, తహశీల్దార్ రమాదేవి, అనువంశక ధర్మకర్త సుగుణమ్మ, కార్యనిర్వాహక అధికారి మేడేపల్లి విజయరాజు, ఆలయ అధికారులు వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల కన్వీనర్ రామన్నచౌదరి, నాయకులు బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, బిజెపి నాయకులు శేఖన్న, కొలిమి రామాంజనేయులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఢిల్లీలో స్వేచ్ఛగా జీవిస్తున్నా

### బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా

న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత్‌లో స్వేచ్ఛగా ఉండ గలుగుతున్నానని, అయితే తన కుటుంబానికి ఎదురయ్యే హింసాత్మక ఘటనల చరిత్రకారణంగా కొంత అప్రమత్తంగా ఉంటున్నట్లు బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో తన పార్టీని నిషేధిస్తే మిలియన్లకొద్దీ బంగ్లాజనాభా ఎన్నికలను బహిష్కరిస్తారని ఆమె హెచ్చరించారు. అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లా డుతూ తనవల్లనే బంగ్లాదేశ్‌లో అశాంతి పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేసారు. 2024 జులై, ఆగస్టునెలల్లో ఎగిసిన నిరసనలకు క్షమాపణలు చెప్పాల్సిన పనిలేదని, ఇదంతా జాతివ్యతిరేక కుట్రలని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో తాను స్వేచ్ఛగా నివసిస్తున్నానని, కుటుంబ గత ఘటనల చరిత్రకారణంగా బయటకు వెళ్లలేకపోతున్నట్లు చెప్పారు. ఆనాటి బంగ్లాదేశ్ ఆర్మీచీఫ్ వకార్‌ఉజ్‌జమాన్ సలహా మేరకు షేక్ హసీనా బంగ్లాను వీడి భారత్‌కు వచ్చేసారు. తాను బంగ్లాదేశ్‌కు వెళ్లబోనని, తన పార్టీని నిషేధించి అధికారంలోకి వచ్చిన ఏపా లనలో అయినా కూడా తాను బంగ్లాదేశ్‌కువెళ్లనని భారత్‌లోనే ఉంటానని ఆమె స్పష్టంచేసారు. అయితే తాను స్వదేశానికి వెళ్లాలని ఎంతగానో తపిస్తున్నట్లు ఆమె చెప్పారు. సహేతుకమైన ప్రభుత్వం అన్ని పార్టీలను గౌరవించేప్రభుత్వం, రాజ్యాంగ నిబద్ధతను కాపాడే ప్రభుత్వం ఉన్నట్లయితే కచ్చితంగా తాను బంగ్లాదేశ్‌కు వెళతానని చెప్పారు.



# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా కార్తీకమాస పూజలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 29 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఓ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఓ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు. దుర్గమ్మవారిని బుధవారం హైకోర్టు నూతన నా యమూర్తి సుభేందు సమేత దంపతులు దర్శించుకున్నారు. వారికి ఇఓ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో శ్రీ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులతో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ముచ్చటించారు.

# ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీలకురాలిగా అదితా స్వప్న



**హైదరాబాద్,అక్టోబరు 29,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీల కురాలిగా అదితా స్వప్న నియమితుల య్యారు. ఈమేరకు అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ జాతీయ పరిశీ లకురాలిగా బి.అదితా స్వప్నను నియమిస్తూ బుధవారం ఉత్త ర్వులు అందించారు. గతంలో అదితా స్వప్న బీహార్, పుదుచ్చేరి ,అండమాన్,నికోబార్ దీవులకు జాతీయ పరిశీలకురాలిగా విజయవం తంగా పని చేశారు. ఆమె అంకిత భావం, సామర్థ్యంను కాంగ్రెస్ అగ్రనేతల రాహుల్ గాంధీ గుర్తించి, ఆంధ్రప్రదేశ్ బాధ్యతను ఇప్పుడు ఆమెకు అదనంగా అప్పగిం చాలని సూచించడంతో ఈ నియామకం జరిగింది. అదితా స్వప్న మాట్లాడుతూ నాపై విశ్వాసం ఉంచి నూతన బాధ్యతను అప్పగించినందుకు రాహుల్ గాంధీకి, అల్కా లాంబాకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలి పారు. ఆమె నాయకత్వంలో, ఆంధ్రప్రదేశ్‌లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి, రాహుల్ గాంధీ దార్శనికత, నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.




బైక్‌రైడ్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ డా॥ కంచర్లశ్రీకాంత్

## సామాజిక సేవలో యువత భాగస్వామ్యం

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, అక్టోబరు 29 ప్రభాతవార్త: యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్లశ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పంకు చెందిన ముగ్గురు యువకులు కుప్పం నుంచి శ్రీకాకుళం దాకా చేపట్టిన గ్రేట్ ఆంధ్రా రైడ్ కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కుప్పం యువకులు తమ పర్యటనలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు ప్లాస్టిక్ ఫ్రీ లక్ష్యంతో అవగాహన కల్పిస్తారని ఇది మంచి కార్యక్రమం అన్నారు. యువకుల యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్‌సురేష్‌బాబు, కడ సభ్యులు రాజ్‌కుమార్, సుగుణమ్మ, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కార్పొరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్,తిరుమగళ్,రెస్కో డైరెక్టర్ ఆర్ముగం,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వర్సిటీ విస్తృతదిశగా ముందడుగు

## పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏపి ఉపాధ్యక్షుడు ఆచార్య డా. మునిరత్నంనాయుడు

### ఉత్తమ గ్రంథాలకు సాహితీ పురస్కారాల ప్రదానం




హైదరాబాద్ (నాంపల్లి), అక్టోబరు 29 ప్రభాతవార్త : తెలుగు విశ్వవిద్యాలయం కేవలం ఇరు తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్త విస్తృ తదిశగా అడుగులు వేసేందుకు కృషిచేస్తున్నట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉభయ తెలుగురాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో ఏర్పడడం శుభసూచకమన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాల యంలో బుధవారం సాయంత్రం 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు సాహితీ పుర స్కారాల ప్రదానోత్సవం జరిగింది. విశ్వవిద్యాల యం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య డి.మునిరత్నం నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి విశిష్ట అతిథులు ఎస్. రమేష్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణ సేవావిభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రింగు రామమూర్తి తదితరులతో కలిసి 2023 సంవత్సరానికిగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథ రచయితలను ఘనంగా సత్కరించి సాహితీ పురస్కారాలు, ఒక్కొక్కరికి రూ.20,116 నగదు పారితోషికం ప్రదానంచేసి అభినందించి ప్రసంగించారు. ముందుగా హను మంతరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేయగా రామమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు.

చివరిగా ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న రింగు రామమూర్తిని ఉపాధ్యక్షుడు ఘనంగా సత్క రించారు.సాహితీ పురస్కార గ్రహీతలలో పద్యకవిత ప్రక్రియలోని ఉత్తమ గ్రంథం ధర్మపురీ వైభవం రచయిత ఒజ్జల నరహరిశర్మ; వచన కవిత నేను యౌగిక కావ్యం విశ్వర్షి వాసిలి; గేయకవిత తెలంగాణ రుబాయిలు డా. ఏనుగు నరసింహారెడ్డి; బాలసాహిత్యం చందమామ చెప్పిన కథలు డా. ఎం.హరికిషన్; కథ నా నుండి మన వరకు డా. టి.సం పత్‌కు మార్; నవల మాదిగ కొలుపు ఆచార్య పులికొండ సుబ్బాచారి; సాహిత్య విమర్శ ద్విశ్చక్రం ఆదెపు లక్ష్మీపతి; నాటకం రచ్చబండ రావుల పుల్లాచారి; అనువాదం మృత్యుంజయుడు డా. టి.సి.వసంత; వచన రచన తిరుపతి కథలు ఆచార్య వేట శ్రీనివాసులురెడ్డి; రచయిత్రి ఉత్తమ గ్రంథం స్వతంత్రత నుండి స్వాతంత్ర్యానికి డా. జంధ్యాల కనకదుర్గలు ఉన్నారు.

30-10pg6exHMNWJQE 10_30-10pg6exHMNWJQE.qxd 29/Oct/25 10:22 PM Page 1





# అన్నదాత... గుండెకోత

**పంటల సాగుపై మొంథా తుపాను ప్రభావం**



## అన్నదాతలకు అపారనష్టం

**వేల హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు**

శ్రీకాకుళం, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది. తుపాను వల్ల పొలాల్లో నీరు నిలవడం, ఈదురు గాలుల కారణంగా మొత్తం 2,025 హెక్టార్లలోని పంట దెబ్బతింది. ఈ విపత్తు కారణంగా సుమారు 4,801 మంది రైతులు ప్రభావితమైనట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా నివేదికలో వెల్లడించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి వివరాలు వెల్లడించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం, జిల్లాలోని 13 మండలాల్లోని 120 గ్రామాల్లో పంట నష్టం సంభవించింది. నీట మునిగిన/ దెబ్బతిన్న పంటల్లో ప్రధానంగా వరి పంటకే అధిక నష్టం జరిగింది. మొత్తం దెబ్బతిన్న 2,025 హెక్టార్లలో 2,021 హెక్టార్లు వరి పంట కాగా, కేవలం 5 హెక్టార్లు మాత్రమే ఇతర పంటలు ఉన్నాయి. ఇచ్ఛాపురం మండలంలో 1,118 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. పాతపట్నంలో 168 హెక్టార్లలో పంట నష్టం జరిగి, 320 మంది రైతులు ప్రభావితమయ్యారు. నందిగాంలో 150 హెక్టార్లలో పంట నష్టం జరిగి 302 మంది రైతులు ప్రభావితమయ్యారు. వజ్రపుకొత్తూరులో 213 హెక్టార్లలో పంట దెబ్బతిని, 372 మంది రైతులు నష్టపోయారు. ఎచ్చెర్లలో 6 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దెబ్బతిన్న పంటల్లో అధిక శాతం గింజ పడుతున్న దశలో ఉండడం వలన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు, తుది నష్ట అంచనా తర్వాత రైతులను ఆదుకునేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపడతామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అలాగే జిల్లాలో ఉద్యాన పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. జిల్లా ఉద్యానవన శాఖాధికారి రత్నాల వి. వరప్రసాద్ అందించిన నివేదిక ప్రకారం, ప్రధానంగా వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. మొత్తం 11.39 హెక్టార్లలోని జీడి మామిడి పంట, 0.40 హెక్టార్లలోని బొప్పాయి, 0.45 హెక్టార్లలోని అరటి తోటలు, 2 హెక్టార్లలోని కూరగాయల సాగుకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో జీడి మామిడి, పలాసలో కూరగాయల సాగు తీవ్రంగా ప్రభావితమైంది. కవిటి, కంచిలి, వజ్రపుకొత్తూరు మండలాల్లో కలిపి సుమారు 278 కొబ్బరి మొక్కలు నేలకూలి దెబ్బతిన్నాయి. తుపాను ప్రభావం జిల్లాలోని 10 మండలాల్లోని 53 గ్రామాల్లో తీవ్రంగా ఉంది.

## నేలనంటిన వరి పంట

**రూ.90 కోట్ల మేర నష్టం రైతుల్లో కలవరం**

తణుకు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను తీరం దాటింది... తీరం దాటిన సమయంలో భారీ ఎత్తున గాలులు వీచాయి... ఇదే సమయంలో వరి పంటపై విరుచుకుపడిన తుపాను ఇప్పుడు రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. తణుకు పరిసర ప్రాంతాల్లో ఖరీఫ్ పంట ప్రస్తుతం చివరి దశకు చేరింది. మరో వారం పది రోజుల్లో కోతకు వచ్చే దశలో తుపాను ప్రభావంతో నేలనంటింది. ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేలు వరకు పెట్టుబడి పెట్టిన రైతులు చేతికి అందివచ్చిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాత కన్నీటి పర్యంతమవుతున్నాడు. తణుకు నియోజకవర్గ పరిధిలోని ఆయకట్టుపై ఇప్పటికే సుమారు రూ.90 కోట్ల మేర పెట్టుబడి పెట్టారు.

తణుకు నియోజకవర్గ పరిధిలోని ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో 40,100 ఎకరాల విస్తీర్ణంలో 22,500 మంది రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. సాధారణంగా 145 రోజులకు పంట కోతకు వస్తుంది. ఈదురు గాలులకు తట్టుకుంటుందనే ఉద్దేశంతో ఎక్కువ ఆయకట్టు పరిధిలో స్వర్ణ రకం విత్తనం సాగు చేశారు. ప్రస్తుతం పంట పాలు పోసుకునే దశలో, కొంత మేర గింజ గట్టిపడే దశలో ఉంది. ఇప్పటి వరకు సగటున ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే బలమైన ఈదురు గాలులకు చేలలో కొంత భాగం వరి నేలకొరిగింది. దీంతోపాటు చేలల్లో నీరు వచ్చి చేరింది. 10 సెంట్ల భూమిలో పడిన వరిని నిలబెట్టి కట్టాలంటే నలుగురు కూలీలు అవసరమవుతున్నారని, రూ.3 వేలకు పైగా అదనపు ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. గింజ పాలు పోసుకొనే దశలో పడిన వరిని అంచనా ప్రకారం నిలబెట్టి కట్టలు కట్టినా పెద్దగా ప్రయోజనం ఉండదని పైగా వాపోతున్నారు. గింజ నాణ్యత కోల్పోవడం, తాలు గింజలు వంటి సమస్యల కారణంగా దిగుబడి బాగా తగ్గుతుందని ఈ చెబుతున్నారు. సొంత భూమి కొంత ఉంటే మరో నాలుగైదు ఎకరాలు కౌలుకి తీసుకొని సాగు చేస్తున్న రైతులే 80 శాతం మంది ఉన్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. తుపాను ప్రభావం చూపితే ఇప్పటికే చర్యలతో పెట్టిన పెట్టుబడితో పాటు కౌలు చెల్లింపు మరింత భారమవుతుందని రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

## నీళ్లలో టిడ్కో అపార్ట్మెంట్ ఇళ్లు

కావలి (నెల్లూరు), అక్టోబరు 29 ప్రభాతవార్త: ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు ముంథా తుఫాను వలన భారీ వర్షాలు కురవడంతో కావలి పట్టణంలో ఉన్న టిట్కో ఇళ్ల చుట్టూ నీళ్ల చేరి నందున అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు బుధవారం సిపిఎం పార్టీ నాయకులు అక్కడ పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు ఇళ్ల చుట్టూ నీళ్ల చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు. ఇళ్ల నుంచి రోడ్లలో నడవలేని పరిస్థితి ఉన్నదని ఇళ్లలోనే ఉన్నందున జనజీవన పరిస్థితుల్లో కూడా ఇబ్బందిగా ఉన్నదని తెలియజేశారు. ఇప్పటికీ సుమారు వారం రోజుల నుండి వర్షాలు కురుస్తున్నందున తుఫాను వలన పనులు చేసుకునేటువంటి పేదలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సహాయాన్ని అందించి ఆదుకోవాలని వర్షపు నీళ్లు బయటకు వెళ్లేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి సంవత్సరం వర్షాలు కురిసినప్పుడు ఇదే పరిస్థితి ప్రజలు ఎదుర్కొంటున్నారని, ఇది చాలా అన్యాయమని ఎంతోమంది పేదలు ఈ నీళ్లల్లో ఇబ్బందులు పడుతున్నారని వెంటనే టిట్కో ఇళ్ల చుట్టూ రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అక్కడ నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు వై. కృష్ణమోహన్, భోగిశెట్టి కృష్ణయ్య, కె. చెన్నయ్య, ఎస్ కే ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## తాటిచెట్టు పడి మహిళ మృతి

మామిడికుదురు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాను ప్రభావంతో వీచిన పెనుగాలుల కారణంగా తాటిచెట్టు మీద పడడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన గూడపల్లి వీరవేణి (49) అనే మహిళపై తాటిచెట్టు పడి మృత్యువాత పడింది. సమాచారం తెలిసిన వెంటనే పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అప్పటి వరకు కళ్లముందు తిరిగిన వీరవేణి ఆకస్మాతుగా విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలేపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

## ప్రమాదపుటంచున చెరువులు



వింజమూరు (నెల్లూరు), అక్టోబర్ 29, ప్రభాతవార్త: మొంథా తుపాన్ ప్రభావంతో వింజమూరు మండలంలో ఉన్న 31 చెరువులకు గాను 17 చెరువులు పూర్తిగా నిండినట్లు 12 చెరువులకు 75 శాతం నీరు చేరినట్లు, మరో రెండు చెరువులకు 25 శాతం నీరు చేరినట్లు ఇరిగేషన్ డీఈ రమణారావు తెలిపారు. బుధవారం ఇరిగేషన్ డీఈ రమణారావు, ఏఈలు మహేంద్ర, శ్రీనివాసరావు, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డితో కలిసి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊటుకూరు, జువ్విగుంటపాలెం చెరువులు, ప్రమాదపుటంచున ఉన్నాయని, జువ్విగుంటపాలెం చెరువు అలుగు సమీపంలో బండ్ల బాట వద్ద నీరు బయటకు వస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన చెరువు కట్టకు మరమ్మత్తులు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఊటుకూరు చెరువు కట్ట బలహీనంగా ఉందని తొమ్మిది లక్షల రూపాయలతో ప్రతిపాదనలను పంపించడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి కట్ట బలహీనంగా ఉన్న ప్రాంతంలో మట్టిని తోలి చదును చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. నల్లగొండ బొడ్డు వాగు చెరువు, చంద్రపడియ చెరువు, బుక్కాపురం చెరువు, మలపరాజు వాగు చెరువు, శంఖవరం చెరువు, ఊటుకూరు ఊర చెరువు, తక్కెళ్ళపాడు చెరువు, రావిపాడు పెద్ద చెరువు, కాటేపల్లి పెద్ద చెరువు, తమీద పాడు వద్ద చెరువు, బాడవ చెరువు, ఇర్ల చెరువు, నల్లగొండ ఊర చెరువు, కాటేపల్లి ఊర చెరువు, రావిపాడు ఊర చెరువు, బత్తిన వారిపల్లి పెద్ద చెరువు, బొమ్మరాజు చెరువులు పూర్తిగా నిండాయన్నారు. ఎర్రబల్లి పాలెం పెద్ద చెరువు, వింజమూరు పాత చెరువు, రామలింగారెడ్డి పెద్ద చెరువు, ఎర్ర చెరువు, అంకాలమ్మ చెరువు, గుండె మడగల, ఏకమ్మ చెరువు, జువ్వగుంటపాలెం, మిట్ట చెరువు నంది గుంట, ఏకిస్తిపురం పెద్ద చెరువు, ఏకిస్తీపురం గ్రామ చెరువు, నందిగుడి వాగు ఊటుకూరు పెద్ద చెరువు, చింతలపాలెం చెరువు, చాకలి కొండ చెరువులు 75 శాతం నిండాయని తెలిపారు. మోట చింతలపాలెం చెరువు, ఓబులమ్మ చెరువులకు 25శాతం నీరు చేరినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. వారి వెంట ఏగినేని శ్రీనివాసులు రైతులు ఉన్నారు.

## నష్టం కలిగించిన మొంథా



తిరుపతి (జిల్లా డెస్క్), అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాన్ బలహీనపడి తీరం దాటినా తిరుపతి జిల్లాలో భారీ నష్టం కలిగించింది. మొంథా తుఫాన్‌తో గత మూడురోజులు విడవకుండా భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు తిరుపతిజిల్లాలో తిరుపతి రూరల్ మండలం, చంద్రగిరి, రామచంద్రాపురం, రేణిగుంట, ఏర్పేడు ,శ్రీకాళహస్తి, వెంకటగిరి, నారాయణవనం, తుంబూరు, సత్యవేడు, బిఎన్ కండ్రిగ, గూడూరు, తడ, సూళ్ళూరుపేట మండలాల్లో పంటలు నీటమునిగాయి. ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచి దెబ్బతిన్నాయి. బుధవారం ఉదయం వాన ఆగడంతో అనేక మండలాల్లో వరద పరిస్థితులు, పంట నష్టంపై

### నీటమునిగిన పంటలు... బాధితులకు సహాయం

జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, డిఆర్ఒ నరసింహులు, ఆర్‌డిఒ రామ్మోహన్, జిల్లా సివిస్ఒ శేషాచలంరాజుతో కలసి పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో వరదలకు నిరాశ్రయులైన, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలతో మాట్లాడారు. వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి 3వేల రూపాయలు నగదు, 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, చక్కెర, నూనెలు, ఉల్లిగడ్డలు, ఉల్లిపాయలు అందజేశారు. పునరావాస కేంద్రాల నుండి వారి నివాసానికి వెళ్ళే వారికి ప్రతికుటుంబానికి నగదు సాయం అందించారు. ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని యుద్ధప్రాతిపదికన అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వెంకటేశ్వరు నారాయణవనం మండలం తుంబూరు. శ్రీకాళహస్తి, బిఎన్‌కండ్రిగ, కారనిమిట్టరప్రాంతాల్లో వద్ద కాజ్‌వేలను తనిఖీ చేశారు. ప్రజలు చెరువులు, నదీకాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భారీ వరదలతో పంటపొలాల్లోకి నీరు చేరిందని, నీరు పొలాలకు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరికీ సకాలంలో యూరియా సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్టిజిఎస్ కేంద్రం నుంచి మంత్రి లోకేష్ సమీక్ష



సచివాలయం, అక్టోబరు 29 ప్రభాతవార్త: వివిధ జిల్లాల్లో మొంథా తుఫాను తీవ్రత, ఇప్పటివరకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులతో ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. మొంథా తుఫాన్ వల్ల కలిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలు త్వరితగతిన రూపొందించాలని అదికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్దరణపై అధికారులను ఆరా తీశారు. ప్రధానంగా కోనసీమ, కృష్ణా, బాపట్ల, ఎన్టీఆర్, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేట్టాలని అది పార్టీ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని కోరారు. నష్టపరిహారం అంచనా తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పూర్తిగా పరిహారం అందేలా కృషిచేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరిని గుర్తించేలా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. త్రాగునీరు వైద్యసేవలు అందరికి సకాలంలో అందాలని అధికారులను ఆదేశించారు.



## ప్రమాదకరంగా కలుజులు

నెల్లూరు అగ్రికల్చర్, అక్టోబరు 29 ప్రభాతవార్త: పాలకుల అశ్రద్ధ ప్రజలకు శాపంగా మారింది. తుఫాన్లు భారీ వర్షాలు సంభవించిన ప్రతి ఏటా కలుజుల్లో రాకపోకలు సాగించలేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇది ఎక్కడో కాదు నెల్లూరు- తాటిపర్తి మార్గంలో ఉన్న పొట్టేపాలెం కలుజు, ములుమూడి చెరవుఉ కలుజు. ఈ రెండు కలుజుల్లో వర్షాల సీజన్లో రాకపోకలు సాగించే ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు, వామపక్ష పార్టీలు ఈ కలుజులపై బ్రిడ్జిలు నిర్మించమని ధర్నాలు కూడా చేపట్టారు. అయినా పాలకులకు కనువిప్పు కలగలేదు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు మరో సారి అవస్థలు ఏర్పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డ సందర్భాల్లో అధికారంలో ఉన్న నేతలు కలుజు వద్దకు వచ్చి మట్టి కట్టను మరో మారు పటిష్టం చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారానికి మార్గం చూపలేకపోతున్నారు. ఈ మార్గంలో రెండు పుణ్య క్షేత్రాలను వేలాదిగా ప్రజలు నిత్యం సందర్శిస్తుంటారు. ఒకటి వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కాగా, రెండోది జొన్నవాడ కామాక్షితాయి ఆలయం ఉన్నాయి. అంతే కాక ఈ మార్గంలో ఉండే అనేక గ్రామాల నుంచి వేలాదిగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అనేక మంది నెల్లూరులో చిరు ఉద్యోగాలు చేసుకునే వారు సైతం ప్రతి రోజు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. వీరందరికి వర్షాకాలం వచ్చిందంటే గుండెల్లో గుబులు పుట్టుకుంటుంది. నీళ్ల దాటే క్రమంలో ఏమవుతుందో ఏమో నన్న బెంగతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తుంటారు. ఇకనైనా అధికారులు, నేతలు ఈ ప్రాంతాలను మరో మారు పరిశీలించి ఈ రెండు కలుజులపై శాశ్వతంగా బ్రిడ్జిలు నిర్మించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలంతా కోరుతున్నారు.



కోత గురైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు, టిడిపి నాయకులు

## ధ్వంసమైన రోడ్లు... రాకపోకలు బంద్

వెంకటగిరి, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా వెంకటగిరి మండల పరిధిలోని పలు రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి ఆధ్వర్యంలో బృందం మంగళవారం పలు ప్రాంతాలను సందర్శించింది. మొదటగా పాలకొండ సత్రం వరవ కాలువ సమీపంలోని టీబీ పల్లి రహదారిని పరిశీలించారు. వరద నీరు ఎక్కువగా రావడంతో రహదారి పూర్తిగా అధ్వోనస్థితికి చేరిందని, తక్షణమే మరమ్మతు పనులు చేపట్టాల్సిన అవసరముందని చంద్రమోళి రెడ్డి తెలిపారు. తదుపరి పాలెంకోట కల్వర్టును పరిశీలించి, డ్యామ్‌లోని వరద నీటి స్థితిగతులను సమీక్షించారు. డ్యామ్ గేట్ల వద్ద వాల్వులు తుప్పు పట్టి పనిచేయకుండా స్టక్ అయినట్లు గుర్తించడంతో, వెంటనే మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథం, పట్టణ అధ్యక్షులు అవ్వారు సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ సూరి, లాలాపేట సొసైటీ అధ్యక్షులు గొల్లగుంట వెంకటముని, యాతులూరి సొసైటీ అధ్యక్షులు గుత్తికొండ బాబురావు, యూనిట్ ఇంచార్జ్ చాట్ల రాజా, ఆయకట్ట అధ్యక్షులు శ్రీనివాసులు, మండల తెలుగుయువత అధ్యక్షులు పి.ఎం.శివనారాయణ, బూత్ కన్వీనర్ చాట శేఖర్, అక్కుపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆవుల మురళి, పాలెంకోట ఆయకట్ట అధ్యక్షులు ముదిముక్కుల దనయ్య, పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సత్యవేడు టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి

## వరద బాధిత రైతులకు పరామర్శ

బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన వరద బాధిత రైతులను సత్యవేడు టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వెంటనే మొంథా తుఫాను ప్రభావం వలన మండలంలో వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, బొగడలు పడిన చెరువు కట్టలను, కాజ్‌వేలను పరిశీలించారు. కుక్కంబాకం పంచాయతీ బైరవారిగుంట తూముకి బొగడపడి గ్రామంపైకి వస్తున్న నీటి ప్రవాహాన్ని గమనించి గ్రామస్తుల సమక్షంలోనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పునరుద్ధరణ చర్యలు చేపట్టామని ఆదేశించారు. కారణి పంచాయతీలో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుమ్మల కన్నయ్య నాయుడు, మునిచంద్రనాయుడు, మధు నాయుడు, కార్తీక్‌చౌదరి, మనోహర్‌నాయుడు, రవి నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, మండల ఐటీడీపీ రమేష్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పంప్‌హౌస్‌లో ఇరుక్కుపోయిన ముగ్గురు సిబ్బంది

**సురక్షితంగా బయటకు తెచ్చిన యంత్రాంగం**

అద్దంకి, అక్టోబరు 29 ప్రభాతవార్త: గుండ్లకమ్మ నీటిలో చిక్కుకున్న ముగ్గురు రక్షిత మంచినీటి పథక విభాగంలో పనిచేస్తున్న కార్మికులను ఎట్టకేలకు అధికారులు బుధవారం సాయంత్రం బయటకు తీసుకొచ్చారు. అందిన వివరాలు ప్రకారం గుండ్లకమ్మ నది ప్రక్కన ఫారెస్టు సమీపంలో రక్షిత మంచినీటి పథకం పంప్‌హౌస్‌లో మంగళవారం రాత్రి విధులు నిర్వహించేందుకు ఇరువురు సిబ్బంది, నరేంద్ర, బాబురావులను ఊటబావి వద్దకు వెళ్ళారు. కరెంటు లేకపోవడంతో మోటార్ సహాయంతో పంప్‌హౌస్‌ను రన్ చేశారు. ఉదయం డ్యూటీలు మారే సమయంలో వీరి వద్దకు మరో కార్మికుడు చేరుకున్నారు. అయితే కొద్ది సమాయానికే గుండ్లకమ్మ నదిలోనే వరద ఉధృతి పెరిగి, పంప్‌హౌస్ చుట్టూ వరదనీరు చేరి, వీరు బయటకు రాలేక పోయారు. ఫోన్ ద్వారా వీరు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది సహాయంతో పడవ తీసుకొని, అక్కడికి చేరుకున్నారు. అయితే పడవలో వీరిని తీసుకొని ప్రయాణించే సమయంలో బరువు ఎక్కువై పడవ ఒరిగిపోవడంతో చెట్లను పట్టుకొని వదరలో వుండిపోయారు. వెంటనే ఫిష్ రీస్ యూనియన్ నాయకుడు కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో కొందరు జాలర్లు తీసుకొని పడవతో అక్కడికి చేరుకున్నారు. ఆ పడవ సహాయంతో జాలర్లు వీరిని క్షేమంగా ఒడ్డుకు చేర్చినట్లు చీరాల డిఎస్పి ఎండి మొయిన్ వెల్లడించారు. ఈ రిస్క్ ఆపరేషన్‌లో మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, సి.ఐ. సుబ్బారావు, ఫైర్ ఇన్స్పెక్టర్ వెంకటరావు, తహశీల్దార్ శ్రీచరణ్, పట్టణ టిడిపి నేతలు ఆయా శాఖల అధికారులు పాల్గొన్ని సిబ్బందిని క్షేమంగా బయటకు తేవడంపై డిఎస్పి అభినందించారు. జాలర్ల యూనియన్ నాయకుడు కుమార్‌ను జాలర్లను డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ రిస్క్ ఆపరేషన్‌లో సహకరించిన ప్రతి ఒక్కరిని డిఎస్పి అభినందించారు.

30-10P g7exHMNWJQE 11_30-10P g7exHMNWJQE.qxd 29/Oct/25 11:49 PM Page 1





## పొంగిపొర్లుతున్న పాలేరు, మున్నేరు వాగులు

**- నీట మునిగిన వరి, పత్తి, మొక్కజొన్న పొలాలు**

**- ఆంధ్రా-తెలంగాణ రహదారుల్లో రాకపోకలు బంద్**

జగ్గయ్యపేట, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపానుతో కురుస్తున్న భారీ వర్షాలతో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలోగల పాలేరు, మునేరు, వేపలవాగు, ఎర్రకాల్వ, గన్నెచెరువు, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల పరిధిలోని చెరువులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ రోడ్డుమార్గాలపై ప్రయాణాలను నిలిపివేస్తున్నట్లు బ్యానర్లు ఏర్పాటుచేసి, ప్రత్యేక పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. వత్సవాయి మండలం లింగాల వద్ద బుధవారం రాత్రి మునేటి బ్రిడ్జిమీదుగా నీరు ప్రవహిస్తుండటంతో తెలంగాణాకు పోవు ఈరహదారిలో రాకపోకలను నిలిపివేశారు. నందిగామ ఏసిపి తిలక్, స్థానిక సిఐ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ ఎస్ఐ గణేష్‌వర్మ లింగాల మునేటి బ్రిడ్జిని పరిశీలించి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తంచేసి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. జగ్గయ్యపేట పట్టణంలో ఇండ్లలోనికి నీరు ప్రవహిస్తుండటంతో నివాశితులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ కృష్ణారావు, తహసీల్దార్ పెద్ది మనోహర్, నందిగామ ఆర్‌డిఓ బాలకృష్ణ, స్థానిక సిఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, కౌన్సిలర్లు కంచేటి గీతారాణి, వట్టెం మనోహర్ తదితరులు వరద ముంపు ప్రాంతాలను సందర్శిస్తూ బాధితులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సిఐ వెంకటేశ్వర్లు సొంతఖర్చుతో తిరుమలగిరి గ్రామంలో గుడిసెలు ఖాళీచేసిన నిర్వాసితులు దాదాపు 100 మందికి భోజనాలు ఏర్పాటుచేశారు. వారిని ఎంపియుపి పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. జగ్గయ్యపేట డివిజన్‌లో మొక్కజొన్న, పెసర, మినుము 1500ల ఎకరాల్లో సాగులో ఉండగా తుపాను కారణంగా 2 వేల ఎకరాల వరి, 2500ల ఎకరాల పత్తి, 150 ఎకరాల మొక్క పంటలకు నష్ట వాటిల్లినట్లు ప్రాథమిక పరిశీలనలో గుర్తించినట్లు వ్యవసాయ శాఖ ఏడి మీడియాకు తెలిపారు. కాగా స్థానిక దివంగత వ్యాపారి పేరూరి బ్రహ్మ ఉపేంద్రరావు- భారతి ట్రస్టు ఆధ్వర్యంలో పోలీ శ్రీనివాసరావు మున్సిపల్ ఎలక్ట్రికల్ సిబ్బందికి ఏర్పాటుచేసిన రెయిన్‌కోట్లను ఎమ్మెల్యే రాజగోపాల్ చేతులమీదుగా పంపిణీచేశారు.

# జలదిగ్బంధంలో ఒంగోలు





**● ప్రకాశం జిల్లాను వణికించిన మొంథా ● జోరువాన, ఈదురు గాలులతో జనం అవస్థలు ● నేలకొరిగిన చెట్లు, పొంగిపొర్లుతున్న వాగులు ● నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు**

ఒంగోలు, అక్టోబరు 29 ప్రభాతవార్త: సాగర తీరంలోని ఒంగోలు నగరంపై మొంథా తుపాన్ తీవ్ర ప్రభావం చూపింది. బీకర గాలులకు పెద్ద సంఖ్యలో చెట్లు పడిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. జలాశయాలు, నిండుకుండలా మారాయి. దీని ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా జనజీవనం స్తంభించిపోయింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకు వరిగాయి. దూం ప్రాంతాల్లో సముద్రం సుమారు 100 నుండి 150 మీటర్ల మేర ముందుకు వచ్చింది. కెరటాలు ఎగిసిపడడంతో అధికారులు స్థానికులను అప్రమత్తం చేశారు. మంగళవారం అర్ధ రాత్రి వరకు జిల్లాలో వర్షం పడుతూనే ఉంది. జిల్లా యంత్రాంగం ప్రతిష్ట ఏర్పాట్లు చేసింది. జిల్లాలో భారీ, కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిశాయి. అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరికలు చేశారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న దాంతో బుధవారం కూడా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు కలెక్టర్ రాజాబాబు సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా చెరువులు అలుగుపారుతుంటే పొంగిన వాగులు, వంకలతో రహదారులు జలమయమై రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల చెట్లు పడిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఒంగోలు నగరం నీటి మయంగా మారింది. ఏటుచూసినా నీరు.. నీటిలోనే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రవాణా నిలిచిపోయింది. విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఒంగోలు నగరంలోని జవహర్ నవోదయ విద్యాలయం తరగతి గదులు, వంట రూములు నీట మునగడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అదే కొన్ని కార్ల షోరూం లలోకి నీరుచేరింది. వివిధ పనుల నిమిత్తం వాహనాలపై వచ్చిన వారు వరద నీటిలో చిక్కుకుని అవస్థలు పాలయ్యారు. అధికశాతం పొలాల్లోకి వరద నీరు చేరగా పలు చోట్ల పొగాకు, కంది, శనగ పంటలతో ముంపుకు గురవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటల్లోకి మోకాలిలోతు నీరు చేరింది పలు చోట్ల మట్టి ఇళ్లలు కూలిపోయాయి. వర్షాల దాటికి జిల్లాలోని వాగులు, వంకలు, పొంగడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు. పలు కాలనీల్లో వరద నీరు చేరడంతో ఇళ్లను ఖాళీ చేయించి వారిని రక్షిత కేంద్రాలకు తరలించారు. జిల్లాలో 700లకు పైగా చెరువులు ఉండగా దాదాపు అన్ని ఇప్పటికే నిండి పోయి అలుగు పారుతున్నాయి. మొంథా తుఫాన్ దాటికి కంభం చెరువు కూడా అలుగు పారుతుంది. ఆసియాలోనే రెండో అతి పెద్ద చెరువు అయిన కంభం చెరువు నిండి అలుగు పారుతుంది. ఒంగోలు- కర్నూలు రోడ్డు మార్గంలో సంతనూతలపాడు చెరువులో వరద నీరు బుధవారం ఉదృతంగా ప్రవహిస్తుంది. దీంతో సంతనూతలపాడు- ఒంగోలు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యలో పేర్నమిట్ట చెరువు నుంచి కూడా వరద ప్రవాహం పెరగడంతో ఈ నీరంతా ఒంగోలు శివారు ప్రాంతాలకు చేరింది. ప్రధానంగా పోతురాజు కాలువకు ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి భారీగా వరద వచ్చింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, సంతనూతలపాడు ప్రాంతంలో పర్యటించి వరద సహాయక చర్యలు చేపట్టారు. ఒంగోలు నగరంలోని వెంగముక్కల పాలెం, ఎరజర్ల గ్రామాల మధ్య నల్లవాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఒంగోలు, కొత్తపట్నం మండలం మధ్య అల్లూరు వద్ద నల్లవాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



## శ్రీశైలం ఘాట్‌రోడ్‌లో విరిగిపడ్డ కొండచరియలు

- హైదరాబాద్ - శ్రీశైలం - దోర్నాల మధ్య రాకపోకలకు అంతరాయం

శ్రీశైలంప్రాజెక్టు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాన్ ప్రభావంతో శ్రీశైలంకు హైదరబాద్ నుండి, దోర్నాల వైపు నుండి రాకపోకలు అంతరాయం ఏర్పడింది. హైదరబాద్ నుండి శ్రీశైలంకు వచ్చే వాహనాలకు డ్యాం సమీపంలో కొండరాళ్లు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వీటిని తొలగించేందుకు స్థానిక టుటౌన్ సిఐ చంద్రబాబు సిబ్బందితో కలసి సంఘటన స్థలికి చేరుకుని జెసిబి సహాయంతో బండరాళ్లను తొలగించడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి. అదే విధంగా ప్రకాశం జిల్లా దోర్నాల వైపు నుండి శ్రీశైలంకు వచ్చే వాహనాలకు చెంచు గిరిజన గూడెం – తుమ్మలబైలు ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడి చెట్లు అడ్డుపడంతో వాటిని తొలగించే క్రమంలో వాహనాలను దోర్నాల్లోనే నిలిపివేయడం జరిగింది. శ్రీశైలం నుండి దోర్నాల వైపు వెళ్లే వాహనాలను శిఖరం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా వారికి ఉదయం పులిహోరాతో పాటు అల్పాహారంగా ఉప్మా, మధ్యాహ్నం బిస్కెట్లును, సాంబారన్నం, పెరుగు అన్నంను పంపిణి చేసారు. శ్రీశైలంలోని పాతళగంగ వద్ద కొండచేరియలు విరిగిపడ్డాయి. సమీపంలో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. లింగాలగట్టు చిన్న బ్రిడ్జి వద్ద వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. అటవీశాఖకు చెందిన నివాసం గోడ కూలిపోయింది. దోర్నాల నుండి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఎట్టకేలకు పునర్ధరించారు. తుపాన్ ఎడతేరిపి లేకుండా కురుస్తుడడంతో శ్రీశైలం, సుండిపెంట కాలనీల్లో రోడ్లన్ని జలమయంతో పొంగి పోర్లుతున్నాయి.

## ప్రాణాలను కాపాడిన డ్రోన్లు

బాపట్ల జిల్లా బ్యూరో, అక్బోరు 29 ప్రభాతవార్త: మొంథా తుఫాను సహాయక చర్యల్లో భాగంగా పరిస్థితి అంచనా వేసేందుకు ప్రభుత్వం డ్రోన్లను వినియోగించింది. బాపట్ల జిల్లా పర్చూరు వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తిని డ్రోన్ ద్వారా అధికారులు గుర్తించారు. వెంటనే అలెర్టు కావడంతో వాగులో కొట్టుకుపోతున్న షేక్ మున్నా అనే వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఇదే కాకుండా.. లోతట్టు ప్రాంతాలను అధికారులు, పోలీసులు డ్రోన్ల సాయంతో పర్యవేక్షి ంచారు. ఏమైనా ప్రమాదకర పరిస్థితులుంటే అధికార యంత్రాంగం వెంటనే అలెర్ట్ అయి సహాయక చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల కొట్టుకుపోతున్న పశువులను డ్రోన్ల ద్వారా గుర్తించి ఒడ్డుకు చేర్చారు.



# ఆత్మకూరులో జలప్రళయం

**వరదనీటితో లోతట్టు ప్రాంతాల ప్రజలు విలవిల**

**వీఆర్‌ఎస్పీ గేట్లు ఎత్తివేత... స్తంభించిన రాకపోకల బంద్**



ఆత్మకూరు, అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాన్ దెబ్బతో ఆత్మకూరులో ఒక్కసారిగా జలప్రళయం ప్రజలపై వచ్చిన్నట్లు కనిపించింది. తెల్లవారి చూసే సరికి కాలనీలు, రోడ్లు, చెరువులు, కుంటలు, వాగులు, నదులు, ప్రాజెక్టులు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆత్మకూరు - దోర్నాల వెళ్లే ఘాట్ రోడ్డులో నల్లమల అటవీ ప్రాంతంలో గత రాత్రి నుంచి ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్, అర్బన్ సిఐ రాము, రూరల్ సిఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి పర్యవేక్షణలో రాకపోకలు బంద్ చేశారు. శ్రీశైలం విజయవాడ, దోర్నాల, అమరావతి, ఒంగోలు, మార్కాపురం వెళ్లే వాహనాలను నంద్యాల మీదుగా పోలీసు అధికార యంత్రాంగం మళ్లించారు. మండల పరిధిలోని శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం, వడ్లరామాపురం, కురుకుంద, ముష్టపల్లి, పెద్దఅనంతాపురం, సిద్దాపురం అలుగు గ్రామాలలో ఉధృత్తంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు పంట నష్టం వాటిలింది. జిల్లా ఉన్నాతాధికారుల ఆదేశాలతో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే మున్సిపల్ కార్మికులతో లోతటు ప్రాంతాలలో నిలిచిన వరదనీటిని, డ్రైనేజి కాల్వల ద్వార పంపించే విధంగా తమ సిబ్బందిని అప్రమత్తం చేసుకోని విధి నిర్వహనలో ముందుకు వెళ్లారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల రాకపోకలను డిఎస్పీ రామాంజి నాయక్ పర్యవేక్షణలో సిఐ రాము, రూరల్ సిఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డిలతో ఉధృతం ప్రవహించే వాగుల వద్ద ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూశాఖ మండల తహశీల్దార్ రత్నరాధిక పర్యవేక్షణలో వీఆర్ఓలు, సచివాలయ నిబ్బందిని అప్రమత్తం చేసి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, పునరావాస కేంద్రాలపై ఎప్పటికప్పుడు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో కొనసాగించారు. ఆర్‌డిఓ నాగజ్యోతి ఆధ్వర్యంలో అన్ని మండలాల ప్రజా సమ్యలపై పర్యవేక్షణ చేశారు. మొంథా తుపాన్‌తో జలప్రళయం తట్టుకునే విధంగా ధైర్యం కల్పించారు. వీఆర్‌ఎసీ ్ప డ్యామ్ 3గేట్లు ఎత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



## కొట్టుకుపోయిన కల్వర్టు

**అనంతగిరిలో 110 గ్రామాలకు రాకపోకలు బంద్**

అనంతగిరి(అల్లూరి జిల్లా), అక్టోబరు 29 ప్రభాతవార్త: మొంథా తుపాన్ బీభత్సానికి అనంతగిరి మండలంలో గెడ్డలు పొంగి పొర్లుతుండడంతో.. దాదాపు 110 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. తాడిగుడ జలపాతంకు వెళ్లే రహదారిలో కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. మారుమూల గ్రామాల గిరిజనుల జనజీవనం స్తంభించింది. అరకులోయ చోంపికి వెళ్లే మార్గంలో వరద నీటి ఉదృత అధికమవడంతో.. అటువైపు రాకపోకలను రెవెన్యూ, పోలీసు అధికారులు నిషేధించారు. దీంతో.. 45 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కాగా, మరోపక్క లుంగుపార్తి పంచాయతీ పులుసు మామిడి దగ్గర రైగండువా ప్రాంతంలో కొండ చరియలు విరిగి పెద్ద పెద్ద బండరాళ్లు రహదారికి అడ్డంగా పడడంతో.. సమీపంలోని 5 పంచాయతీ పరిధిలో వున్న 73 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గిరిజనులు పడుతున్నారు.

## దంపతులు ఆత్మహత్య



భీమడోలు(ఏలూరు), అక్టోబరు 29 ప్రభాతవార్త: కలుపుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన భీమడోలు గ్రామానికి చెందిన దంపతులు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. భీమడోలు గ్రామంలోని యువ దంపతులు గుండుమోలు సుధాకర్, భానుపూర్ణిమలు ఐదేళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వారికి మూడేళ్ళ కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల భార్య భానుపూర్ణిమను గ్రామానికి చెందిన యువకుడు కఠారి మోహన్ గ్రామాంతరం తీసుకెళ్లడంతో సుధాకర్ కుటుంబ సభ్యులు భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఈనెల 7వ తేదీన కిడ్నాప్ కేసు పెట్టారు. 10రోజులు అనంతరం భానుపూర్ణిమ భర్త సుధాకర్ వద్దకు ఇంటికి తిరిగి రావడంతో భార్య భర్తలు భానుపూర్ణిమ, సుధాకర్‌లను పెద్దలు తాత్కాలికంగా దూరంగా ఉంచారు. ఈనేపథ్యంలో అవమానభారంతో ఉన్న సుధాకర్ దంపతులు భీమడోలు శివారు వ్యవసాయ క్షేత్రంలో శనివారం సాయంత్రం కలుపు మందుత్రాగి వీడియో సందేశం సోషల్ మీడియాలో పెట్టారు. ఈమేరకు భాను పూర్ణిమ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కఠారి మోహన్ తనకు కుంకుమలాంటిది పూసి మాయమాటలు చెప్పి గ్రామం నుంచి బలవంతంగా తీసుకెళ్లాడని, మోహన్ అనే వ్యక్తి తమ జీవితంలోకి రావటం వల్ల తాము మానసికంగా కుంగిపోతున్నామని, తమకు పోలీసులు న్యాయం చేయాలన్నారు. సుధాకర్ మాట్లాడుతూ తన బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలని తలిదండ్రులను కోరారు. విషం తాగేముందు రాతపూర్వకంగా లేఖ రాసి, వీడియో తీసి సన్నిహితులకు పంపారు. లేఖపై ఇరువురు సంతకాలు చేశారు. వెంటనే గమనించిన బంధువులు వీరిని గ్రామంలో ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఏలూరు అక్కడ నుంచి గుంటూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భార్య భానుపూర్ణిమ సోమవారం రాత్రి, భర్త సుధాకర్ మంగళవారం అర్ధరాత్రి 2గంటలకు చికిత్స పొందుతూ విరిద్దరూ మృతిచెందడంతో భీమడోలు గ్రామంలో విషాదఛాయలు అలుకున్నాయి. ఇ ప్పటికే కేసు నమోదు కావడంతో రెండు రోజుల క్రితమే అరెస్టు చేసి మోహన్‌ను రిమాండ్‌కు పంపారు. భీమడోలు ఎస్ఐ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది



**- ఆర్టీజీఎస్ నుంచి సీఎం ఇచ్చిన సంహాలు, ఆదేశాలతో సత్ఫలితాలు - 99.1శాతం విధుల్లో వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది -రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**

విజయవాడ, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రణాళిక బద్ధంగా ముందస్తు చర్యలు తీసుకుని మొంథా విపత్తు నుంచి రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు కాపాడారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సుదీర్ఘ పరిపాలనా దక్షత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ పెద్దగా తీసుకున్న చర్యల కారణంగానే ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పేర్కొన్నారు. వాతావరణ శాఖ నుంచి తుపాన్ తీవ్రతపై హెచ్చరికలు వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు సచివాలయంలోని "రియల్ టైం గవర్నెస్ సిస్టమ్" (కేంద్ర)లోనే ఉంటూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ సచివాలయాల వరకు తీసుకోవాల్సిన చర్యలపై ఇచ్చిన సూచనలు, ఆదేశాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా జారీచేసిన ఎస్‌ఓపీ (ప్రామాణిక విధివిధానాలు) వల్ల వైద్యులు, సిబ్బంది విధులు నిర్వర్తించారని, 99.1శాతం వరకు విధుల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్లో మంత్రి సత్యకుమార్ బుధవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు.

**కేంద్రం నుంచి ప్రధాని మోదీ భరోసా**

రాష్ట్ర సంరక్షకుడిగా ఉన్న చంద్రబాబుతో ప్రధాని మోదీ స్వయంగా మాట్లాడడమే కాకుండా వివరాల సేకరణ కోసం పీఎం కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటరును ఏర్పాటుచేశారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా కూడా తనతో మాట్లాదారని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం భరోసా ఇచ్చిందని తెలిపారు. ప్రసవానికి దగ్గర్లో ఉన్న సుమారు 2,500 మంది గర్భిణులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. యాంటీ స్నేక్ వీనం, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్, ఇతర అత్యవసర మందులను జిల్లాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మత్స్యకారులు ఉండే ప్రాంతాల్లో బోటు క్లినిక్‌లను సైతం ఏర్పాటుచేశామని తెలిపారు. అత్యవసర (108), 104 (సంచార వైద్యం) కొన్ని అంబులెన్సులను సహాయక చర్యల నిమిత్తం ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. 588 అత్యవసర కాల్స్‌కు తగ్గట్లు చర్యలు తీసుకున్నామన్నారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల జారీ నుంచి వైద్య ఆరోగ్య శాఖ పూర్తి స్థాలో అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టిందని, కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా వ్యవహరించారన్నారు.

## గుంటూరు పగిడిపల్లి- మోటమర్రి విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ ఆధునీకరణ

సచివాలయం, అక్టోబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి: గుంటూరు పగిడిపల్లి–మోటమర్రి –విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగు పరచడానికి చేసిన ప్రతిపాదనను ఆమోదించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం దాదాపు రూ.188.31 కోట్లు. ప్రస్తుతం, 1న 25 కెవి సామర్థంతో విద్యుత్ ట్రాక్షన్ అందుబాటులో నున్న ఈ వ్యవస్థను 2న 25కెవి విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థగా పెంపు చేసే ప్రతిపాదనను ఇప్పుడు రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదించింది. విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను పునరాభివృద్ధి చేయడంలో ప్రధానంగా సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్ల మరియు ప్రస్తుత వ్యవస్థలో అదనపు కండక్టర్లను వ్యవస్థాపించడం ఉంటాయి. కేంద్ర రైల్వే అశ్విని వైష్ణవ్ ఈ ప్రాజెక్టు మంజూరు సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ విజయవాడ చాలా రద్దీగా ఉండే రైల్వే మార్గమనిపగిడిపల్లిగుంటూరు మరియు విష్ణుపురం మోటుమర్రి సెక్షన్ సికింద్రాబాద్ మరియు విజయవాడ మధ్య ప్రత్యామ్నాయ మార్గంగా పనిచేస్తుందని అన్నారు. ఈ మార్గంలో మరిన్ని రైళ్లను నడపడానికి, పగిడిపల్లిగుంటూరు మరియు విష్ణుపురం – మోటమర్రి సెక్షన్‌లో ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్‌ను 2న25 కెవి ట్రాక్షన్ సిస్టమ్‌ను మెరుగుపరచాలని రైల్వే నిర్ణయించింది.
ఈ సెక్షన్‌ను రాబోయే 3 సంవత్సరాలలో రూ.188 కోట్ల పెట్టుబడితో మెరుగుపరుస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోకి వస్తుంది. పగిడిపల్లి గుంటూరు మరియు మోటమర్రి విష్ణుపురం మధ్య మొత్తం ప్రాంతం దాదాపు 337 రూట్ కిలోమీటర్లు మరియు సింగిల్ లైన్ విభాగం. పగిడిపల్లి గుంటూరు మధ్య ఉన్న ఈ విభాగం తెలంగాణ రాజధాని నగర ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని నగర ప్రాంతం మరియు దేశంలోని తూర్పు ప్రాంతాలతో అనుసంధానించే కీలకమైన ప్రాంతం. మోటమర్రివిష్ణుపురం మధ్య ఉన్న విభాగం సరుకు రవాణాకు, ముఖ్యంగా బొగ్గు రవాణాకు చాలా ముఖ్యమైనది. మిషన్ విద్యుదీకరణలో భాగంగా ఎలక్ట్రిఫికేషన్ పూర్తయింది మరియు ట్రాక్షన్‌లో మార్పు అవసరం లేకుండా ప్యాసింజర్ , సరుకు రవాణా రైళ్ల సజావుగా నడపడానికి సహాయపడింది. ఎలక్ట్రిక్ ట్రాక్షన్ సిస్టమ్ అధిక వోల్టేజ్‌తో విద్యుత్ సరఫరాను అందిస్తుంది తద్వారా అధిక వేగంతో మరియు ఎక్కువ సామర్థంతో రైళ్లను నడపడానికి సహాయపడుతుందని మంత్రి తెలిపారు. ఈ వ్యవస్థ ప్యాసింజర్ మరియు సరుకు రవాణా రైళ్ల రెండింటినీ మరింత సమర్థవంతంగా సజావుగా నడపడంలో సహాయపడుతుందని రైల్వే మంత్రి వెల్లడించారు.


# విద్యుత్ సిబ్బంది సేవలు భేష్!

**ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి విధులు నిర్వర్తించారు**

**నూరు శాతం విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు**

**ఏపీ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ప్రశంసలు**

విజయవాడ, అక్టోబర్ 29 ప్రభాతవార్త ప్రతినిధి: మొంథా తుపాను సమయంలో విద్యుత్ సరఫరాకు ఎదురైనా ప్రతికూల పరిస్థితులను సైతం అధిగమించి సమర్ధవంతంగా విద్యుత్‌ను ప్రజలకు అందించేందుకు సిబ్బంది చేసిన సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కొనియాడారు. మొంథా తుపాను నేపథ్యంలో గత వారం రోజులుగా ఎప్పటికపుడు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైతే తుపాను ప్రభావం ఉందో ఆయా ప్రాంతాలకు దాదాపు 11000 మందికి పైగా వివిధ క్యాడర్ల సిబ్బందిని మోహరించి పకడ్బందీ ప్రణాళికతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ల ఆధ్వర్యంలో ఎప్పటికపుడు వచ్చిన సూచనలు, ఆదేశాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నట్లు సీఎస్ తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు మెరుగైన అత్యవసర సేవలు అందించామని ఆయన పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ఎంతో సాహోసోపేతంగా విద్యుత్ పునరుద్ధరణ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడైతే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఆటంకాలు ఉన్నాయో, ఆయా ప్రాంతాల్లో ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా ప్రజలకు విద్యుత్ సరఫరా చేశామని, రేపటిలోగా నూరు శాతం విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఎపి ట్రాన్స్‌కోకు సంబంధించి 220కెవి సబ్ స్టేషన్‌లు 9, 400 కేవీ సబ్‌స్టేషన్‌లు 4, 132 కేవీ సబ్ స్టేషన్లకు సంబంధించిన 11 సమస్యలు తలెత్తాయని వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకున్నట్లు సీఎస్ తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అహర్నిశలు కృషి చేసిన డిస్కాముల సీఎండీలు పృథ్వీ తేజ్, ఎల్.శివశంకర్, పి.పుల్లా రెడ్డిలతో పాటు జెన్కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జెఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, వారి ఆధ్వర్యంలో పనిచేసిన సిబ్బందిని సిఎస్ ఈ సందర్భంగా అభినందించారు.



# మహిళల వన్డే వరల్డ్ కప్‌లో భారత్ ఫైనల్ చేరేనా?

## వర్షం ఎఫెక్ట్: ఆసిస్‌తో నేటి సెమీస్ సందిగ్ధం!






**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్-2025 ఫైనల్‌కు చేరుకునే విషయంలో టీమిండియా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. నేడు ఆస్ట్రేలియాతో సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉండగా, వర్షం కారణంగా అది జరగడంపై సందిగ్ధత నెలకొంది. మర్నాడు రిజర్వ్ డే రోజున కూడా వర్షం పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్ ఈ నెల 30న జరుగుతుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగే ఈ మ్యాచ్ కోసం రెండు జట్లు మైదానంలో తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఇంతలో, ఈ మ్యాచ్ గురించి వాతావరణ శాఖ కీలక సమాచారం అందించింది. వర్షం మ్యాచ్‌కు అంతరాయం కలిగించే అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. కొంకణ్‌కు దక్షిణంగా ఉన్న అల్పపీడన ప్రాంతం కారణంగా ముంబైలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రాబోయే 48-72 గంటల్లో ముంబైలో బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఇది భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగే రెండవ సెమీఫైనల్‌ను ప్రభావితం చేసే వీలుంది. ఈ నెల 30న మ్యాచ్ జరిగే సమయంలో నవీ ముంబైలో మధ్యాహ్నం వర్షం పడే అవకాశం 69 శాతం ఉంది. ఈ రోజు మొత్తం 3.8 మి.మీ. వర్షం పడే వీలుంది. అయితే సెమీఫైనల్స్, ఫైనల్స్ కోసం నిర్వాహకులు రిజర్వ్ డేలు కేటాయించారు. కానీ, అక్టోబర్ 31న నవీ ముంబైలో కూడా వర్షం పడే అవకాశం ఉంది. దీని వలన మ్యాచ్‌రద్దు అయ్యే అవకాశం ఉంది. రిజర్వ్‌డే రోజున వర్షం కారణంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరగకపోతే, అది ఆస్ట్రేలియాకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుస్తుంది. ఎందుకంటే, ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు వారు ఒక్క మ్యాచ్‌కూడా ఓడిపోలేదు. వర్షంకారణంగా మ్యాచ్‌రద్దు అయితే, పాయింట్ల పట్టిక ఆధారంగా ఫైనల్ నిర్ణయించబడుతుంది. అంటే, అత్యధిక పాయింట్లు సాధించిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ విధంగా, ఆస్ట్రేలియా 13 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, భారతదేశం 6 పాయింట్లతో నాల్గవ స్థానంలో ఉంది. ఈ సందర్భంలో, ఆస్ట్రేలియా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో సెమీఫైనల్ జరిగే రోజున వర్షం రాకుండా ఉండాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.



# పారిస్ మాస్టర్స్‌లో అల్కరాజ్ ఘోర ఓటమి



**న్యూఢిల్లీ:** పారిస్ మాస్టర్స్‌లో ప్రపంచ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ ఓటమిపాలయ్యాడు. కామెరాన్ నోరీ చేతిలో ఘోర పరాజయం చెందాడు. బ్రిటన్‌కు చెందిన కామెరాన్ వరల్డ్ టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌ను 4-6, 6-3, 6-4 తేడాతో ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుని ఎటిపి మాస్టర్స్ 1000 స్థాయిలో స్పెయిన్ ఆటగాడు 17 మ్యాచ్‌ల విజయ పరంపరకు ముగింపు పలికాడు. టోక్యోలో సీజన్‌లో తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత, ఆరుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ అయిన అల్కరాజ్ తన ఆటకు దూరంగా ఉన్నాడు. తదుపరి పారిస్ మాస్టర్స్‌లో కామెరాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 అనవసర తప్పిదాలు చేశాడు. మొదటి సెట్ గెలిచిన తర్వాత, అల్కరాజ్ జోరును కొనసాగించడంలో విఫలమయ్యాడు. అయితే నోరీ క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు. ప్రపంచ 31వ ర్యాంక్ ఆటగాడైన కామెరాన్ చివరి సెట్‌లోని ఏడవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు మరియు రెండు గంటల 22 నిమిషాల తర్వాత మ్యాచ్‌ను కైవసం చేసుకోవడానికి సర్వ్‌ను పట్టుకున్నాడు. మార్చి తర్వాత ఫైనల్‌కు ముందు అల్కరాజ్ ఓటమి మొదటిసారి. మయామి ఓపెన్ వరకు సాగిన అతని ఆధిపత్యం మాస్టర్స్ 1000 టోర్నమెంట్‌తో నిలిపివేసాడు, ఈ సమయంలో అతను మోంటే కార్లో, రోమ్ మరియు సిన్సినాటి టైటిళ్లను గెలుచుకున్నాడు. ఈ వారం ఇటలీకి చెందిన జానిక్ సిన్నర్ పారిస్ టైటిల్‌ను కైవసం చేసుకుంటే అల్కరాజ్ సంవత్సరాంతపు ప్రపంచ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

## కెనడియన్ మహిళల ఓపెన్

# అనాహత్ సంచలన విక్టరీ

**న్యూఢిల్లీ:** కెనడియన్ మహిళల ఓపెన్-2025లో భారత్‌కు చెందిన టీనేజ్ సంచలనం అనహత్ సింగ్ సంచలన విజయం సాధించింది. 2025 కెనడియన్ ఉమెన్స్ ఓపెన్‌లో అనాహత్ సింగ్ ప్రపంచ నం.7 బెల్జియంకు చెందిన టిన్నె గిలిస్‌ను ఓడించి మరో భారీ విజయాన్ని నమోదు చేసింది. 17 ఏళ్ల ఆమె డిఫెండింగ్ ఛాంపియన్ మరియు మాజీ ప్రపంచ క్రీడల ఛాంపియన్ బెల్జియన్ సూపర్ స్టార్‌ను వరుస గేమ్‌లలో 12-10, 11-9, 11-9 తేడాతో ఓడించి తన తొలి పిఎస్ఎ సిల్వర్ సెమీఫైనల్‌కు చేరుకుంది. ఇది అనాహత్ కెరీర్‌లో అతిపెద్ద విజయమే కాకుండా మొదటిసారిగా, ఆమె ప్రపంచంలోనే టాప్10 ర్యాంక్‌లో ఉన్న క్రీడాకారిణిని ఓడించింది. 16వ రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన మెలిస్సా అల్వెస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో టాప్ 20లో ఉన్న క్రీడాకారిణిపై 3-1 తేడాతో విజయం సాధించిన తర్వాత ఈ టోర్నమెంట్‌లో అనాహత్ సాధించిన రెండవ ప్రధాన విజయం ఇది. ఇప్పుడు సెమీఫైనల్‌లో, అనహాత్ ఇంగ్లాండ్‌కు చెందిన 4వ సీడ్ గినా కెన్నెడీతో తలపడనుంది, ఆమె కెనడియన్ నంబర్ 1 హోలీ నాటన్‌పై విజయం తర్వాత ఇంటి ఆశలను తుడిచిపెట్టుకుంది.

## వరుణుడి ఎఫెక్ట్

# ఆసీస్‌తో తొలి టి20 రద్దు

### భారత్ 9.4 ఓవర్ల 97 రన్స్ వద్ద బ్రేక్

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా అర్ధంతరంగా రద్దు అయ్యింది. కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్ వేదికగా బుధవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్ వరుణుడు అడ్డుతగలడంతో, రెండు పవర్‌హౌస్ జట్ల మధ్య పోరు అర్ధంతరంగా నిలిచిపోయింది. ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. భారత జట్టు ఇన్నింగ్స్ ప్రారంభమైన కాసేపటికే వర్షం అంతరాయం కలిగించింది. కొంత విరామం తర్వాత ఆటను ఒక్కో జట్టుకు 18 ఓవర్లకు కుదించారు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (19 పరుగులు) త్వరగా ఔటైనా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించారు. వీరిద్దరూ దూకుడుగా ఆడుతూ ఆస్ట్రేలియా బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు. ముఖ్యంగా సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 39 పరుగులు) తనదైన శైలిలో సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను ఉర్రూతలూగించాడు. గిల్ (20 బంతుల్లో 37 పరుగులు) కూడా అతనికి చక్కటి సహకారం అందించాడు. భారత జట్టు 9.4 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 97 పరుగులు చేసిన తరుణంలో, వర్షం మళ్లీ ప్రారంభమైంది.




ఈసారి వర్షం తీవ్రత ఎక్కువగా ఉండడంతో, ఆట నిలిచిపోయింది. వర్షం తగ్గుముఖం పడుతుందని ఎదురుచూసినప్పటికీ తగ్గకపోవడం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండవ టీ20 మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 31 న జరగనుంది.

# ఆసియా యూత్ గేమ్స్‌లో ఫైనల్స్‌కు ఆరుగురు బాక్సర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా యూత్ గేమ్స్-2025లో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. ఐదుగురు బాలికలు మరియు ఒక బాలుడు సహా ఆరుగురు బాక్సర్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. అలాగే పురుషుల విభాగంలో అనంత్ దేశ్‌ముఖ్ బలమైన సెమీఫైనల్ పరుగు తర్వాత భారత్ ఒక కాంస్య పతకాన్ని కూడా నిర్ధారించింది. బహ్రెయిన్‌లోని మనామాలో జరిగిన బాలికల సెమీఫైనల్స్‌లో, ఖుషీ చంద్ (46 కిలోలు) మంగోలియాపై 5:0 తేడాతో విజయం సాధించి భారత ఆధిపత్య పరుగును ప్రారంభించింది. ఆ తర్వాత చంద్రిక భోరేషి పూజారి (54 కిలోలు) తన ప్రత్యర్థి కజకిస్తాన్‌పై 5:0 తేడాతో విజయం సాధించగా, హర్నూర్ కౌర్ (66 కిలోలు) అద్భుతమైన సంయమనం, ఎదురుదాడి ప్రదర్శించి చైనీస్ తైపీని (5:0) ఓడించగా, అన్షిక (+80 కిలోలు) మరో క్లీన్ స్వీప్‌లో చైనాను చిత్తు చేసింది. ఇక సెషన్ 2లో, అహానా (50 కిలోలు) ఉజ్బెకిస్తాన్ నుండి వచ్చిన కఠినమైన సవాలును అధిగమించి పట్టుదలను ప్రదర్శించి 3:2 తేడాతో గెలిచింది. అలాగే బాలుర విభాగంలో లాంచెన్‌బా సింగ్ మోయిబుంగ్‌ఖోంగ్‌బామ్ (50 కిలోలు) పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియాపై 5:0 ఏకగ్రీవ విజయంతో తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించి ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు.




అలాగే అనంత్ దేశ్‌ముఖ్ (66 కిలోలు) కజకిస్తాన్‌కు చెందిన బలమైన ప్రత్యర్థిపై పోరాడినా సెమీఫైనల్‌లో ఓడి కాంస్య పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. దీంతో ఆరుగురు ఫైనలిస్టులతో పాటు, ఒక కాంస్య పతకంతో భారత్ అత్యంత విజయవంతమైన యూత్ బాక్సింగ్ ప్రచారంలో ఒకటిగా నమోదు చేసింది.

# ఐపిఒకు సిద్ధమవుతున్న ఆకాశ ఎయిర్‌లైన్స్

**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** దేశీయ విమానయాన సంస్థ ఆకాస ఎయిర్ వచ్చే ఐదేళ్లలో ఐపిఒకు రావాలనినిర్ణయించింది. వచ్చే ఏడాది రెండో అర్ధసంవత్సరంనుంచి కూడా పైలట్లను నియమించుకునేందుకు కసరత్తులు ప్రారంభించినట్లు సంస్థ సిఇఒ వెల్లడించారు. నష్టాల్లో నడుస్తున్న ఆకాశ భారత్‌లో మూడో అతిపెద్ద ఎయిర్‌లైన్‌గా నిలుస్తోంది. బోయింగ్‌నుంచి విమానాల డెలివరీలో ఉన్న జాప్యం కారణంగా పైలట్లకు సరిపడా విధుల్లేవు.
అంతేకాకుండా వారానికి ఏడురోజులప నిపై వర్క్‌ఫోర్స్ సమ్మెకూడా సంస్థకు కొంత సమస్యలు తెచ్చిపెట్టింది. బోయింగ్ జాప్యాలే తమకు ప్రధాన సమస్యగా ఉన్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్‌లు చెపుతున్నారు. వచ్చే 60 రోజుల్లో పైలట్లు నూరుశాతం పనిగంటలు నిర్వర్తిస్తారని, వారంతా కాక్‌పిట్‌లోకి రాగలరని ఆకాశ సిఇఒ వినయ్‌దూబే వెల్లడించారు. ఐపిఒకు ముందు మూలధన సేకరణ అవసరం లేదని ఇప్పటికే రహస్యమార్గంలో నిధులు కొంతమేర సేకరించినట్లు సిఇఒ వివరించారు. మాకు 30 విమానాలు రావాల్సి ఉందని చెప్పిన సిఇఒ ఈ ఏడాది ఆకాశ ఎన్ని విమానాలు రాబడుతుందన్నది మాత్రం చెప్పలేదు. 2026 అక్టోబరునాటికి ఆకాశకు మొత్తం 54 విమానాలు ఉంటాయని తెలుస్తోంది. 2027 మార్చి నాటికి అయితే మొత్తం 72 విమానాలు తమ సంస్థపేరిట ఉంటాయన్న ధీమాతో ఉంది.




## వాణిజ్యం

# ఈక్విటీ సూచీలకు ఎనర్జీ, మెటల్ స్టాక్స్ మద్దతు

### లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, అక్టోబరు 29:** స్టాక్ మార్కెట్లు మరోసారి లాభాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్‌దోరణులు, ఇన్వెస్టర్ సెంటిమెంట్లు బలపడటంతో కొనుగోళ్లుపెరిగాయి. అంతేకాకుండా అమెరికా ఫెడ్‌రిజర్వు నిర్ణయాలపైనా ఇన్వెస్టర్లు ఆసక్తిచూపించారు. వీటితోపాటుగానే అమెరికా చైనా వాణిజ్య ఒప్పందం వంటివి కీలకం అయ్యాయి. నిఫ్టీ 26,050 స్థాయిని దాటింది. ఇంధనం, మెటల్‌స్టాక్స్ లాభాలకు మద్దతిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 368.97 పాయింట్లుపెరిగి 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 117.70 పాయింట్లుపెరిగి 26,053.90 పాయింట్లవద్ద నిలిచింది. ఆదాని పోర్ట్స్ అండ్ సెజ్ 2.78శాతం, ఆదాని



ఎ ంటర్‌ప్రైజెస్ 1.65శాతం, రిలయన్స్ 1.14శాతం పెరిగి సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.68శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.56శాతం పెరిగింది. బిఎస్ఇలో 2446 స్టాక్స్ పెరిగితే 1727 స్టాక్స్ దిగజారాయి. 162 కంపెనీలు యధాతథంగా నిలిచాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 88.29గా నడిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.55శాతంపెరిగి 1,21,530కి చేరాయి. అలాగే అమెరికా పదేళ్ల బాండ్లు 0.18శాతంపెరిగి 3.990గా నిలిచాయి. కమోడిటీ మార్కెట్లపరంగా బ్రెంట్ ముడిచమురు డిసెంబరు కాంనరటాక్టుల్లో 11 సెంట్లు లాభపడి 17శాతంపెరిగి బ్యారెల్‌కు 63.94 డాలర్లుగా నడిచింది. వరుణ్ బేవరేజెస్ 9.31శాతం పెరిగితే టాటాక్యాపిటల్ 1.37 శాతం క్షీణించింది. శ్రీసిమెంట్ 2.16శాతం, ఆదాని గ్రీన్ ఎనర్జీ 10.80 శాతం, ఆదాని టోటల్ గ్యాస్ 2.15శాతం, గో డిజిటల్‌జనరల్ ఇన్సూరెన్స్ 1.23శాతం, మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ 6.07శాతం పెరిగాయి. ఫిషర్ మెడికల్ వెంచర్స్ 7.24శాతం దూసుకువెళ్లింది. డిసిఎం శ్రీరామ్ కూడా 2.17శాతం, పిఎన్‌జిఎస్ గార్గి ఫ్యాషన్ జ్యూవలరీ 20శాతం ఒక్కసారిగాపెరిగాయి. ఐపిఒలపరంగా ఓర్క్లా ఇండియా 1,24,14,260 షేర్లకు బిడ్లు సాధించింది. ఆఫర్‌లో 1,59,99,104 షేర్లను ప్రకటించింది. ఇష్యూలో 0.78రెట్లు కొనుగోళ్లు జరిగాయి.

# డిజిటల్ చెల్లింపుల్లో 'యుపిఐ' రికార్డు




**న్యూఢిల్లీ, అక్టోబరు 29:** భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌యూపీఐ తన రికార్డులు సృష్టిస్తోంది. 2025 మొదటి అర్ధభాగంలో యూపీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగి 106.36 బిలియన్లకు చేరింది. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 143.34 లక్షల కోట్లుగా నమోదైంది.
దేశంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలను వరల్డ్‌లైన్ సంస్థ తన ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ (హెచ్1 2025)లో బుధవారం వెల్లడించింది. యూపీఐ ద్వారా జరిగే సగటు లావాదేవీ విలువ తగ్గడం గమనార్హం.
2024 ప్రథమార్థంలో సగటున రూ. 1,478గా ఉన్న లావాదేవీ విలువ, 2025 ఇదే కాలంలో రూ. 1,348కి తగ్గింది. టీ కొట్టు, కిరాణా దుకాణం నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు చిన్న చిన్న, రోజువారీ కొనుగోళ్లకు ప్రజలు యూపీఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది సూచిస్తోంది. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి (పి2బి) చేసే లావాదేవీలు 37 శాతం వృద్ధితో 67.01 బిలియన్లకు చేరాయి. దేశంలోని చిన్న, సూక్ష్మ వ్యాపారాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో భారత్‌లో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మర్చంట్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఈ వృద్ధికి అనుగుణంగా చెల్లింపుల మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. దేశంలో క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 2024 జనవరితో పోలిస్తే 111 శాతం పెరిగి 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరింది.
అలాగే, పాయింట్‌ఆఫ్‌సేల్ (పీఓఎస్) టెర్మినళ్ల సంఖ్య 29 శాతం వృద్ధితో 11.2 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు క్రెడిట్ కార్డుల వాడకం ప్రీమియం ఖర్చులకు సాధనంగా మారుతోంది. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 23 శాతం పెరిగింది.
అయితే, చిన్న చెల్లింపులు యూపీఐ వైపు మళ్లడంతో పీఓఎస్ వద్ద డెబిట్ కార్డుల వాడకం దాదాపు 8 శాతం తగ్గింది. మొత్తం మీద మొబైల్ చెల్లింపులు 30 శాతం వృద్ధితో 98.9 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వీటి విలువ రూ. 209.7 ట్రిలియన్లుగా ఉంది.


# విదేశీ పసిడినిల్వలను భారత్‌కు తరలిస్తున్న ఆర్బీఐ




**ముంబయి, అక్టోబరు 29:** భారత రిజర్వ్ బ్యాంక్ తన బంగారు నిల్వలను భారీగా స్వదేశానికి తరలిస్తోంది. విదేశీ ఖజానాల్లో దాచిన పసిడిని తిరిగి భారత్‌కు తీసుకు రావడంపై దృష్టి సారించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇతర దేశాలు విధిస్తున్న ఆర్థిక ఆంక్షల నుంచి తమ ఆస్తులను కాపాడుకునేందుకే ఆర్‌బీఐ ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే ఆర్‌బీఐ సుమారు 64 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించింది. సెప్టెంబర్ చివరి నాటికి భారత్ వద్ద మొత్తం 880.8 టన్నుల బంగారం నిల్వలు ఉండగా, అందులో 575.8 టన్నులు ఇప్పుడు దేశీయ ఖజానాల్లోనే భద్రంగా ఉన్నాయి. మిగిలిన 290.3 టన్నుల పసిడిని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద ఉంచారు. మరో 14 టన్నులు గోల్డ్ డిపాజిట్ స్కీమ్‌లలో ఉన్నాయి. రష్యాఉక్రెయిన్ యుద్ధం, ఆఫ్ఘనిస్థాన్‌ను తాలిబన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత జీ7 దేశాలు ఆయా దేశాల విదేశీ మారక నిల్వలను స్తంభింపజేసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల తర్వాత 2023 మార్చి నుంచి ఆర్‌బీఐ విదేశాల నుంచి ఏకంగా 274 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తీసుకొచ్చింది. విదేశాల్లోని ఆస్తుల భద్రతపై ఆందోళనల కారణంగానే ఆర్‌బీఐ ఈ చర్యలు చేపట్టింది. బుధవారం భారత మార్కెట్లలో బంగారం ధరలు పెరిగాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయం వెలువరించనున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో పసిడి ధరలు పెరగడం దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 10 గ్రాముల బంగారం ధర ఫ్లాట్‌గా రూ.1,19,647 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 0.34 శాతం (రూ.401) పెరిగి రూ.1,20,047 వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర కూడా కిలోకు 0.69 శాతం (రూ.989) పెరిగి రూ.1,45,331కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సుపై 0.2 శాతం పెరిగి 3,957.42 డాలర్ల వద్ద ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధరలు దాదాపు 52 శాతం పెరిగాయి. అక్టోబర్ 20న ఔన్సుకు 4,381.21 డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, వడ్డీ రేట్ల కోతపై అంచనాలు, ఆర్‌బీఐ వంటి కేంద్ర బ్యాంకులు కొనుగోళ్లు కొనసాగించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

# రూ.1500 కోట్ల ఐపిఒకు బోట్ సిద్ధం!

**ముంబయి, అక్టోబరు 29:** దేశీయ ఎలక్ట్రానిక్స్ కంపెనీ బోట్ రూ.1500 కోట్ల పబ్లిక్ ఆఫరింగ్‌కు సెబీ ఆమోదం సాధించింది. ఐపిఒ తాజా ఇష్యూగారూ.500 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది. అలాగే ఆఫర్ ఫర్‌సేల్ ద్వారా రూ.1000 కోట్లు ప్రస్తుత ఇన్వెస్టర్లనుంచి సమీకరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఒఎఫ్ఎస్ విభాగంలో సమీర్ అశోక్ మెహతా రూ.75 కోట్లవిలువైన షేర్లను విక్రయిస్తారు.



అలాగే అమన్ గుప్తా రూ.225 కోట్లు, సౌత్‌లేక్ ఇన్వెస్ట్‌మెంట్ రూ.500 కోట్లు షేర్లను విక్రయిస్తుండగా రూ.150 కోట్లు ఫైర్‌సైడ్ వెంచర్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్-1, మరో 50 కోట్లు క్వాల్‌కామ్ వెంచర్స్ ఐపిఒలో విక్రయించనున్నాయి. 2013లో గురుగ్రామ్‌లో స్థాపించిన బోట్ ఆడియోగేర్లు, స్మార్ట్ వేరబుల్స్, వ్యక్తిగత గ్రూమింగ్ ఉత్పత్తులతోపాటు మొబైల్ యాక్సెసరీస్‌ను కూడా తయారీ విక్రయాలుచేపట్టింది. గతంలో రూ.2వేల కోట్ల ఐపిఒకు దరఖాస్తుచేసింది. ఇందులో 900 కోట్లు తాజా ఇష్యూగాను, ఒఎఫ్ఎస్ 1100 కోట్లుగాను ప్రకటించింది. అయితే బోట్ 2025లో లాభదాయకత సంస్థగా మారింది. నష్టాలను తగ్గించుకుంటూ వస్తోంది. రూ.60 కోట్లనుంచి తగ్గుతూ వస్తోంది. రాబడులు 3098 కోట్లకు పెరిగాయి. ఆడియోవిభాగంలోనే అమ్మకాలు పెరగడంతో విపరీతమైన రాబడులు సాధించగలిగింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14